

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
చిత్తూరు
సోమవారం,21 ఆగస్టు 2017 | 16



■ రమణీయం.. పల్లకీసేవ



శ్రీకాళహస్తి విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలలో ఆఖరి రోజైన ఆదివారం పల్లకీసేవ వైభవంగా జరిగింది. ముక్కంటి ఆలయం నుంచి స్వామివార్లతో బయలుదేరిన మూడు పల్లకీల విశేషోత్సవం రమణీయంగా సాగింది. జ్ఞానాంబికను భక్తులు వీక్షించేందుకు వీలుగా పల్లకీలో ముందు దర్పణాన్ని అమర్చారు. 16



మనల్ని కంటారు.. మన భవిత గురించి బంగారు కలలు కంటారు. మన విలాసాలు తీర్చడానికి ఎన్నెన్నో అవసరాలను వద్దనుకుంటారు. మన కడుపు నింపడానికి పస్తులుంటారు. మనకు కష్టమొస్తే దుఃఖిస్తారు. అనుక్షణం మన క్షేమం కాంక్షిస్తారు. మనకు రెక్కలొచ్చాక పక్కకు తప్పుకుంటారు. కాదు..తప్పుకునేలా చేస్తున్నాం. దిద్దుకోలేని తప్పు చేస్తున్నాం.వృద్ధులైన అమ్మానాన్నల్ని ఆదరించండి. పట్టెడు ప్రేమను పంచండి. అపశ్రుతులు లేకుండా పండుటాకుల సంధ్యారాగం సాగిపోనీయండి.

పండుటాకుల సంధ్యారాగం..

వివరాలు 9లో..

లాస్‌ఏంజల్స్‌లో చిత్తూరు పతాక

7

అమెరికాలోని లాస్‌ఏంజల్స్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పోలీస్ అండ్ ఫైర్ టెన్నిస్ డబుల్స్ పోటీలలో ఇద్దరు భారతీయులు బంగారు పతకం సాధించారు. వారిలో ఒకరు చిత్తూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రామ్‌కుమార్ కాగా మరొకరు చండీఘఢ్ ఎస్పీ ఆశీష్‌కపూర్. ఇంతటి ఘన విజయాన్ని సాధించి ఆదివారం చిత్తూరుకు తిరిగి వచ్చిన రామ్‌కుమార్‌కు ఘనస్వాగతం లభించింది.



ఆధార్ వివరాలు ఇస్తేనే జీతాలు

6



కోడిపందేల స్థావరంపై

పోలీసుల దాడులు

● 17 మంది అరెస్టు, 14 వాహనాల స్వాధీనం

వివరాలు 3లో..

వాన కురిసింది.. పైరు మురిసింది

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో జిల్లా అంతటా పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా తిరుపతి, చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, పెనుమూరు, పూతలపట్టు, మదనపల్లెలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో వర్షాలు కురిసాయి. వానలు బాగా కురుస్తుండడంతో పలు చోట్ల వరి నాట్లు మొదలయ్యాయి. ఇప్పటికే కొన్నిచోట్ల వాడు తగిలిన వేరుశనగ మళ్లీ వానలకు పుంజుకుంది. ఈ వానలు ఇలాగే సంతృప్తికరంగా కొనసాగితే బోర్లలోకి నీరు చేరుతుందని రైతులు ఆశిస్తున్నారు.

వివరాలు 7వ పేజీలో



తిరుపతిలో ఆదివారం రాత్రి భారీ వర్షం...



గుడుపల్లెలో జోరుగా వరి నాట్లు...



పుంగనూరు ఎస్సీ గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

అయ్యో..గిరిపుత్రులకు ఎన్ని కష్టాలో?

గిరిజన గురుకుల పాఠశాలలో వసతులు కరువు ● ఏడాదైనా టీచర్ల కొరత ● రుచి, శుచిలేని భోజనం

అంతంతమాత్రంగానే వార్డెన్ పర్యవేక్షణ ● జ్వరాలతో ఇబ్బందులు ● పాఠశాలకు పంపమంటున్న తల్లిదండ్రులు

పుంగనూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గతేడాది ప్రారంభించిన గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిండా కష్టాలే. గురువులు లేక చదువు వెనకబడుతోంది. రుచి, శుచిలేని భోజనం కారణంగా ఆరోగ్యం క్షీణిస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎస్టీ హాస్టళ్లను రద్దు చేసి ఆస్థానంలో గురుకుల పాఠశాలలుగా మార్పు చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినా ని యామకాలు చేపట్టలేదు. సౌకర్యాలు లేకపోవడంతో పిల్లల్ని తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. వార్డెన్, అధికారులు బలవంతంతో చేర్పించారు. పుంగనూరు మేలుపట్లలో గతంలో ఉన్న ఎస్టీహాస్టల్‌నే ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలగా మార్చారు. గతంలో వార్డెన్‌గా ఉన్న సుప్రజ కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో ఈ విద్యా సంవ త్సరం ప్రారంభం నుంచి స్థానిక ఎస్సీ హాస్టల్ వార్డెన్ ప్రమీలను జిల్లా గిరిజనసంక్షేమశాఖాధికారి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమించారు. కానీ ఆమె మూడు రోజులకోసారి పిల్లలకు అవసరమైన సరుకులు సిబ్బంది వద్ద ఇచ్చి వెళ్లడంతో పర్యవేక్షణలోపించింది. వాచ్‌మ్యాన్ మహిళ కూడా రాత్రిలో పాఠశాలకు తాళం వేసి ఇంటికి వెళుతోందని విద్యార్థులు చెబుతున్నారు. ప్రస్తుతం 3, 4, 5, 6 తరగతుల విద్యార్థినులు 50 మంది వున్నారు. ఇంగ్లీషు మీడియం బోధనలుండాల్సి ఉండగా అన్ని తరగతులకు ఒకే ఒక్క టీచరున్నారు. తమతో మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నారని, చేయకపోతే ఇంటికి పంపివేయడం, లేదా కొడతారని విద్యార్థులు వాపోతున్నారు. సమస్యలు ఎవరికైనా చెపినట్లు తెలిస్తే కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతులు కడిగే షింక్ పాచికట్టేసింది. దోమల బెడద కారణంగా పది మంది విద్యార్థులు జ్వరాల బారినపడి ఇళ్లకు వెళ్లిపోయారు.. టీచర్లులేరు, భోజనం సరిగాలేదు, వసతులులేవు, దోమలు తదితర సమస్య కారణంగా స్కూల్‌కు పంపడంలేదని తల్లిదండ్రులంటున్నారు. అయితే అధికారులు తనిఖీకి వస్తే మాత్రం హాస్టల్ శుభ్రం చేస్తారని ఆరోపిస్తున్నారు. పనిచేసే సిబ్బంది సరుకులు దర్జాగా ఇళ్లకు తీసుకెళుతున్నారని ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని వాపోయారు. మాపై ఏదైనా చర్యలు తీసుకుంటే మీపై లెటర్ రాసి చనిపోతామని అధికారులను వార్డెన్, సిబ్బంది హెచ్చరిస్తున్నారట. ఈ విషయంపై ఇన్‌చార్జి వార్డెన్ ప్రమీల మాట్లాడుతూ టీచర్ ఒక్కరే ఉన్నారని, భోజనం విషయంలో పలుమార్లు వంటవారికి గట్టిగా చెప్పడంతో మార్పు వచ్చిందన్నారు. తాను ఎస్సీ హాస్టల్ వార్డెన్ అని, ఈ పాఠశాల అదనపు బాధ్యత అ న్నారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు తప్పించాలని పలుమార్లు అధికారులకు లేఖలు పెట్టుకున్నానని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా గిరిజన బాలికల గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





నాసిరకంగా ఉన్న భోజనం - పాచిపట్టిన హ్యాండ్‌వాష్ సింక్

నంద్యాల ఉప ఎన్నికల్లో జిల్లా టీడీపీ నేతల ప్రచారం

చిత్తూరు అర్బన్/చిత్తూరు టౌన్: నంద్యాల నియోజకర్గ ఉప ఎన్నికల పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. గెలుపు కోసం టీడీపీ, వైసీపీలు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ తమ వంతు సేవలందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా టీడీపీ శ్రేణులు కూడా పెద్దఎత్తున నంద్యాల తరలివెళ్లాయి. పార్టీ అధిష్ఠానం కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు పర్యటిస్తూ టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లా నుంచి వెళ్లిన పార్టీ మండలాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తల ప్రధాన సమన్వయకర్తగా ఎమ్మెల్సీ దొరబాబు వ్యవహరిస్తున్నారు. కాగా, జిల్లాకు చెందిన మంత్రి అమరనాథరెడ్డి, శాప్ ఛైర్మన్ పీఆర్ మోహన్X , ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, రెస్కో ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్పీ జయచంద్ర నాయుడు, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు బద్రీనారాయణ, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు వల్లేరు అమరనాథ నాయుడు తదితరులు నంద్యాల నియోజకవర్గంలో జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిని గెలిపించి నంద్యాల అభివృద్ధికి సహకరించాలని ఓటర్లను కోరుతున్నారు.

నంద్యాల వెళ్లిన ఎస్పీ ...

ఈనెల 23న నంద్యాల ఉప ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. ఈ మేరకు డీజీపీ ఆదేశాలతో ఆదివారం ఎస్పీ రాజశేఖర్‌బాబు నంద్యాల బయలుదేరి వెళ్లారు. వారం రోజులపాటు ఆయన అక్కడే ఉంటూ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అనంతరం 25న ఎస్పీ జిల్లా కేంద్రానికి చేరుకోనున్నారు.



నంద్యాలలో ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా టీడీపీ అభ్యర్థి బ్రహ్మానంద రెడ్డితో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ రెడ్డి

అక్రమ కేసులకు భయపడేది లేదు

కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మిడి



మాట్లాడుతున్న కాపు జేఏసీ నేత ఇమ్మిడి

చిత్తూరు రూరల్: కాపునేతలు ముద్రగడ పద్మనాభం తదితరులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మిడి సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం నగర ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులస్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల జీవితాల్లో వెలుగుల నింపేందుకు ముద్రగడ చేపట్టిన ఆకలి ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్ళాలని కోరారు. కాపుల ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయలేదనీ, ఎన్ని కష్టాలొచ్చినా ముందుకెళ్ళాలని పిలుపునిచ్చారు. అన్నింటా కాపులు వెనుకబడి ఉన్నారనీ, కాపు జేఏసీ ఏర్పాటుతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పేర్కొన్నారు. కాపులను బీసీల్లో చేర్చే అంశంపై ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును వివరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్న నేతలపై తప్పుడు కేసులు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు కాపులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలనీ, లేదంటే వచ్చే రోజుల్లో ఉద్యమం ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు మధుసూదన్ రాయల్, ప్రభాకర్, టిక్కిరాయల్, కిశోర్, రామ్మూర్తి, ఏకే శరవణ తదితరులు పాల్గొన్నారు.

28నుంచి తిరుమలనంబి అవతార మహోత్సవాలు

ఆంధ్రజ్యోతి, తిరుమల: తిరుమలలో ఈనెల 28, 29వ తేదీల్లో శ్రీవైష్ణవాచార్యులైన తిరుమలనంబి అవతార మహోత్సవాలు జరగనున్నాయి. శ్రీవారి ఆలయ దక్షిణ మాడవీధిలోని తిరుమలనంబి సన్నిధిలో రెండ్రోజులపాటు ప్రత్యేక పూజా కైంకర్యాలను నిర్వహిస్తారు. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన ఆయన తిరుమలలోనే జన్మించారు. ఈయన శ్రీవారికి తీర్థ కైంకర్యం చేసేవారు. భగవద్రామానుజులకు మేనమామ. గురుతుల్యులు. తిరుమలనంబి రామానుజులకు రామాయణపఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది. అవతారమహోత్సవాల సందర్భంగా 28న తాతాచార్య వంశీకుల ఆధ్వర్యంలో వాల్మీకి రామాయణ పారాయణం, వేదపారాయణం చేస్తారు. 29న తాతాచార్య వంశీకులకు సన్మానం, తిరుమలనంబి సేవలు, కైంకర్యాలపై సదస్సు జరగనుంది. 24మంది శ్రీవైష్ణవ పండితులు ఈ సదస్సులో ఉపన్యసిస్తారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ ప్రత్యేకాధికారి డాక్టర్ వీజీ చొక్కలింగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఒంటికాలిపై నిలబడి వ్యవసాయ విద్యార్థుల ధర్నా



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తిరుపతి రూరల్: ఐసీఏఆర్ అనుమతిలేని వ్యవసాయ కాలేజీల్లో డిగ్రీలు పొందిన వారిని ఉద్యోగాల్లో ప్రోత్సహించేలా ప్రభుత్వం విడుదల చేసిన జీవో 64ను రద్దుచేసి, ఆ ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని కోరుతూ తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం నిరసన తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ కళాశాల ప్రధానగేటు వద్ద విద్యార్థులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. దాదాపు 15 రోజులుగా తాము ధర్నా చేస్తున్నా సంబంధిత వర్సిటీ అధికారులు, పాలకులు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. జీవో 64పై హైకోర్టు స్టే ఇచ్చినా విశ్వవిద్యాలయం పాలకులు స్పందించే వరకు ఆందోళన విరమించేదిలేదని విద్యార్థులు అన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

మంత్రి అమరనాథరెడ్డి



పెద్దపంజాణి: తరతరాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి అమరనాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దపంజాణి మండలంలో అస్తవ్యస్థంగా ఉన్న గ్రామీణ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నీ అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పెద్దపంజాణి మండలంలో రాయలపేట నుంచి రాగిమాకులపల్లె వరకు, గౌనివారిపల్లె నుంచి కూరగాయల కొత్తపల్లె వరకు, ఎర్రదిమ్మనపల్లె నుంచి గుండ్లపల్లె వరకు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. అదే విధంగా కల్లుపల్లె క్రాస్ నుంచి చౌడేపల్లె రోడ్డు 13 కిలోమీటర్ల రోడ్లు వెడల్పు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రమాదాలకు నిలయాలుగా ఉన్న మలుపులు పూర్తిస్థాయిలో తొలగిస్తూ రహదారి వెడల్పు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ఘర్షణకు దారితీసిన 'చవితి' చందా

టాస్క్‌ఫోర్స్ పోలీసులపై యువకుల దాడి



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు - గ్రామస్థులు ధ్వంసం చేసిన వ్యాను

బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్ కండ్రిగ మండలంలోని పద్మావతీపురం గ్రామంలో వినాయక చవితి చందాల విషయమై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులపై గ్రామస్థులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కేటీ రోడ్డులోని పద్మావతీపురం వద్ద కొందరు యువకులు రోడ్డుపై వెళ్ళేవారి నుంచి వినాయక చవితికి చందాలు వసూలు చేస్తున్నారు. అదే సమయంలో ఈ మార్గంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెన్నైలో ఓ కేసు విచారణ చేపట్టి తిరిగి వస్తుండగా పద్మావతీపురం యువకులు ఆపి, చందాలు అడిగారు. వాహనంలో ఉన్న ఓ పోలీసు రూ.10 ఇచ్చారు. పది రూపాయ లేనా ఇచ్చేది అంటూ ఓ వ్యక్తి అసభ్యంగా మాట్లాడడంతో పోలీసులు అతడిపై ఓ దెబ్బ వేశారు. దీంతో అక్కడ ఉన్న వారు ఘర్షణకు దిగారు. తాము టాస్క్ ఫోర్స్ పోలీసులమని చెప్పినా వినకుండా గ్రామస్థులందరూ ఏకమై పోలీసులపై దాడికి దిగారు. వారి వ్యాను డోరును విరగ్గొట్టారు.దీంతో పోలీసులు వాహనాన్ని అక్కడే వదిలి బీఎన్‌కండ్రిగ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ రామమోహన్ కు తెలిపారు. ఎస్ఐ సిబ్బందితో వెళ్లి గొడవను సర్దుబాటు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐని వివరణ కోరగా... విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు.

తిరుమల ఘాట్‌లో జీపు బోల్తా

- ముగ్గురు భక్తులకు తీవ్రగాయాలు
- ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కారణం
- డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన ప్రయాణికులు



ధ్వంసమైన జీపు - గాయపడిన భక్తులు

తిరుమల: మొదటి ఘాట్‌లో ఓ జీపు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన శశిధర్ తన జీపులో శ్రీవారి భక్తులను ఎక్కించుకుని ఆదివారం ఉదయం తిరుపతికి బయల్దేరాడు. 16వ మలుపు వద్దకొచ్చేసరికి జీపు అదుపుతప్పి బోల్తాపడింది. అప్పటికీ వేగం అదుపుకాక ఐదడుగుల మేరకు క్రాష్‌బ్యారియర్‌ను రాజుకుంటూ ముందుకెళ్లింది. దీంతో వాహనంలోని నందకుమార్, శాలిని, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. మీనాకుమారి, మణివన్నన్, చంద్రన్, భాస్కర్, అరివల్లదన్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను 108 అంబులెన్స్‌లో తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని లాతూర్, తమిళనాడులోని విల్లుపురానికి చెందిన వారని తెలిసింది. ఇదిలా ఉంటే డ్రైవర్ శశిధర్ సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ఇలా జరిగిందని భక్తులు వాపోయారు.

సంఘటనా స్థలంలోనే డ్రైవర్‌కు ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని టీటీడీ ట్రాన్స్‌పోర్టు డీఐ భాస్కర్‌నాయుడు ఇతర సిబ్బంది పక్కకు తొలగించి, ట్రాఫిక్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మట్టి వ్యాపారం తెచ్చిన తంటా

- దిగువసాంబయ్యపాళెలో ఇరువర్గాల దాడులు
- 16 మందికి తీవ్ర గాయాలు



దాడుల్లో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

తొట్టంబేడు: తొట్టంబేడు మండలంలోని దిగువసాంబయ్యపాళెం గ్రామంలో ఆదివారం మట్టి వ్యాపారం విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన దాడుల్లో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... దిగువసాంబయ్యపాళెంకు చెందిన వీరారెడ్డి గ్రావెల్ మట్టిని ట్రాక్టర్ల ద్వారా శ్రీకాళహస్తిలో విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని ప్రభుత్వం భూమి నుంచి గ్రావెల్‌ను తరలిస్తుండటంతో గ్రామానికి చెందిన దగ్గోలు ఈశ్వరరెడ్డి, మునిరెడ్డి, వెంకటరెడ్డి అనే ముగ్గురు అన్నదమ్ములు వారం క్రితం అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి.కాగా, ఆదివారం ఈశ్వరరెడ్డి, మునిరెడ్డి, వెంకటరెడ్డి వారి పొలాలకు గతంలో గ్రావెల్ తీస్తున్న ప్రభుత్వ భూమి మీదుగా రోడ్డు వేసే ప్రయత్నం చేశారు. దానిని వీరారెడ్డి, అతడి అనుచరులు అడ్డుకోవడంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీనిపై ఈశ్వరరెడ్డి, మునిరెడ్డి, వెంకటరెడ్డి శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు.అదే సమయంలో వీరారెడ్డి వర్గీయులు ప్రత్యర్థుల ఇళ్ళలో ఉన్న మహిళలతో ఘర్షణకు దిగడంతో ఇరువర్గాలు దాడులు చేసుకున్నారు.ఈ ఘటనలో ఈశ్వరరెడ్డి వర్గానికి చెందిన మునిరెడ్డి (55), ప్రభాకర్(23), పోలిరెడ్డి(31), సుబ్బమ్మ (45), వెంకటసుబ్బమ్మ (55), ఈశ్వరరెడ్డి (52), అలాగే వీరారెడ్డి(60),ఆయన అనుచరులు అంకమ్మ (55), వెంకటరెడ్డి (35), బాలాజీరెడ్డి (30), వెంకటలక్ష్మి (40), కృష్ణారెడ్డి (28), రామిరెడ్డి (63), మునెమ్మ (55), చెల్లారెడ్డి (49), గంగమ్మ (60) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు గ్రామానికి వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలిచారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి

పలమనేరు: పట్టణంలోని పాతపేట ఫారెస్టు గెస్ట్ హౌస్ సమీపంలో ఆదివారం ఉదయం ట్రాక్టర్ ఢీ కొన్న ప్రమాదంలో మహ్మద్ నిజాం (7) అనే బాలుడు మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న బాలుడ్ని ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం 108 సిబ్బంది కిషోర్, శివ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చేర్పించిన కొద్ది క్షణాలకే నిజాం మృతి చెందాడు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మహ్మద్ నిజాం

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడులు

- 17 మంది అరెస్టు, 14 వాహనాల స్వాధీనం

పెనుమూరు / చిత్తూరు అర్బన్: పెనుమూరు మండలం చిన్నకలికిరి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పాకాల, పెనుమూరు, పూతలపట్టు పోలీసులు దాడులు జరిపారు. 17 మందిని అరెస్టు చేసి, 14 వాహనాలు, రూ.60వేల నగదు, మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. పెనుమూరు, పూతలపట్టు సరిహద్దు ప్రాంతమైన చిన్నకలికిరిలో ఏళ్లుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. తిరుపతి, పీలేరు, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల నుంచి నిత్యం అధికసంఖ్యలో పందెంరాయుళ్లు ఇక్కడికి వస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న డీఎస్పీ సుబ్బారావు దాడులు చేయాలంటూ పోలీసులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఆదివారం పూతలపట్టు, పాకాల, పెనుమూరు పోలీసులు సిబ్బందితో కలసి చిన్నకలికిరి చేరుకున్నారు. పలువురు పరారు కాగా, కొందరు పోలీసులపైనే తిరగబడ్డారు. ఎట్టకేలకు 17 మందిని అదుపులోకి తీసుకుని, 12 ద్విచక్రవాహనాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు 17 మొబైళ్లు, రూ.60వేల నగదును స్వాధీనం చేసుకుని నిందితులను పూతలపట్టు స్టేషన్ తరలించారు. కాగా, పట్టుబడిన వారిలో పలువురు ప్రముఖులు,ఉద్యోగులు,వ్యాపారులు ఉండడంతో వదిలేయాలని రాజకీయ ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది.



నిందితులను విచారిస్తున్న ఎస్ఐలు

ద్విచక్రవాహనాలపై విరిగిపడిన ఎలక్ట్రానిక్ రైల్వే గేటు!

ఒకరికి తీవ్ర గాయాలు ● దెబ్బతిన్న ద్విచక్రవాహనాలు



విరిగిపోయిన రైల్వే గేట్‌కు మరమ్మతులు చేస్తున్న రైల్వే సిబ్బంది - విరిగిపోయిన రైల్వే గేటును రోడ్డుపక్కన వేసిన దృశ్యం

ములకలచెరువు: ముంబై-చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం ద్విచక్రవాహనాలపై ఎలక్ట్రానిక్ రైల్వే గేటు విరిగిపడడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదంలో ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి.స్థానికుల కథనం మేరకు... తిరుపతి నుంచి గుంతకల్లు ప్యాసింజర్ రైలు వెళ్తుండడంతో ములకలచెరువు పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ రైల్వే గేటును సిబ్బంది వేశారు. రైలు వెళ్లిన అనంతరం గేట్లు తెరిచేందుకు ప్రయత్నించగా ఒక గేటు తెరచుకోలేదు. దీంతో సిబ్బంది రెండు గేట్లను తెరిచేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఒక గేటు పైకిలేచి మధ్యలోకి విరిగిపోయింది. ఆ సమయంలో గేటు కింద వెళ్తున్న ద్విచక్రవాహనాలపై గేటు పడిపోయింది. ప్రమాదంలో తంబళ్లపల్లెకు చెందిన ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతని ద్విచక్రవాహనం కూడా దెబ్బతింది.అలాగే మరో రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో గాయపడ్డ యువకుడు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకున్నాడు. యువకుడు తీవ్రంగా గాయపడడంతో మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె ఆసుపత్రికి రెఫర్ చేశారు. కాగా రైల్వే సాంకేతిక నిపుణులు విరిగిపోయిన రైల్వే గేటుకు మరమ్మతులు చేపట్టారు. వాహనదారులు రెండు గేట్లు పూర్తిగా పైకి లేచిన తరువాత రాకపోకలు సాగించాలని రైల్వే సిబ్బంది పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ గేట్లు కావడంతో పూర్తి స్థాయిలో తెరచుకున్నాకే రాకపోకలు సాగించాలని సూచించారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఐరాల: ప్రతిఒక్కరు అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని ఉపాధ్యాయుడు బాలకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్ష నిర్మూలనలో రాజ్యాంగ నిర్మాత పాత్ర ఎనలేనిదని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వినోద్, మునిరాజ్, అన్నయ్య, ప్రతాప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందం పంచుకుంటూ..!



సమావేశమైన జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

దామలచెరువు: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1991-92 టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు విశ్వనాథరెడ్డి, నందకుమార్, సులోచనాదేవి, భాషాపీర్, మాధవన్‌ను సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో దివాకర్, రాంబాబు, సుధాకర్, మురళి, ఖాదర్‌వలి, మస్తాన్, రామచంద్ర, సుధీర్, గంగాధరం, దీప, సరళ, నసీమ, హనీఫా తదితరులు పాల్గొన్నారు.

22న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

గుడిపాల: సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించి ఈనెల 22న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్, కాపు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి దరఖాస్తుదారులు కులం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, టీసీ ఒరిజినల్స్, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

పంచాయతీ భవనం పనులను వేగవంతం చేయాలి



బంగారెడ్డిపల్లెలో భవన పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ, సర్పంచ్

గంగాధరనెల్లూరు: మండలంలోని పంచాయతీ కార్యాలయాలకు కొత్తగా చేపట్టిన భవనాల పనులను వేగవంతం చేయాలని ఈవోఆర్డీ షేక్ అబ్దుల్‌గఫూర్ ఆదేశించారు. మండలంలోని బంగారెడ్డిపల్లె పంచాయతీ కార్యాలయ భవనం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్టోబర్ నెలాఖరులోపు భవనం పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



చెన్నై విమానాశ్రయంలో డీఎస్పీ రామ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న చిత్తూరు పోలీసు అధికారులు, సిబ్బంది

సమస్యలకు నిలయంగా...
కలిజవేడు బీసీ కాలనీ



బీసీకాలనీలో అసంపూర్తిగా ఆగిన ఇల్లు



తాగునీటి ట్యాంక్ వద్ద మురికినీటి నిల్వ

గంగాధరనెల్లూరు: ప్రభుత్వాలు మారుతున్నా.. కొత్త అధికారులు వస్తున్నా.. గ్రామీణప్రాంతాలు సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి. ఇందుకు మండలంలోని కలిజవేడు బీసీకాలనీ నిదర్శనం. పది కుటుంబాలున్న గ్రామంలో మౌళిక వసతుల కొరత నెలకొంది. వర్షాలొస్తే సమీపంలోని చెరువు కాలువ నిండి కాలనీ జలమయం అవుతోంది. వీధుల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు లేక జనం పాట్లు పడుతున్నారు. ఆర్థిక పరిస్థితులతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టలేదు. ఇళ్ళ నడుమ ముళ్ళకంపలు ఏపుగా పెరగడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. కలిజవేడు నుంచి బీసీకాలనీ వరకు వీధిలైట్లు లేకపోవడంతో అంధకారం నెలకొంది. ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేసినా బిల్లుల మంజూరు జాప్యంతో అసంపూర్తిగా నిలిచి పోయాయి. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తులిస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదు. కాలనీకి చెందిన పేద కుటుంబానికి చెందిన పులికంటి ఆదెమ్మకు 80 ఏళ్లకు పైబడినా పింఛను మంజూరు కాలేదు. నూతన ఇళ్ల మంజూరు జాడ లేదని సెంబేటి కవిత వాపోయింది. ఇకనైనా అధికారులు స్పందించి బీసీ కాలనీలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

దళితుల పట్ల మంత్రి ఆదినారాయణ వ్యాఖ్యలు తగవు



పాకాల, పూతపట్టులలో దళిత సంఘాల నిరసన

పాకాల: దళితులను అవమానించిన మంత్రి ఆదినారాయణరెడ్డిని పదవినుంచి తొలగించాలని దళిత సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పూతలపట్టు నుంచి పాకాల వరకు దళిత సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించాలని కోరారు. డీకేటీ భూములపై ఎస్సీలకు సర్వహక్కులు కల్పించి, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ పదవులు రొటేషన్ మేరకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘ నాయకులు బి.శివాజీ, ఎం.చంద్ర, ఎ.మురళి, జి.వెంకటేష్, టి.వెంకటేష్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: దళితులను విమర్శించడం మంత్రి ఆదినారాయణరెడ్డికి తగదనీ, ఆయన తన నోరు అదుపులో పెట్టుకోవాలని దళిత సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ చంద్రశేఖర్ తెలిపారు. నంద్యాల ఉపఎన్నికల్లో దళితులను కించపరిచేలా మంత్రి మాట్లాడడం తగదంటూ ఆదివారం మండలకేంద్రంలో దళితులు నిరసన తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న జాతీయ రహదారిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఆదినారాయణరెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు. సీఎం ఆయన్ను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘ జిల్లా కార్యదర్శి శివాజీ, నాయకులు మురళి, చంద్రశేఖర్, బాబు, గోవింద్, మణి, రామ్మూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట కళకళ

ఐరాల: నిన్నటి వరకు ఎండిపోయే దశలో ఉన్న వేరుశనగ పంట ఇటీవల వర్షాలకు పచ్చగా కళకళలాడుతోంది. మండలవ్యాప్తంగా సుమారు మూడువేల హెక్టారుల్లో వేరుశనగ సాగవుతోంది. వేలాది రూపాయలు ఖర్చు చేసి రైతులు విత్తులు విత్తినప్పటి నుంచి వాతావరణంలో పూర్తిగా మార్పులు వచ్చాయి. మండేఎండలకు పంట ఎండిపోయే దశకు చేరడంతో, నష్టాలు తప్పవన్న ఆందోళనలో రైతులు పడ్డారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పచ్చగా కళకళలాడుతూ ఉండడంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చెంగనపల్లె వద్ద పచ్చగా కళకళలాడుతున్న వేరుశనగ పంట

సినిమా గైడ్

చిత్తూరు

రాఘవ	లై
దేవి	టాయ్‌లెట్
గురునాథ	ఫిదా
ఎంఎస్ఆర్	జయ జానకి నాయక
విజయలక్ష్మి	నేనేరాజు నేనే మంత్రి
చాణక్య	నక్షత్రం
వెంకటేశ్వర	పొదువాగ ఎన్ మనసు తంగం
ఆనంద్	రాక్షసి

హంద్రీనీవా పనులు వెంటనే పూర్తి చేయాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న నరసింహులు నాయుడు

తవణంపల్లె: హంద్రీనీవా, కృష్ణరాజ సాగర్ ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి నరసింహులు నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అరగొండలో ఆయన రైతులతో మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయడానికి రూ.1200 కోట్లు అవసరమని తెలిపారు. అయితే ప్రభుత్వం రూ.212 కోట్లు మాత్రమే కేటాయించడం ఎండమావును చూపి నీరు తాగండని చెప్పడమే అన్నారు. అమరావతి అభివృద్ధి పట్ల పడే తపన హంద్రీనీవా పట్ల చూపితే ఏడాదిలో హంద్రీనీవా పూర్తవుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ మాట్లాడుతూ కృష్ణరాజ సాగర్ పనులను వెంటనే పూర్తి చేయకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు మునిరత్నం నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్, రాజేంద్ర, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు రండి



జడ్పీ చైర్‌పర్సన్ దంపతులను ఆహ్వానిస్తున్న ఈవో

చిత్తూరు కల్చరల్: ఈనెల 25 నుంచి వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న విషయం విదితమే. దీంతో వినాయకస్వామి ఉత్సవాలకు ఆహ్వానించేందుకు ఆదివారం ఆలయ ఈవో పూర్ణచంద్రరావు చిత్తూరులోని జడ్పీ చైర్‌పర్సన్ స్వగృహానికి వెళ్లారు. గీర్వాణి, చంద్రప్రకాష్ దంపతులను కలసి బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ఆహ్వానపత్రిక, స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

ఐదునెలలుగా జీతాల్లేవ్!

23 నుంచి నిరసన కార్యక్రమాలు
5 నుంచి ఆమరణ దీక్షకు సిద్ధం
కాంట్రాక్టు కార్మికుల తీర్మానం

చిత్తూరు టౌన్: 12 ఏళ్లుగా పనిచేస్తున్నాం.. నగర ప్రభుత్వాస్పత్రి పరిశుభ్రతకు ఎంతో కృషి చేస్తున్నాం.. అయితే ఐదునెలలుగా జీతాలందక ఇబ్బంది పడుతున్నా ఒక్కరూ పట్టించుకోవడం లేదని.. కాంట్రాక్టు కార్మికులు వాపోతున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి పైసా అందక అప్పులపాలవుతున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23వతేది నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తీర్మానించారు. ఆదివారం నగర ఏఐటీయూసీ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నెలలుగా జీతాలందడం లేదంటూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామనీ, ఇలాగైతే ఆత్మహత్యలేదిక్కని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నేత నాగరాజు మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 4వతేదీ వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యం గంటపాటు కాంట్రాక్టు కార్మికులతో కలసి నిరసన చేపడతామన్నారు. అప్పటికీ అధికారులు స్పందించకుంటే 5 నుంచి కార్మికులు ఆమరణ దీక్షకు పూనుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, నగర అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు రాజారాం, కుమారస్వామి, విజయకుమార్, రవిరెడ్డి, మణి, విక్టోరియా, కృష్ణమూర్తి, లత తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల సమావేశం

12న బీఎస్‌కణ్ణన్ పాఠశాల వార్షికోత్సవం

చిత్తూరుక్రైం: నగర బీఎస్‌కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఈనెల 12న ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.సుబ్రహ్మణ్యం, కె.మునిరత్నం తెలిపారు. బీఎస్ కణ్ణన్ జయంతి రోజునే పాఠశాల 70వ వార్షికోత్సవ వేడుకల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఈనెల 23వతేది మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులు తప్పక హాజరై తమ సూచనలు అందజేయాలని వారు కోరారు.

నకిలీ న్యూమరాలజిస్టుల పట్ల అప్రమత్తత అవసరం: జడ్పీ చైర్‌పర్సన్



సభలో మాట్లాడుతున్న గీర్వాణి

చిత్తూరుక్రైం: పేరుమార్పుతో అదృష్టం వస్తుందంటూ నమ్మించే నకిలీ న్యూమరాలజిస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జడ్పీ చైర్‌పర్సర్ గీర్వాణి చెప్పారు. నగర పీసీఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రముఖ న్యూమరాలజిస్టు ముదిగొండ గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత సంఖ్యాశాస్త్ర శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొనే నకిలీలు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మేయర్ హేమలత మాట్లాడుతూ సంఖ్యాశాస్త్రంలో అనుభవం ఉన్న వారినే ప్రజలు సంప్రదించాలని సూచించారు. గోపీకృష్ణ మాట్లాడుతూ సంఖ్యాశాస్త్రంలో మంచిని గ్రహించాలనీ, పుట్టిన తేదీతో పేరును సమన్వయం చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సంఖ్యాశాస్త్రం అనేక సమస్యలకు పరిష్కారం సూచిస్తుందని వివరించారు. కార్యక్రమంలో న్యూమరాలజిస్టు ఎస్.జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివాజీ

చిత్తూరు కల్చరల్: నగర పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా మునస్వామి నాయకర్, అధ్యక్షుడిగా శివాజీరావు, కార్యదర్శిగా వి.కె.విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా ఓంశక్తి శంకర్‌బాబు, బాలాజీ, సహ కార్యదర్శులుగా ఉదయగిరి, మురళీధర్‌రెడ్డి, కోశాధికారిగా శివశంకర్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, ఆర్గనైజర్ దయానందరెడ్డి, ఈసీ మెంబర్లు సాయి, ప్రభాకర్ నాయుడు, మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కళాకారులను ప్రోత్సహించాలి: గీర్వాణి



హారతికి అవార్డును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ , మేయర్‌లు

చిత్తూరు కల్చరల్: ప్రజలు కళాకారులు, కళలను ప్రోత్సహించాలని జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి పిలుపునిచ్చారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో శ్రీవరసిద్ధి కళాక్షేత్రం వార్షికోత్సవం, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారులు, కళలకు జిల్లా పుట్టినిల్లని కొనియాడారు. సినిమా ఇండస్ట్రీకి ఎంతో గొప్ప కళాకారులను అందించిన ఘనత చిత్తూరుకు ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కళల ప్రోత్సాహానికి సహకారం అందిస్తున్నారని కొనియాడారు. మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ కళాకారులకు అవార్డులతో గుర్తింపునివ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ముఖ్య అతిథులు కళాకారులు, ప్రముఖులకు అవార్డులను అందజేశారు. ప్రముఖ సింగర్ కె.ఎస్.హారతికి గానసుధాలహరి, కె.అనన్యకు నాట్య నవకుసుమ అవార్డులను ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు, అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభ నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు



సీడీని ఆవిష్కరిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్: హిందువుల ఐక్యత, సంస్కృతికి చవితి వేడుకలు ప్రతీకని ఏపీఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు వేణుగోపాల్ నాయుడు అన్నారు. ఆదివారం నగర కట్టమంచి కల్యాణ మండపంలో నగర గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు వినాయక చవితి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కులమత తారతమ్యం లేకుండా జరిగే పండుగ వినాయక చవితి అన్నారు. అనంతరం వినాయకుడిపై రూపొందించిన భక్తిపాటల సీడీని ఉత్సవ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, అట్లూరి శ్రీనివాసులు, మహేష్, రామభద్ర పాల్గొన్నారు.

అభయక్షేత్రానికి రూ.10వేల విరాళం



విరాళం అందచేస్తున్న పార్థసారథి నాయుడు

చిత్తూరు కల్చరల్: నగర జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం శ్రీవరసిద్ధి కళాక్షేత్ర వార్షికోత్సవ వేడుకలు నిర్వహించిన విషయం విదితమే. కాగా, సభకు రేణిగుంటకు చెందిన అభయక్షేత్రం నిర్వాహకురాలు తస్లీమా హాజరయ్యారు. దీంతో ఆమెకు మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు రూ.5 వేలు, ఎన్.కేశవులు రూ.5 వేల వంతున విరాళం అందచేశారు. అనాథలను ఆదుకునేందుకు ఆశ్రమాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు ప్రజలు ముందుకొచ్చి చేయూతనివ్వాలని దాతలు కోరారు.

ఎంపీహెచ్‌డబ్ల్యువో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్: ఇంటర్ పూర్తి చేసి, 17-30 ఏళ్లలోపున్న మహిళా అభ్యర్థులు ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని నగర ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని శిక్షణకేంద్ర ప్రిన్సిపాల్ కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల మినహాయింపు ఉంటుందన్నారు. రెండేళ్ల డిప్లమా కోర్సుకు సెప్టెంబరు 4వతేదీలోగా దరఖాస్తులు పంపాలన్నారు. వీటిని ఎంపీహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ సెంటర్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అందజేయాలన్నారు. ఓసీలు సీఎఫ్‌డబ్ల్యూ, అమరావతి, హైదరాబాద్ పేరిట తీసిన రూ.50 డీడీని జతపరచాలన్నారు. ఇతర వివరాలకు నెం.9966466543ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

జీతాలు కావాలంటే ఆధార్ వివరాలివ్వండి!

వేతనజీవులకు ఖజానాశాఖ డైరెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్: బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఇందుకు అనుగుణంగా వేతన జీవులు ఆధార్ వివరాలను అందజేయాలంటూ తాజాగా రాష్ట్ర ఖజానాశాఖ డైరెక్టర్ కనకవల్లి ఉత్తర్వులు జారీచేసారు. ఈ మేరకు డీడీవోల రిక్వెస్ట్ లాగిన్లకు ఉత్తర్వులు చేరాయి. జిల్లాలో వందకుపైగా ప్రభుత్వశాఖల్లో 42,152 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆయా శాఖల డీడీవోలు అందజేసే వివరాల మేరకు ఉద్యోగులు జీతాలు తదితర బిల్లుల చెల్లింపు జరుగుతుంది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు తమ సెల్‌ఫోన్, కుటుంబసభ్యులు, ఆస్తుల వివరాలను ఖజానాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. తాజాగా ఆధార్‌కార్డు వివరాలు, పదవీ విరమణ చేసే తేది వివరాలను అందజేయాల్సి ఉంది. ఈ మేరకు ఉద్యోగుల ఐడీనెంబర్ పై క్లిక్ చేసి తప్పుల్లేకుండా డీడీవోల లాగిన్‌లో వివరాలు నమోదు చేయాలి. క్లిక్ చేసిన తర్వాత తప్పులుంటే సరిదిద్దేందుకు అవకాశం ఉండదనీ, వివరాలను ఈనెలాఖరులోగా నమోదు చేయాలని ఖజానా అధికారులు పేర్కొన్నారు.

ఇదివరకే పెన్షనర్ల వివరాల అప్‌లోడ్

కాగా, జిల్లాలో 38వేల మంది పింఛనుదారులు ఉన్నారు. వీరి ఆధార్ వివరాలు ఇదివరకే ఖజానా అధికారులు అప్‌లోడ్ చేశారు. దీంతో పెన్షనర్ల ఖాతాలకు సంబంధించి ఎలాంటి సమస్య లేదని అధికారులు అంటున్నారు. వారిచ్చే వార్షిక డిక్లరేషన్ ఫారంలో ఆధార్ వివరాలు ఉంటాయని చెబుతున్నారు.

కిరోసిన్ పంపిణీ జాడెక్కడ?

- **జిల్లాలో 3 లక్షల లీటర్ల నిల్వ**
- **ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు**

చిత్తూరు కలెక్టరేట్: లక్షల లీటర్ల కిరోసిన్ నిల్వలున్నా పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలివ్వలేదు. దీంతో గుడిసెల్లో జీవనం సాగిస్తున్న పేదలు చౌకదుకాణాల ద్వారా కిరోసిన్ అందక కారంలో పాట్లు పడుతున్నారు. సబ్సిడీ కిరోసిన్ పంపిణీకి మంగళం పాడిన ప్రభుత్వం గతనెల పూరిళ్లలో నివసిస్తున్న పేదల పట్ల కరుణ చూపింది. వంటగ్యాస్ కనెక్షన్ లేని, గుడిసెల్లో ముక్కున్న తెల్లరంగు రేషన్‌కార్డుదారులకు రెండు లీటర్ల వంతున కిరోసిన్ పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 10,298 మందికి 20,596 లీటర్ల కిరోసిన్ ను ఈపాస్ విధానంలో పంపిణీ చేశారు. కాగా, నిల్వ ఉన్న కిరోసిన్ వివరాలు పంపాలని గతనెల 25వతేదీ ప్రభుత్వం ఆదేశించింది. దీంతో 3 లక్షల నిల్వలున్నట్లు ఈనెలారంభంలో సమాచారం పంపారు. జూలైలో పేదలకు కిరోసిన్ పంపిణీ జరిగినా, ఆగస్టులో ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలివ్వలేదు. ఈనెల 15వతేదీతో ఈపాస్ గడువు ముగిసిన దృష్ట్యా ఇక కిరోసిన్ పంపిణీకి అవకాశం లేకుండా పోయింది. దీంతో 3 లక్షల లీటర్ల కిరోసిన్ నిల్వలను ఉంచుకుని హోల్‌సేల్ డీలర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని వచ్చేనెల అయినా పేదలకు కిరోసిన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్రిస్టియన్ మైనారిటీ జీవోలపై నేడు తిరుపతిలో అవగాహన సదస్సు

తిరుపతి (ఆటోనగర్): క్రిస్టియన్ మైనారిటీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 1983 నుంచి 2017 వరకు విడుదల చేసిన జీవోలపై స్థానిక వెస్ట్ చర్చి ఆవరణలోని స్టూడెంట్స్ క్రిస్టియన్ సెంటర్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మార్టిన్ కాట్రగడ్డ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీవోల్లో ఉన్న సారాంశాలను ఆలీవర్ రామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తారని, జిల్లాలోని క్రైస్తవ నాయకులు, పాస్టర్లు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తండ్రిపై తనయుడి దాడి

మదనపల్లె అర్బన్: తండ్రిపై ఓ తనయుడు కర్రతో దాడిచేసి గాయపరిచాడు. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ బూచేపల్లెకు చెందిన కృష్ణప్ప(60)అతడి కుమారుడు శ్రీనివాసులు వేరుకాపురం ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆదివారం శ్రీనివాసులు ఆవులు కృష్ణప్ప గడ్డివాములోకి మేస్తుండటంతో అతడు కర్రతో తోలాడు. ఈ విషయమై తండ్రితో వాగ్వాదానికి దిగాడు. ఆవేశానికి గురైన శ్రీనివాసులు కర్రతో తండ్రిపై దాడిచేసి గాయపరిచాడు. కృష్ణప్ప ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిగమింగుతున్నారు

- **బ్లీచింగ్, ఫినాయిల్, ఫాగింగ్ పేరిట నిధుల స్వాహా**
- **క్షేత్రస్థాయిలో కానరాని పారిశుధ్య నిర్వహణ**
- **వ్యాధులతో గ్రామీణ జనం విలవిల**

చిత్తూరు కలెక్టరేట్: గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఏటా రూ.కోట్ల నిధులు మంజూరు చేస్తోంది. ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణకు పలు పథకాల కింద అధికారులు, సర్పంచ్‌ల ఖాతాలకు సొమ్ము జమ చేస్తోంది. అయితే ఈ నిధులపై కన్నేసిన పలు పంచాయతీల అధికారులు పారిశుధ్యం పేరిట కనికట్టు చేస్తున్నారు. బ్లీచింగ్, ఫినాయిల్, ఫాగింగ్ కోసం కేటాయించిన నిధులను స్వాహా చేస్తున్నారు. వీవీపీల పర్యటన పేరిట ఖర్చు చూపి జేబులు నింపుకుంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సి ఉంది. బ్లీచింగ్, సున్నం, మలాథియాన్ స్ప్రే, ఫాగింగ్ చేస్తూ అంటువ్యాధుల అడ్డుకట్టకు చర్యలు చేపట్టాలి. మురికి కాలువలను శుభ్రం చేస్తూ, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ తదితర పనులు చేయాలి. ఈ మేరకు పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ బడ్జెట్‌లో 15 శాతం, 14వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించవచ్చు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఏటా పారిశుధ్య నిర్వహణకు కోసం రూ.15 కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నారు. ఇందులో సగం నిధులు బ్లీచింగ్ తదితర వాటి కొనుగోలుకు వినియోగిస్తారు. అయితే 54 మేజర్ పంచాయతీల్లో బ్లీచింగ్, ఫినాయిల్ తదితర వాటిని కొనుగోలు చేయకుండానే రికార్డుల్లో నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆయా పంచాయతీల బడ్జెట్ రూ.10 లక్షల పైనే ఉండడం ఇందుకు ఊతమిస్తోంది. ఇందులో 30 శాతం నిధులు కార్మికుల వేతనాలకు, 15 శాతం వీధిదీపాల నిర్వహణ, పది శాతం రోడ్డు, కాలువల శుభ్రత, 15 శాతం తాగునీటి అవసరాలు, పది శాతం వ్యవసాయ రంగానికి, ఇతర వాటికి 5 శాతం నిధులు ఉపయోగించాలి. అంటే మేజర్ పంచాయతీల్లో రూ.1.5 లక్షలతో సున్నం, బ్లీచింగ్, ఫినాయిల్ కొనుగోలు, ఫాగింగ్ కోసం ఖర్చు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు చేపట్టకున్నా చేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తూ సొమ్ము దిగమింగుతున్నారు. దీంతో పారిశుధ్యం కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని ఉన్నతాధికారులు అంటున్నా వ్యాధుల తీవ్రత తగ్గడం లేదు. మరోవైపు వీవీపీల పర్యటన పేరిట పలువురు అధికారులు లేనిపోని ఖర్చు చూపి జేబులు నింపుకుంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ విషయమై పర్యవేక్షణ జరిపి, అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి.

పాడిపశువుల కొనుగోలుకు సాయం

రూ.లక్ష చొప్పున వంద మందికి చేయూత

డీసీసీబీ సీఈవో శంకర్ బాబు



చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో పాల దిగుబడుల పెంపుపై జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దృష్టి సారించింది. ఇందులో భాగంగా నాబార్డు సహకారంతో పాడిపశువుల కొనుగోలుకు ఆర్థిక చేయూతనివ్వాలని సంకల్పించింది. ఈ మేరకు పాలకవర్గం నిర్ణయించినట్లు ఆ బ్యాంకు సీఈవో శంకర్‌బాబు తెలిపారు. మొత్తం వంద యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఒక్కో లబ్ధిదారుడికి రెండు ఆవుల కొనుగోలుకుగాను రూ.లక్ష వంతున సాయం అందిస్తామన్నారు. 'డెయిరీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్ స్కీం' కింద రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 33 శాతం, ఇతరులకు 25 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. రుణ వాయిదాలను లబ్ధిదారులు ఐదేళ్ల కాలపరిమితిలోగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో 76, తిరుపతి శ్రీజ డెయిరీ పరిధిలోని 14 బల్క్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్ల ద్వారా రోజుకు 2.17 లక్షల లీటర్ల పాలసేకరణ జరుగుతోందన్నారు. ఈ ఏడాది పాలసేకరణ లక్ష్యాన్ని 2.54 లక్షలకు పెంచాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారని చెప్పారు. ఈ మేరకు నాబార్డు సాయంతో వంద మందికి పాడిఆవుల కొనుగోలుకు రుణ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎస్సీలు 25, ఎస్టీలు 25, ఇతరులు 50 మందిని ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక సింగిల్‌విండోలు, డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా చేపడతామనీ, లబ్ధిదారులు ఇతర రాష్ట్రాల్లో పాడిపశువులు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ఈ ప్రక్రియను స్థానిక పశువైద్యుడు, డీఆర్డీఏ ప్రతినిధి, బ్యాంకు అధికారితో కూడిన కమిటీ పర్యవేక్షిస్తుందని చెప్పారు.

అక్రమ రవాణాతోనే ఆర్టీసీకి నష్టం

ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య



మదనపల్లెటౌన్: ఆర్టీసీకి అక్రమ రవాణాతోనే నష్టాలు వస్తున్నాయని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య ఆరోపించారు. ప్రధానంగా ప్రైవేటు రవాణ సంస్థలు కాంట్రాక్ట్ క్యారియర్‌లుగా పర్మిట్లుతీసుకుని స్టేజ్ క్యారియర్‌లుగా తిప్పుతూ నష్టం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక సంక్షేమం...సంస్థ అభివృద్ధే లక్ష్యంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) పనిచేస్తోందన్నారు. ఎన్ఎంయూ 50 వసంతాల వేడుకలు జరుపుతున్నామన్నారు. స్వర్గీయ రామ్మోహన్‌రావు నేతృత్వంలో ఇండిపెండెంట్ ట్రేడ్ యూనియన్‌గా ప్రారంభమై నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన యూనియన్‌గా ఎన్ఎంయూ ఉందన్నారు. ఇప్పటి వరకు 13 సార్లు జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎన్ఎంయూ 9 సార్లు విజయం సాధించినట్లు చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ ఎన్ఎంయూ విజయం సాధించడం కార్మికుల్లో ఎన్ఎంయూకు ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు. సంస్థకు పల్లెవెలుగు సర్వీసుల ద్వారా వస్తున్న నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. దేశంలో 67 రవాణ సంస్థలు ఉన్నాయని, ఏపీ ప్రభుత్వంలో లేవని, కార్పొరేషన్‌లుగా ఉన్నాయని, ప్రతి రోజు 95శాతం నేషనలైజేషన్‌తో 65 లక్షల మందిని వారిని గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీని ప్రభుత్వంలో ఓ విభాగంగా చేర్చాలన్న డిమాండ్ కార్మికుల్లో ఎప్పటి నుంచో ఉందన్నారు. అయితే డిప్యూటీ సెక్రటరీ హోదా కలిగిన వ్యక్తితో పరిణితి లేని కమిటీని ఎంప్లాయిస్ యూనియన్ సమ్మెను విరమించేందుకు ఆడిన నాటకమే అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేయాలన్న డిమాండ్‌ను సీఎం, సంబంధిత మంత్రి, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, ఇందులో భాగంగా ఐఏఎస్ స్థాయి అధికారితో కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత ఆర్టీసీకి అప్పులు మాత్రమే వచ్చాయని నిధులను రాబట్టడంలో ప్రభుత్వం శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు.

రూ.50లక్షల విలువైన కంటైనర్ చోరీ

పలమనేరు: పలమనేరు - కుప్పం రహదారిలో ఈమాస్ ఆస్పత్రి సమీపంలో ఆదివారం ఉదయం సుమారు రూ.50 లక్షలు విలువ చేసే టైర్ల లోడ్‌తో ఉన్న కంటైనర్ చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. కేరళలోని త్రిశూర్ నుంచి కోల్‌కతాకు టైర్ల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్‌ను ఈమాస్ ఆస్పత్రి సమీపంలో ఐదుగురు దుండగులు కారులో వెంబడించి వచ్చి ఆపి నిలిపి రికార్డులు తీసుకురావాలని తాము వాణిజ్య పన్నుల శాఖ అధికారులమని చెప్పడంతో డ్రైవర్ కంటైనర్‌ను రోడ్డు పక్క నిలిపి రికార్డులు తీసుకొని కారు వద్దకు వెళ్లగా కారులో నుంచి దిగిన కొందరు అగంతకులు కంటైనర్ నడుపుకుంటూ వెళ్లిపోయాడు. దుండగులు కూడా కారులో పరారయ్యారు. జరిగిన సంఘటనపై కంటైనర్ డ్రైవర్ అర్షాద్ పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పలమనేరు సీఐ సురేంద్ర రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి స్వైన్ ఫ్లూ

రామచంద్రాపురం: మండలంలోని ఓ వృద్ధురాలికి స్వైన్ ఫ్లూ సోకింది. గతవారం తీర్థయాత్రలకు వెళ్లి వచ్చాక ఆమెకు జ్వరం, వాంతులు రావడంతో తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఎంతకీ జ్వరం తగ్గకపోవడంతో స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించగా.. స్వైన్ ఫ్లూ వ్యాధి సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారాన్ని జిల్లా వైద్యాధికారికి తెలియజేశారు. డీఎంహెచ్‌వో ఆదేశాలతో వృద్ధురాలి స్వగ్రామంలో 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

గర్భిణి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం

తిరుపతి (నేరవిభాగం): ఎనిమిది నెలల నిండు గర్భిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతిలో జరిగింది. తిరుపతి కొర్లగుంటలోని కట్టకిందపల్లెకు చెందిన వెల్డర్ సుబ్రహ్మణ్యానికి కడప జిల్లా రాజంపేట మండలం నడింపల్లెకు చెందిన హనుమంతు, రత్నమ్మ దంపతుల కుమార్తె వాణి(28)తో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి ఈ దంపతులు కట్టకిందపల్లెలోనే కాపురం ఉంటున్నారు. వాణి గర్భవతి కూడా అయ్యింది. కానీ కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. మనస్తాపం చెందిన వాణి ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఈస్ట్ ఎస్ఐలు ఈశ్వరయ్య, రమణయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కుటుంబ కలహాల నేపథ్యంలోనే వాణి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం రుయా వైద్యశాలకు తరలించారు.



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న వాణి

బంగారు పతకం గెలుపు జిల్లాకే గర్వకారణం

డీఎస్పీ రామ్‌కుమార్‌కి ఘనస్వాగతం - సింగిల్స్‌లోనూ విజేతగా నిలవాలి: ఏఎస్పీ


రామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ రాధిక, డీఎస్పీలు తదితరులు

చిత్తూరు టౌన్: అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో ఇటీవల ప్రపంచ పోలీసు అండ్ ఫైర్ టెన్నిస్ పోటీలు నిర్వహించిన విషయం విదితమే. ఇందులో భాగంగా జరిగిన డబుల్స్ పోటీల్లో చండీఘడ్ ఎస్పీ ఆశిష్ కపూర్, చిత్తూరు స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్‌టీవీ రామ్‌కుమార్ జంట సత్తా చాటి బంగారు పతకం సాధించింది. కాగా, ఆదివారం చెన్నై విమానాశ్రయం నుంచి చిత్తూరు చేరుకున్న ఆయనకు పోలీసు అధికారుల సంఘం తదితర ప్రముఖులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు మైదానంలో జరిగిన సభలో ఏఎస్పీ రాధిక మాట్లాడుతూ... అంతర్జాతీయ టెన్నిస్ పోటీల్లో డీఎస్పీ రామ్‌కుమార్ విజయం సాధించడం జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూనే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది ఆయన సింగిల్స్ టోర్నీలోనూ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. డీఎస్పీ ఎన్‌టీవీ రామ్‌కుమార్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రీడల్లో రాణించడానికి తన తన తండ్రి ప్రోత్సాహమే కారణమన్నారు. లాస్ ఏంజెల్స్ పోటీల్లో మొదటి సెట్‌లో అమెరికా జట్టు రాణించినా, ఆపై తమ జట్టు అద్భుతంగా ఆడి విజేతగా నిలిచినట్లు చెప్పారు. టోర్నీ స్పాన్సర్‌గా వ్యవహరించిన శ్రీసిటీ యాజమాన్యం, క్రీడల వైపు ప్రోత్సహించిన ఎస్పీలు శ్రీనివాస్, రాజశేఖర్‌బాబు తదితరులకు తన కృతజ్ఞతలని తెలిపారు. రామ్‌కుమార్ తండ్రి శ్రీరాములు నాయుడు.. టెన్నిస్‌లో దేశం గర్వించేలా రాణించాలన్న తన కలను కుమారుడు నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. దేశం తరఫున ఆడి బంగారు పతకం సాధించిన రామ్‌కుమార్‌కు ఆశించినస్థాయిలో గుర్తింపు లభించక పోవడం బాధగా ఉందన్నారు. అనంతరం బంగారు పతక విజేతను ఏఎస్పీ రాధిక, డీఎస్పీలు సుబ్బారావు, దేవదాస్, నాగభూషణం, శంకర్, నరసింహారెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చలపతి, సీఐలు ఆదినారాయణ, వెంకటప్ప, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్, విజయం విద్యాసంస్థల అధినేత ఎం.తేజోమూర్తి, జిల్లా తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు పాచిగుంట మనోహర్ నాయుడు, వ్యాపారులు, క్రీడాభిమానులు, ప్రముఖులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

పలు మండలాల్లో భారీ వర్షాలు

చిత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం జిల్లావ్యాప్తంగా భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. నాలుగైదు రోజులుగా జిల్లాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు కాస్తూ, ఆపై నల్లమబ్బులు కమ్ముకుంటున్నాయి. కాగా, ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అక్కడక్కడా భారీగా, కొన్ని మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురిసాయి. తిరుమలలో రాత్రి 7 గంటల సమయంలో గంటపాటు భారీ వర్షం కురిసింది. తిరుపతి నగరం, పరిసరప్రాంతాల్లో భారీ వర్షం పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చిత్తూరు, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, పెనుమూరు, పూతపపట్టు మండలాల్లో మోస్తరు నుంచి చిరజల్లులతో కూడిన వర్షం కురిసింది. శ్రీకాళహస్తి, ఏర్పే డు, తొట్టంబేడు, కేవీబీపురం, వరదయ్యపాళెం మండలా ల్లో గంటపాటు కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఇబ్బం దులు పడ్డారు. మదనపల్లెలో


తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి కురుస్తున్న వర్షం

మోస్తరు వర్షం కురవగా, పీలేరు, కిలికిరి, వాల్మీకిపురంలో రాత్రి ఏడు గంటల ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసింది. పలమనేరు సమీప మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ఆదిలాబాద్‌వాసి సురక్షితం

ఇంటికి వచ్చేశాడని సమాచారమిచ్చిన కుమారుడు


గోవిందరావు

తిరుమల: తిరుమలలో తప్పిపోయిన ఆదిలాబాద్‌కు చెందిన గోవిందరావు ఎట్టకేలకు సురక్షితంగా ఇంటికి చేరాడు. ఆదిలాబాద్ జిల్లా హీరపుర గ్రామానికి చెందిన రాథోడ్ గోవిందరావు (47) శ్రీవారిని దర్శనార్థం ఈ నెల ఏడో తేదీన తిరుమలకు వచ్చాడు. ఎనిమిదో తేదీన దర్శనం పూర్తిచేసుకున్న ఆయన అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. తాను అడవిలో ఉన్నానని.. దారి తెలియడం లేదన్నాడు. దీంతో గోవిందరావు కుమారుడు చందులాల్ తొమ్మిదో తేదీన తిరుమలకు చేరుకుని టూటౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. గోవిందరావు కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ధర్మగిరి వేదపాఠశా ల, శ్రీవారి పాదాల మధ్య అటవీప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. ఆయన వద్దకు చేరుకునే ప్రయత్నం చేయగా.. ఫోన్ స్విచ్ ఆఫ్ కావటం తో సిగ్నల్స్ అందలేదు. దీంతో భక్తుడు ఎక్కడున్నాడో కనిపెట్టడం పోలీసులు ఇబ్బందిగా మా రింది. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన గోవిందరావు సురక్షితంగా ఇంటికి వచ్చేశాడని ఆయన కుమారుడు చందులాల్ తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు.

23న ముక్కంటి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని 23వ తేదీ బుధవారం లెక్కించనున్నట్లు ఈవో భ్రమరాంబ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని కూడా లెక్కించనున్నారు. ఆలయ, స్కిట్, నర్సింగ్ కళాశాల సిబ్బంది ఈ లెక్కింపు కార్య క్రమానికి హాజరు కావాలని ఈవో కోరారు.

వీడని గజబాధ

దెబ్బతిన్న వరిపొలాలు


గజదాడుల్లో ధ్వంసమైన వరిపంట

ఎర్రావారిపాళెం: మండలంలోని కోటకాడ పల్లె పంచాయతీలో రైతులకు గజ దాడుల బాధ తప్పడం లేదు. 20 రోజుల క్రితం కోటకాడ పల్లె అటవీ సమీప ప్రాంతం లోని సిద్దలగండి వద్ద తిష్టవేసిన గజరాజులను అటవీ శాఖా ధికారులు కుంకీల సహాయంతో దట్టమైన అడవుల్లోనికి తరిమివేశారు. కొన్ని రోజులు అడవుల్లోనే ఉన్న గజరాజులు మళ్లీ పంట పొలాలపై దాడులు చేస్తూ రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. తాజాగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజామున వరకు వరి పొలాలను తొక్కి ధ్వంసం చేశాయి. వర్షాభావ పరిస్థితులున్న సిద్ధలగండి ప్రాజెక్టులోని నీరుతో ఇక్కడి రైతులు వరి సాగు చేశారు. కోటకాడపల్లెకి చెందిన సుధాకర్, నాగరాజమ్మ, బాబుల పొలాలను ధ్వంసం చేశాయి. గజదాడుల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



మీకు తెలుసా?

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్ (సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్‌డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్ తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!!

టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
చెప్పగలరా? : పాయసం



* నేడు సీనియర్ సిటిజన్స్ డే

మలిసంధ్యలో ఎదురుచూపులు

కొడుకు పుట్టాడంటే పరవశం.. కూతురు జన్మించిందంటే పట్టలేని సంతోషం .. ఆ ఆనందాన్ని నలుగురితో పంచుకుంటారు. ఒక్కో అడుగు వేస్తుంటే మైమరచిపోతారు. వారిని ఉన్నత హోదాలలో చూడాలని కలలుగంటారు. ఊహల ప్రపంచంలో తేలిపోతారు. జీవితాన్ని ధారపోసైనా వారి ఉన్నతికి రేయింబవళ్లు కష్టపడతారు. తీరా మలిసంధ్యలో ఓ ముద్ద పడేస్తే చాలనుకుంటారు. ఓ మూలకు పడిఉంటారు. ఇది జన్మనిచ్చిన తల్లిదండ్రుల కథ. ఇలాంటి వారిని పువ్వుల్లో పెట్టి చూసుకోవాల్సింది పోయి కొందరు కన్నబిడ్డలు వక్రబుద్ధి ప్రదర్శిస్తూ ఇంటి నుంచి గెంటేస్తున్నారు. ఉన్నదంతా లాక్కొని ఒంటరి చేస్తున్నారు. బుక్కెడు బువ్వ పెట్టేందుకు వంతులవారీగా పంచుకుంటున్నారు. పైగా ఈసడింపులు..ఛీత్కారాలు. వీటిని భరించలేక .. అయ్యో .. ఇంకా ఎందుకు బతికున్నామా .. అనుకుంటూ చేయి చాచేందుకు మనసొప్పక.. చేయూతనిచ్చేవారు కానరాక 'దిక్కు'లేని వారవుతున్నారు. బస్టాండ్లు .. చెట్లకింద .. ఆలయాల వద్ద సేదతీరుతున్నారు. ఇంటికి దూరమై ఒంటరిగా మిగిలిన వృద్ధులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు.. చట్టాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి.

- పీలేరు



వాల్మీకిపురంలోని చౌడేశ్వరీదేవి వృద్ధాశ్రమం

- పెరుగుతున్న ఒంటరి వృద్ధుల సంఖ్య
- పిల్లలున్నా ఆదరణ కరువు
- ఆశ్రమాలే ఆఖరి ఆవాసాలు
- ఆదుకోని సంక్షేమ పథకాలు

మరుగున పడిన పోషణ చట్టం

'వృద్ధుల పోషణ చట్టం-2007' వచ్చి పదేళ్ల గడిచిపోయింది. పండుటాకులకు ఆత్మస్థైర్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. వికలాంగుల సంక్షేమ శాఖ దీనిని పర్యవేక్షించాల్సి ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చి పదేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ దీని గురించి చాలా మందికి తెలియదు. కనీస ప్రచారం లేదు. ఈ చట్టం మేరకు తల్లిదండ్రులను ఆదరించని పిల్లలకు మూడునెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తారు. వారి పోషణ, వైద్యానికి అయ్యే ఖర్చులు వెచ్చించాల్సి ఉంటుంది. స్థిరాస్తులకు వారసులను అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రతి జిల్లాలోనూ ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి వృద్ధ దంపతులకు అండగా నిలిచేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చట్టం పేర్కొంది. ట్రిబ్యునల్ నిర్ణయంపై ఎలాంటి అప్పీలు ఉండదు. కేసు పెండింగ్ ఉంటే నెలసరి భత్యం కూడా చెల్లించాల్సిందే. విచారణ చేపట్టే ముందు తల్లిదండ్రులు, పిల్లల మధ్య సయోధ్య కుదిర్చాలి. ఈ చట్టం కింద తాత, అమ్మమ్మ, నానమ్మల పోషణ, కొడుకులు, మనవలు, దత్తపుత్రుల బాధ్యత. ఈ చట్టంలో మైనర్లకు మినహాయింపు ఉంది.

వృద్ధులను చేరదీస్తున్న ఆశ్రమాలు

మనవళ్లు, మనవరాళ్లతో కాలక్షేపం చేయాల్సిన వయసులో ఒంటరిగా దుర్భర జీవితాలు గడుపుతున్న వారిని ఆదుకునేందుకు జిల్లాలోని పలు అనాథ వృద్ధుల సేవా ఆశ్రమాలు ముందుకు వస్తున్నాయి. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం తదితర ప్రాంతాల్లో ఇలాంటి వృద్ధాశ్రమాలు అనాథ వద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ చేరదీస్తున్నాయి.



పండుటాకులకు అండగా ఆశ్రమాలు

చేరదీసేవారు లేని వృద్ధులకు అండగా ఉంటూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతోంది వాల్మీకిపురంలోని శ్రీ చౌడేశ్వరీదేవి వృద్ధాశ్రమం. ఎనిమిదేళ్ల క్రితం 12మంది సభ్యులతో రూపుదిద్దుకున్నది ఈ అశ్రమం. గురుకుల పాఠశాల ఉద్యోగి దివంగత జి. వెంకటరమణ అకుంఠిత దీక్ష, అంకితభావం, దాతల సౌజన్యంతో ఈ ఆశ్రమం దినదినాభివృద్ధి చెందింది. 2009లో ఊరి చివరన నిరుపయోగంగా ఉన్న బీడీ కాలనీ ఇళ్లలో రూపుదిద్దుకున్న ఈ వృద్ధాశ్రమం కమిటీ సభ్యుల సంకల్ప బలం, దాతల సహకారంతో మండల పరిషత్ కార్యాలయ పొరుగున విశాలమైన ప్రదేశంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో సొంత భవనాలను ఏర్పరుచుకుంది. బిడ్డల నిరాదరణకు లోనై, పేదరికంతో పోషణ కరువైన ఒంటరైన వృద్ధులకు ఇది ఆశ్రయం కల్పిస్తోంది. మంచి భోజనంతో పాటు అవసరమైన వైద్యం కూడా అందిస్తోంది. ప్రస్తుతం ఈ వృద్ధాశ్రమంలో 35 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు.

సంక్షేమం.. చాలా దూరం

- 65 ఏళ్లు నిండిన వారు వయసు ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు నకలు జత చేసి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేస్తే అధికారులు విచారించి అర్హులైతే పింఛను మంజూరు చేస్తారు ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటు చేసుకుని వృద్ధులకు వేదన మిగులుతోంది.
- రైలు ప్రయాణం చేయాలనుకునే వారికి సాధారణ టికెట్టు రుసుంలో 40 శాతం రాయితీ ఇస్తున్నారు. రిజర్వేషన్లకు కూడా దీన్ని వర్తింపజేయాలని సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘాలు కోరుతున్నాయి.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా జనరిక్ ఔషధాలను ఇవ్వాల్సి ఉంది. ఇది సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.
- జిల్లా కేంద్రాలలో ఆనంద నిలయాలను ఏర్పాటు చేయాలని ఏడేళ్ల క్రితం తీసుకున్న ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది. ఒంటరి వృద్ధుల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ అన్ని పోలీస్‌స్టేషన్లకు ఐదేళ్ల క్రితం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇది ఆచరణకు నోచుకోవడం లేదు.



ఈ చిత్రంలోని అవ్వ పేరు మల్లక్క. వయసు 72 ఏళ్లు. చింతపర్తి పంచాయతీ పుల్లేటి చెరువుపల్లె స్వగ్రామం. భర్త నరసింహులు మూడేళ్ల క్రితం కాలధర్మం చెందారు. రెండు ఎకరాల పొలం ఉంది. ఒక కొడుకు ఉన్నాడు. ఏడాదిగా వృద్ధాశ్రమంలో ఉంటోంది. కనీసం చూడడానికి కూడా అయినవారెవరూ రారని చెమర్చిన కళ్లతో చెబుతోంది.



వృద్ధ దంపతులు రాజమ్మ, రామిరెడ్డి: - వీరు కె. రాజమ్మ (77), కె. రామిరెడ్డి (87) వృద్ధ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా ఇళ్లొదిలి వాల్మీకిపురంలోని చౌడేశ్వరీదేవి వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. అందరూ ఉన్నా తాము విడిగా జీవనం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మనసుకు వృద్ధాప్యం లేదు



మానసిక వృద్ధాప్యం, శారీరక వృద్ధాప్యం అని రెండు రకాలుగా ఉంటుంది. మానసికంగా ఉత్తేజంగా ఉన్నన్నాళ్లు వృద్ధాప్యం దరి చేరదు. ఉదాహరణకు మన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, బీజేపీ అగ్రనేత అద్వానీ 80, 90 ఏళ్లు దాటుతున్న వీళ్లంతా ఇంకా ప్రజా జీవితంలో యాక్టివ్‌గానే ఉన్నారు. రిటైర్డు అయిపోయి ముఖ్యంగా ఏ పని చేయకుండా ఇంట్లో ఉండేవాళ్లే మానసికంగా వృద్ధులైపోతారు. ఆ భావన ప్రవేశించగానే శారీరక వృద్ధాప్యం ముంచుకొస్తోంది. నా వయసైపోయింది, నా పనైపోయింది అనే ఆలోచనలు మానుకోవాలి. ఓపిక ఉన్నంత వరకు ఏదో ఒక పని చేస్తుండాలి. తమ అనుభవాలను సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలి. యాక్టివ్‌గా ఉంటే రోగాలు దరిచేరవని గుర్తించుకోవాలి.

- డాక్టర్ చంద్రశేఖర్, ప్రభుత్వ వైద్యాధికారి, పీలేరు

ఆంధ్రజ్యోతి
సాహిత్యం
| చిత్తూరు ● సోమవారం 21 ఆగస్టు 2017 |

■ ఈవారం మాట



సమాజంతో శ్రమజీవనులు వేలాది వత్సరాల కృషి ఫలితంగా సృష్టించినది భాష. ఆ భాష సమాజం నడుమ పవనతరంగంలా ప్రసరిస్తుంది. కాంతిరేఖగా భాసిస్తుంది. దానిని ఏ కాలంలోనైనా అరికట్టరాదు. దాని సహాయంతోనే మనిషి అగమ్యపథాలు అన్వేషించగలుగుతున్నాడు.

- ఆవంత్స సోమసుందర్

■ మన రచయిత్రి

'అది కాదురా సూరీ! ఆరువందల యాభై ర్యాంకర్‌కూ, అంటే మెడిసిన్ లో సీటు వచ్చినవాడికీ, నీకూ తెలివితేటల్లోనూ, నాలెడ్జిలోనూ పెద్దగా వ్యత్యాసముంటుందని నేననుకోను. నువ్వు వాడి కన్నా తక్కువేం కాదు, అలా ఎప్పటికీ అనుకోకు...' తనకు ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మంచి మార్కులు వచ్చినా తనకంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్ళంతా డొనేషన్లు కట్టి కాలేజీల్లో చేరిపోతుంటే కుమిలిపోయే కొడుకును ఓ మధ్యతరగతి తండ్రి సముదాయిస్తున్నప్పుడు జరిగే సంభాషణ ఇది.. 80వ దశకంలో విద్యారంగంలో చోటుచేసుకున్న ఒక అస్తవ్యస్త పరిస్థితి మధ్యతరగతి మనస్తత్వంపై ఎంత ప్రభావాన్ని చూపిందో ఈ కథలో చిత్రించారు చిత్తూరు జిల్లాకు చెందిన పద్మావతి వాచస్పతి.

మధ్యతరగతి మందహాసం

ఆమె రచనలకు ఆభరణం



రంగనాయకమ్మ, మాలతీచందూర్ వంటి సమకాలీన రచయిత్రులతో బాటు రచనలు చేసిన పద్మావతి చిన్నవయసు నుంచే రచనావ్యాసంగాన్ని ప్రారంభించి నాలుగు దశాబ్దాలు కొనసాగించారు.. ఏ ఇజాలూ, ధోరణులతో సంబంధం లేకుండా రచనలు చేసినా వాటిలో ఇజాల నీడలూ కనిపిస్తాయి.పద్మావతి ఉపాధ్యాయినిగా వివిధచోట్ల పనిచేసి ఉద్యోగవిరమణ అనంతరం చిత్తూరు జిల్లాలో స్థిరపడ్డారు. భాషాభేషజం లేకుండా పొట్టిపొట్టి సంభాషణలతో అసాంతం చదివించేలా ఆమె శైలి వుండడంతో పాటు ఆమె రచనల్లో సామాజిక రుగ్మతల పట్ల ఆవేదన అంతర్లీనంగా సాగుతుంటుంది. 1980- 90 మధ్యకాలంలో ఆమె పలు కథలు, నవలలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. జీవని, జ్ఞాననేత్రం, కాగితంపూలు, ప్రేమమందిరం అనే నాలుగు కథాసంపుటాలు, అంతస్తులూ-అంతఃకరణలు, మారిన కాలం-మారని మనుషులు, రంగుల వల, అవివాహిత, రాగవల్లరి, నీరజ, స్వీకారం మొదలైన నవలలు వెలువడ్డాయి. రెండు నవలలు, కొన్ని కథలు కన్నడంలోకి అనువాదమయ్యాయి. అతిపెద్ద సామాజిక వర్గమైన మధ్యతరగతి మనస్తత్వాలకు సంబంధించిన విభిన్న పార్శ్వాలనూ ఆమె తన రచనల్లో స్పృశించారు. వ్యాపార సంబంధాలుగా మారిపోతున్న మానవ సంబంధాలు, విదేశీ మోజులో పడి తల్లిదండ్రులు పిల్లల ప్రేమకు దూరమైపోయి, ఆ పిల్లలు వారి కోసం పడే ఆరాటం, వ్యసనపరుడైన భర్తకు ఎదురుతిరిగి అతివ ప్రారంభించే కొత్తజీవితం, ఆఫీసులో సహోద్యోగులతో సమస్యలు ఎదుర్కొనే ఉద్యోగిని మానసిక వ్యథ, అయిన వాళ్ళందరూ దూరమైపోతే అనాథల సేవలో స్వశక్తితో జీవనం గడిపే మహిళ ఆత్మస్థైర్యం, వివాహవ్యవస్థలోని అభద్రత...ఇవన్నీ ఆమె కథావస్తువులు. ఆడపిల్లలు ఆర్థికంగా బలపడాలని, వాళ్ళకి వాళ్ళే జీవితాన్ని సరిదిద్దుకోవాలని ఆమె పలు కథల్లో సూచించారు. 1980లో వెలువడిన 'ఇదోరకం హత్య' కథ స్త్రీవాదానికి ప్రబల ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఆఫీసరు తన వేధింపుల్లో భాగంగా ఫైలు తీసుకురమ్మని సహ ఉద్యోగినికి ఆదేశాలిచ్చినప్పుడు ఆమెఅతని దగ్గరికి లేచి వెళ్ళే సన్నివేశం ఇలా సాగుతుంది....'వస్తున్నాను- ముఖానికి పట్టిన చెమటను చేతిగుడ్డతో తుడుచుకుంటూ గొనిగినట్టే అంది జానకి. ప్రక్క సీట్లో వారి చూపుల్లో తొంగిచూస్తున్న కుతూహలం...ఒకరిపైపు ఒకరు చూసుకుంటూ చూపులతో ప్రశ్నించుకుంటున్న చాతుర్యం...ఏవీ పట్టించుకోనట్టే అంత పరీక్షగా చూస్తున్న వాళ్ళ నటన చూశాక జానకి గుండె భగ్గుమంది'

మానవతావాదమే లక్ష్యంగా...

ఉపాధ్యాయ వృత్తి తన ప్రవృత్తికి ఎంతో దోహదపడిందని, రకరకాల మనుష్ఖుల్ని దగ్గరుండి పరిశీలించే అవకాశం కల్పించిందని, జీవితంలోని ఎన్నో సమస్యలను అవగాహన చేసుకునే మానసిక శక్తిని ఇచ్చిందని అంటారు పద్మావతి. తను ఏ ఇజాల జోలికీ వెళ్ళలేదని, అయితే అవి తన కథల్లో కనిపించవచ్చని, ఇజాలు అంతగా ప్రచారం లేని ఆ రోజుల్లో మానవతావాదమే లక్ష్యంగా తన రచనల్ని కొనసాగించానని ఆమె పేర్కొన్నారు. స్త్రీజనోద్ధరణ కోసం ఇంకా... ఇంకా రచనలు రావాలని ఆమె అభిలషించారు.

■ తాజా పుస్తకం

రాసాని రచనావిన్యాసంపై పుస్తకం



గ్రామీణ సంస్కృతి పట్ల లోతైన అవగాహన వున్న రచయిత డాక్టర్ వీఆర్ రాసాని. అందుకే తను పుట్టిన గడ్డ చిత్తూరు జిల్లా గ్రామీణ జీవితాల్నే తన అధికభాగం రచనలుగా మలిచారు. ఆ జీవితాలతో మమేకమై, ఆ జీవితాల్లోని బహుముఖ కోణాల్ని పరిశోధనాత్మక దృష్టితో అధ్యయనం చేస్తే తప్ప ఎన్నో పార్శ్వాలుగా ఆయన కథలు, నవలలు వెలువడేవి కావు. ఆ పార్శ్వాలే చోటుచేసుకొని ఆయన రచనలసమగ్ర రూపాన్ని సంక్షిప్తంగా తెలిపే తాజా పుస్తకం 'డాక్టర్ వీఆర్ రాసాని సాహిత్య సమాలోచన'. రాసాని ఉద్యోగ విరమణ సందర్భంగా మిత్రులు ఆత్మీయపూర్వకంగా ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. నాలుగు దశాబ్దాల కాలంలో వచ్చిన రాసాని సాహిత్యాన్ని 56మంది రచయితలు ప్రక్రియాపరంగా వివిధ విభాగాల్లో విశ్లేషించిన వ్యాసాలు ఇందులో చోటుచేసుకున్నాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల పట్ల ఒక రచయితకు వున్న అవగాహన బట్టి ఆ రచయిత రచనలకు పరిపూర్ణత చేకూరుతుంది. రాసాని రచనలకు సంబంధించి ఆ రంగాల్లో ఆయనకున్న అవగాహనను రచయితలు బేరీజు వేశారు. రాసాని గ్రామీణ జీవితం లోతుల్లోకి వెళ్ళి దశాబ్దాల పాటు అక్కడ జరుగుతున్న మార్పుల్నీ, పెత్తందారీ వ్యవస్థ, ప్రపంచీకరణ వంటి వాటి ప్రభావంతో వ్యవసాయం జూదంగా మారిపోయి ఆ జీవితాలు ఎంతగా చతికిలబడ్డాయో ప్రత్యక్ష సాక్షిగా తన కథల్లో దృశ్యమానం చేశారు. అలాంటి కథాసంవిధానాన్ని ఇందులోని పలు వ్యాసాలు ఫోకస్ చేశాయి. వివిధ కథల్నీ, నవలల్నీ రచయితలు వేరువేరుగా చర్చించారు. ఇంకా రాసాని రచనల్లో చోటుచేసుకున్న సంప్రదాయాల ఉచ్చుల్లో బందీలై పరితపించే మహిళల వెతలు, దోపిడీ పదఘట్టనల్లో నలిగే దళితుల ఇక్కట్లు, వివిధ వృత్తులవారి జీవన విధానాలు...వీటన్నింటిని కూడా ఈ వ్యాసాలు స్పృశించాయి. రాసాని రచనల్లో తీసుకున్న వస్తువిస్తృతి, సమకాలీన సమాజ స్వభావం...ఈ లక్షణాల పైనా విశ్లేషణలు వున్నాయి. పుట్టిన గడ్డపట్ల మమకారాన్ని పెంచుకుంటూ, తన ప్రాంతపు అస్తిత్వాన్ని ప్రగాఢంగా కోరుకుంటూ ఒక సామాజిక బాధ్యతతో రచనలు చేస్తున్న రాసాని రచనాసర్వస్వాన్ని అద్దంలో చూపించిందీ పుస్తకం.

డాక్టర్ వీఆర్ రాసాని సాహిత్యసమాలోచన
(వ్యాస సంకలనం)
సంపాదకులు: ఆచార్య నాగోలు కృష్ణారెడ్డి, డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు,
పేజీలు: 360, వెల: రూ.300
ప్రతులకు: 16-2ఇ/17, బాలాజీ రెసిడెన్సీ, మునిరెడ్డినగర్, తిరుపతి, 517502.

■ నవకలం

మనసు పలికితే మహోన్నతం

అక్షరం ఆనందమై
పదాలై పల్లవిస్తే
వాక్యానికి పరిపూర్ణం
భావానికి అలంకారం-
కవితైనా, కథైనా,
నవలైనా, మరేదైనా
మనసు లోతులోంచి వస్తే
వాస్తవానికి దర్పణం
సమకాలీనానికి సంతోషం-
ఏసీ రూముల్లో వుంటూ
ఆకలి మీద మాటలు పేరిస్తే
కన్నీళ్ళు కార్చి వర్ణిస్తే
కష్టజీవి బాధ ఆవిష్కృతమవుతుందా?-
ఆకలి బాధ ఎలాంటిదో
ఎంత భయానకమో
పేగులు పెట్టే ఘోష
ఎంత బాధాకరమో వినిపిస్తుందా?
అనుభవించేవాడి నాలుగు మాటలు
అమృతతునకలు
పంచవేదాల సారానికి ధీటురాళ్ళు

- ఎస్.పి. కృష్ణమూర్తి (సెల్: 9966038800)

పద్యారామం

రైతుబిడ్డడుపరాష్ట్రపతి సింహాసన
మధిరోహణము చేయు విధము గల్గు
తేనీటి విక్రేత దేశంబు నేలెడు
ఘనమైన సుస్థితి గాంచగల్గు
పూటపూటకు తిండి పుట్టని వాడైన
వేలకోట్లు గడించు వీలు గల్గు
చదువుకొనుట కెట్టి సౌకర్యములు లేని
దళితు డధ్యక్షుడౌస్థాయి గల్గు
చిన్నచిన్న అపజయంబు లెన్నకుండ
ఉన్న వనరుల సద్వినియోగపరచి
ఉజ్జ్వలంబగు బ్రతుకు ముందున్నదనుచు
స్థైర్యధైర్యముల యువత సాగవలయు

- అముదాల మురళి



కవితలకు ఆహ్వానం

'నవకలం' శీర్షికకు యువకవుల నుంచి 20 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'నవకలం' శీర్షికకు, ఆంధ్రజ్యోతి(దినపత్రిక), ఇండస్ట్రియల్ ఎస్టేట్, రేణిగుంట రోడ్డు, తిరుపతి.**

■ బుక్ షెల్ఫ్



మన ఇంగ్లీషు-కామన్ ఎర్రర్స్

రచయిత: దుంగ దిలీప్‌కుమార్

దైనందిన జీవితంలో ఆంగ్లభాష అవసరం పెరిగిపోతున్న నేపథ్యంలో ఆ భాష మీద పట్టు సాధించడానికి , ఆ భాషలోని మెళకువల్ని తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. ఆంగ్లభాష వ్యవహారంలో నిత్యం మనం మనకు తెలియకుండానే చేసే తప్పుల్ని ఇందులో ఎత్తిచూపి వాటిని సరిదిద్దుకోవడానికి రచయిత మార్గాలను చూపారు.

పేజీలు: 224, వెల: రూ160
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్(అన్ని బ్రాంచీలలో)

ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?

ప్రాథమిక హక్కులు


కొమ్ము సుందర్‌రాజు

1. మానవుడు సంపూర్ణంగా, పరిపూర్ణంగా సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ఏవి ఉపయోగపడతాయి?
ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రాథమిక విధులు
సి) ఆదేశిక సూత్రాలు డి) ఏదీకాదు

2. ఒక రాజ్యం లక్షణం, స్వభావం అది ప్రజలకు అందించే హక్కుల ఆధారంగా తెలుస్తుందని ఎవరు పేర్కొన్నారు?
ఎ) మహాత్మాగాంధీ బి) నెహ్రూ
సి) హెచ్.జె.లాస్కీ డి) జె.డబ్ల్యూ.గార్నర్

3. ప్రాథమిక హక్కులు సాధారణ చట్టాల కంటే అత్యున్నతమైనవి అని పేర్కొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి?
ఎ) హెచ్.జె.కానియా బి) కె.జి.బాలకృష్ణన్
సి) పతంజలిశాస్త్రి డి) ఎవరూ కాదు

4. జాతీయ ఉద్యమ కాలంలో 'స్వరాజ్' అనే బిల్లును (1895) ప్రతిపాదించి అందులో భారతీయులకు 'వాక్, భావ ప్రకటన' స్వేచ్ఛలను అందించాలని తొలిసారి డిమాండ్ చేసింది?
ఎ) అనిబిసెంట్ బి) మహాత్మాగాంధీ
సి) సర్దార్ వల్లభాయ్ పటేల్ డి) తిలక్

5. 1925లో 'Common wealth of India' అనే బిల్లును ప్రతిపాదించి అందులో ఐరిష్ రిపబ్లికన్లకు అందించిన హక్కులను భారతీయులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేసింది ఎవరు?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) గాంధీ డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

6. భారతీయులకు ప్రాథమిక హక్కులు కల్పించాలని ఏ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ (1931) తొలిసారిగా డిమాండ్ చేసింది?
ఎ) మద్రాస్ సమావేశం బి) కరాచీ సమవేశం
సి) కలకత్తా సమావేశం డి) ఏదీకాదు

7. 1935 భారత ప్రభుత్వ చట్టంలో కొన్ని ప్రాథమిక హక్కులను బ్రిటిషర్లు భారతీయులకు అందిస్తుండగా అడ్డుకొన్నవారు?
ఎ) మింటో - మార్లే బి) మాంటెగ్ - చెమ్స్‌ఫర్డ్
సి) లార్డ్ రీడింగ్ - సర్‌జాన్ సైమన్
డి) గాంధీ - అంబేద్కర్

8. 1944-45లో ప్రాథమిక హక్కుల పరిశీలనపై జాతీయ కాంగ్రెస్ ఎవరి అధ్యక్షతన ఒక సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) సర్ తేజ్‌బహదూర్ సప్రూ బి) పటేల్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్

9. రాజ్యాంగ పరిషత్తు ఎవరి అధ్యక్షతన ప్రాథమిక హక్కుల సలహా సంఘాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) జె.బి.కృపలాని బి) బి.ఎన్.రావ్
సి) నెహ్రూ డి) సర్దార్ వల్లభాయ్ పటేల్

10. ప్రాథమిక హక్కుల సలహా సంఘాన్ని రాజ్యాంగ పరిషత్తు ఎప్పుడు ఏర్పాటు చేసింది?
ఎ) 1946 బి) 1947 సి) 1948 డి) 1949

11. ప్రాథమిక హక్కుల సలహా సంఘంలో సభ్యుల సంఖ్య?
ఎ) 54 బి) 64 సి) 55 డి) 65

12. ప్రాథమిక హక్కుల ఉపసలహా సంఘం అధ్యక్షుడు?
ఎ) బి.ఎన్.రావ్ బి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
సి) కె.ఎం.మున్షీ డి) జె.బి.కృపలాని

13. ప్రాథమిక హక్కులను రాజ్యాంగ నిర్మాతలు ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) అమెరికా బి) రష్యా సి) ఫ్రాన్స్ డి) ఐర్లాండ్

14. ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో ఎక్కడ పొందుపరిచారు?
ఎ) 1వ భాగం 1-4 ఆర్టికల్స్
బి) 2వ భాగం 5-11 ఆర్టికల్స్
సి) 3వ భాగం 12-35 ఆర్టికల్స్
డి) 4వ భాగం 36-51 ఆర్టికల్స్

15. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక హక్కులను తాత్కాలికంగా రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) సుప్రీంకోర్టు డి) కేంద్ర ప్రభుత్వం

16. ఏ ప్రాథమిక హక్కు ఐదు అధికరణలను కలిగి ఉంది?
ఎ) సమానత్వపు హక్కు
బి) స్వాతంత్ర్యపు హక్కు
సి) మతస్వాతంత్ర్యపు హక్కు
డి) పీడనాన్ని నిరోధించే హక్కు

17. రాజ్యాంగం పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) 5 బి) 6 సి) 7 డి) 8

18. ఆస్తి హక్కును ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ చట్టం
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ చట్టం
సి) 1956, 7వ రాజ్యాంగ సవరణ చట్టం
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ చట్టం

19. ప్రస్తుతం ఆస్తిహక్కును చట్టబద్ధమైన హక్కుగా మారుస్తూ ఏ అధికరణంలో పొందుపరిచారు?
ఎ) 31వ అధికరణం బి) 31(ఎ)వ అధికరణం
సి) 300వ అధికరణం డి) 300(ఎ)వ అధికరణం

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. ఏ అధికరణం భారత పౌరులకు ఆరు రకాల ప్రాథమిక స్వేచ్ఛలను ప్రసాదిస్తుంది?
ఎ) 14వ అధికరణం బి) 17వ అధికరణం
సి) 19వ అధికరణం డి) 21వ అధికరణం

21. వాక్, భావప్రకటన స్వేచ్ఛలను ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 19(1-ఎ) బి) 19(1-బి) సి) 19(1-సి) డి) 19(1-డి)

22. చలనచిత్రాలు, వార్తాపత్రికలు, నవలలు ఏ అధికరణం ద్వారా భావప్రకటన వ్యక్త పరచవచ్చు?
ఎ) 18వ బి) 19(1-ఎ) సి) 21వ డి) 21(ఎ)

23. జీవించే హక్కు గురించి తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

24. ఏ ఒక్క పౌరుడిని 'చట్టం పేర్కొన్న పద్ధతి మినహా' మరోవిధంగా అతడి జీవనానికి, స్వేచ్ఛకు భంగం కల్గించరాదు అని తెలిపే అధికరణం?
ఎ) 21వ బి) 22వ సి) 23వ డి) 24వ

25. 6-14 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాలని తెలిపే అధికరణం?
ఎ) 20వ బి) 20(ఎ) సి) 21వ డి) 21(ఎ)

26. ఏ రాజ్యాంగ సవరణ ద్వారా 21(ఎ) అర్టికల్‌ని రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) 1976, 42వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 2001, 85వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. నిర్బంధంలోకి తీసుకొన్న వ్యక్తిని 24 గంటల లోపు సమీప న్యాయస్థానం, న్యాయమూర్తి ముందు హాజరుపరచాలని తెలిపే అధికరణం?
ఎ) 20వ బి) 21వ సి) 22వ డి) 23వ

28. మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి వంటి అమానుష చర్యలు నిషేధమని తెలిపే ప్రాథమిక హక్కు?
ఎ) సమానత్వపు హక్కు బి) స్వాతంత్ర్యపు హక్కు
సి) మతస్వాతంత్ర్యపు హక్కు
డి) పీడనాన్ని నిరోధించే హక్కు

29. అస్పృశ్యత నివారణను తెలిపే అధికరణం?
ఎ) 17వ బి) 18వ సి) 19వ డి) 20వ

30. అమల్లో ఉన్న చట్టాన్ని అతిక్రమించనిదే ఏ ఒక్క వ్యక్తిని దోషిగా పరిగణించరాదని తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

31. అత్యవసర పరిస్థితి కాలంలో సైతం రద్దుకాని అధికరణలు?
ఎ) 17, 18 బి) 19వ సి) 20, 21 డి) 23, 24

32. స్త్రీలు, బాలబాలికల అక్రమ రవాణా నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 1956 బి) 1975 సి) 1986 డి) 2002

33. ప్రభుత్వం నిషేధించిన సంస్థలు, సంఘాలను ఏర్పాటు చేసుకోరాదని తెలిపే అధికరణం?
ఎ) 19(1-ఎ) బి) 19(1-బి) సి) 19(1-సి) డి) 19(1-డి)

34. భారతదేశంలో ప్రధాని మొదలుకొని సామాన్య పౌరుడి వరకు చట్టం దృష్టిలో అందరూ సమానులే అని తెలిపే అధికరణం?
ఎ) 14వ బి) 15వ సి) 16వ డి) 17వ

35. 'అస్పృశ్యత' పదాన్ని ఉపయోగించరాదని ఏ హైకోర్టు తీర్పు ఇచ్చింది?
ఎ) మద్రాస్ బి) మైసూరు
సి) బొంబాయి డి) ఢిల్లీ

36. ఆయుధాలు ధరించకుండా, శాంతియుతంగా సమావేశాలను ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛను ఏ అధికరణం ద్వారా కల్పించారు?
ఎ) 19(1-ఎ) బి) 19వ సి) 19(1-బి) డి) 19(1-డి)

37. ప్రతి పౌరుడు భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ జమ్మూకశ్మీర్, గిరిజన ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోరాదు అని తెలిపే అధికరణం?
ఎ) 19(1-ఎ) బి) 19(1-సి) సి) 19(1-డి) డి) 19(1-ఇ)

38. మతవ్యాప్తి, మత అభివృద్ధికి ఖర్చు చేసిన వ్యయంపై పన్నులు చెల్లించనక్కరలేదు అని తెలిపే అధికరణం?
ఎ) 27వ బి) 28వ సి) 29వ డి) 30వ

39. మైనార్టీలు విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపే అధికరణం?
ఎ) 30వ బి) 31వ సి) 31(ఎ) డి) 31(బి)

40. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినప్పుడు పౌరుడు ఏ అధికరణం ప్రకారం సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు?
ఎ) 30వ బి) 31వ సి) 32వ డి) 33వ

41. ప్రాణరక్షణ గురించి తెలిపే ఆర్టికల్?
ఎ) 17వ బి) 19వ సి) 20వ డి) 21వ

42. ఆస్తి హక్కు(31వ అధికరణం)పై సవరణ, పరిమితులను విధించే అధికారం 368 అధికరణం ప్రకారం పార్లమెంట్‌కు లేదు అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు ఇచ్చింది?
ఎ) గోలక్‌నాథ్ Vs పంజాబ్ (1967)
బి) కేశవానందభారతి Vs కేరళ(1973)
సి) మినర్వామిల్స్ Vs ఢిల్లీ(1980)
డి) ఎ.కె.గోపాలన్ Vs మైసూర్(1950)

43. నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోపు కోర్టుకు హాజరుపరిచే రిట్?
ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
సి) ప్రొహిబిషన్ డి) సెర్షియోరరీ

44. మత స్వేచ్ఛ గురించి తెలిపే అధికరణం?
ఎ) 23వ బి) 24వ సి) 25వ డి) 29వ

45. ఏ అధికరణం ప్రకారం బలహీన వర్గాలు తమ భాష, సంస్కృతులను పరిరక్షించుకోవచ్చు?
ఎ) 29వ బి) 30వ సి) 31వ డి) 32వ

46. పార్లమెంట్, శాసనసభ్యులు రూపొందించే చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉంటే అవి చెల్లవని తెలిపే అధికరణం?
ఎ) 12వ బి) 13వ సి) 14వ డి) 15వ

47. నేరం రుజువు కానిదే శిక్ష విధించరాదని తెలిపే అధికరణం?
ఎ) 19వ బి) 20వ సి) 21వ డి) 22వ

48. సాయుధ దళాల ప్రాథమిక హక్కులపై ఎవరు షరతులు విధిస్తారు?
ఎ) రాష్ట్రపతి బి) రక్షణశాఖ
సి) సుప్రీంకోర్టు డి) పార్లమెంట్

49. అర్హత లేకుండా పదవిలో కొనసాగడాన్ని నివారించే రిట్?
ఎ) హెబియస్ కార్పస్ బి) మాండమస్
సి) ప్రొహిబిషన్ డి) కో-వారెంట్

50. భారత రాజ్యాంగ చరిత్రలో స్వేచ్ఛ హక్కుకు సంబంధించి తొలి కేసు?
ఎ) ఎ.కె.గోపాలన్ Vs మైసూరు(1950)
బి) మేనకాగాంధీ కేసు(1978)
సి) గోలక్‌నాథ్ Vs పంజాబ్(1967)
డి) కేశవానందభారతి Vs కేరళ(1973)

సమాధానాలు

1) ఎ	9) డి	17) బి	25) డి	34) ఎ	43) ఎ
2) సి	10) బి	18) బి	26) డి	35) బి	44) సి
3) సి	11) సి	19) డి	27) సి	36) సి	45) ఎ
4) డి	12) డి	20) సి	28) డి	37) డి	46) బి
5) ఎ	13) ఎ	21) ఎ	29) ఎ	38) ఎ	47) బి
6) బి	14) సి	22) బి	30) బి	39) ఎ	48) డి
7) సి	15) బి	23) సి	31) సి	40) సి	49) డి
8) ఎ	16) ఎ	24) ఎ	32) ఎ	41) డి	50) ఎ
			33) సి	42) ఎ	

ఉద్యోగాలు

ఐఐఎస్ఇఆర్‌బి

భోపాల్లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్‌బి)- **నాన్ టీచింగ్ పోస్టుల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 10
పోస్టులు: డిప్యూటీ రిజిస్ట్రార్ 1, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ 1, సైంటిఫిక్ ఆఫీసర్ (ఫిజిక్స్) 1, మెడికల్ ఆఫీసర్ 1, టెక్నికల్ సూపరింటెండెంట్ (కంప్యూటర్ సైన్స్) 1, సైంటిఫిక్ సూపరింటెండెంట్ (బయాలజీ) 1, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) 1, టెక్నికల్ అసిస్టెంట్ 1, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ 1, ఆఫీస్ అసిస్టెంట్ (లీగల్) 1
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 8
వెబ్‌సైట్: http://recruitment.iiserb.ac.in/IIS-ERB

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 54**
పోస్టులు - ఖాళీలు: అసిస్టెంట్ డైరెక్టర్ - కెమిస్ట్రీ 1, అసిస్టెంట్ ఇంజనీర్ 3, స్పెషలిస్ట్ గ్రేడ్ 3 అసిస్టెంట్ ప్రొఫెసర్ 37, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 6, డ్రిల్లర్ ఇన్ ఛార్జ్ 5, లెక్చరర్ 2
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంబిబిఎస్/ ఎండి/ ఎమ్మెస్/ డిఎం/ ఎంసిహెచ్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో కనీసానుభవం ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.upsconline.nic.in

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 173**
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్ (ఫ్లెక్సీబుల్) 19, డిప్యూటీ అడ్వైజర్ (ఫ్లెక్సీబుల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్ (ఫ్లెక్సీబుల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీబుల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

శిథిలావస్థలో పంచాయతీ భవనం

గంగవరం: మండలంలోని కలగటూరు పంచాయతీ భవనం శిథిలా వస్థకు చేరుకుంది. సుమారు 35 సంవత్సరాల క్రితం నిర్మించిన భవ నం చిన్న పాటి వర్షానికే ఉరుస్తుంది. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనం ఎందుకూ ఉపయోగపడకుండా పోయింది. అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం

సమస్యల వలయంలో చిన్నేపల్లె





గ్రామంలో పేరుకుపోయిన పేడ దిబ్బలు - కాలువలో పేరుకుపోయిన మురుగునీరు - నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరు

పెద్దపంజాణి: ఆ గ్రామం ఓ మురుగు నీటి కుంట, ఆ గ్రామం అంటు రోగాలకు నిలయం. ఈ గ్రామం మరెక్కడో లేదు పెద్దపంజాణి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చిన్నేపల్లె. దాదాపు 450 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామస్థులందరికీ కూలీ పనులు, చిల్లర వ్యాపారమే జీవనాధారం. ఎన్నికల సమయంలో మినహా ఈ గ్రామానికి నాయకులు రారు. గ్రామం నిండా సమస్యలే పట్టించుకునే వారు లేరు. ముఖ్యంగా సరైన వీధులు లేవు. మురుగు నీరు పేరుకుపోయి వీధుల్లో ప్రవహిస్తోంది. ఎక్కడికైనా ముక్కు మూసుకోవాల్సిందే. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో ఉన్న తాగునీటి బోరు నిరుపయోగంగా ఉండడంతో గ్రామస్థులు వ్యవసాయ బోర్ల పైన ఆధారపడాల్సిన పరిస్థితి. గ్రామంలో ఎక్కడ చూసిన పేడ దిబ్బలు ఉండడంతో దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల శివాడి గ్రామంలో రోగాల బారిన పడిన గ్రామస్తులకు వైద్యం అందించిన వైద్యాధికారులు పేడదిబ్బల కారణంగా అంటురోగాలు ప్రబలుతున్నాయని గుర్తించి వెంటనే వాటిని తొలగించడంతో అంటు రోగాలు తగ్గుముఖం పట్టాయి. చిన్నేపల్లె గ్రామంలో కూడా రోగాల ప్రబలకుండా చర్యలు తీసు కోవడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు: జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐడీఆర్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న, నాయకులు వెంకటేష్, మధు, మల్లికార్జున్ తదితరులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పలమనేరు ఎస్సీ బాలికల వసతి గృహంలో సమావేశం ఏర్పాటు చేసి ఆ మేరకు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఎన్ఐఓఎస్ పరీక్షలు విజయవంతం



పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి కందేశ్వరరావు

బంగారుపాళ్యం: మండలంలో సాక్షర భారత్ ఏడవ దశలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఎన్ఐఓఎస్ 13వ దశ పరీక్షలు విజయవంతమైనట్లు ఎంసీవో హేమ ప్రసాద్ తెలిపారు. మండలంలో 1311 మంది నూతన అక్షరాస్యత అభ్యాసకులకు గాను 1308 మంది హాజరైనట్లు 40 పంచాయతీల పరిధిలో పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ముంగరమడుగు గ్రామంలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా సాక్షరభారత్ సూపర్‌వైజర్ కందేశ్వరరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి

జిల్లా అధికారులు చొరవ చూపాలి

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యురాలు కుసుమకుమారి



హక్కులను గురించి వివరిస్తున్న కుసుమకుమారి

బంగారుపాళ్యం: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సమస్యల పరిష్కారం పట్ల జిల్లా అధికారులు చొరవ చూపాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యురాలు కుసుమ కుమారి కోరారు. మండలంలోని వజ్రాలపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. వజ్రాలపురం గ్రామానికి చెందిన దళితులు రాజమ్మ, గోపాలయ్యకు చెందిన భూమిని అగ్ర వర్ణాల వారు ఆక్రమించుకున్నారని ప్రస్తుతం తమ ఇళ్లకు దారి కూడా లేకుండా కంచె వేశారని ఎస్సీ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సభ్యురాలు కుసుమకుమారి గ్రామంలో పర్యటించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. జిల్లా అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై నిర్భయంగా తమకు తెలియజేయాలని ఆమె తెలిపారు.

కృష్ణమరాజుకు కళారత్న, నట శిరోమణి బిరుదులు ప్రదానం



కృష్ణమరాజును సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, చిత్తూరు మేయర్

బంగారుపాళ్యం: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, కళా పోషకులైన కృష్ణమరాజుకు చిత్తూరు వరసిద్ధి కళాక్షేత్రం 17వ వార్షికోత్సవం సందర్భంగా కళారత్న, నట శిరోమణి బిరుదులతో ఘనంగా సత్కరించారు. చిత్తూరులోని బీజెడ్ హైస్కూల్ విశ్రాంత ఉద్యోగి కృష్ణమరాజు పలు పౌరాణిక పాత్రల్లో నాటికలు, రంగస్థల కళాకారుడిగా జిల్లా ప్రజలకు సుపరిచితం. అంతేకాక ఆయన కళాకారులను ప్రోత్సహిస్తూ వారికి అండగా ఉంటూ కళా పోషకుడిగా ఆయన చేసిన విశేష సేవలను గుర్తించి వరసిద్ధి కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం కృష్ణమరాజుకు కళారత్న, నట శిరోమణి బిరుదులను ఇచ్చి జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి, చిత్తూరు మేయర్ కఠారి హేమలత చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ రామలక్ష్మమ్మ, వరసిద్ధి కళాక్షేత్రం అధ్యక్షుడు మొగిలయ్యతో పాటు పలువురు కళాకారులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమరాజు మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి కళలంటే ఎంతో మక్కువని బంగారుపాళ్యం జమీందార్లకు దగ్గరి బంధువు కావడంతో చిన్నప్పటి నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులచే తనకు పరిచయాలు ఉండేవని, జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంగీత సాహిత్యాల్లో ప్రసిద్ధి చెందిన కళాకారులచే కళా ప్రదర్శనను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. తన సేవలను గుర్తించి బిరుదును ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. తన కుమారుడు ప్రసాద్ కూడా చిత్రసీమలో కెమెరామేన్ గా పని చేస్తున్నాడని తెలిపారు.

ఘనంగా రాజీవ్ జయంతి



రోగులకు పండ్లు, పాలు అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

పలమనేరు: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పలమనేరు పట్టణంలో యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఫైరోజ్, యువజన కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, రహీంఖాన్, గోవర్ధన, దావూద్, జానకి, సాధిక్, జయకుమార్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోరు.. దాతను సన్మానించిన గ్రామస్థులు



జలదాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

గంగవరం: జలదాత సుభిక్షవ అని పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు కొనియాడుతున్నారు. మండలంలోని పత్తికొండ ఉన్నత పాఠశాలలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు గ్రామానికి చెందిన జయరామశెట్టి సొంత ఖర్చుతో బోరు, మోటారు వేయించారు. ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఉండేది. పరిస్థితిని జయరామశెట్టికి వివరించగా సుమారు రూ.2 లక్షలతో బోరు వేయించి మోటర్ కూడా ఏర్పాటు చేయించారు. అతడిని హెచ్ఎం శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు, సర్పంచ్ రంగప్పనాయుడు, గ్రామస్థులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీ ఆలయాన్ని నిర్మిస్తానని ఈ సందర్భంగా జయరామశెట్టి హామీ ఇచ్చారు.

మద్యం షాపు తరలించాలని

మహిళల ధర్నా, రాస్తారోకో

పలమనేరు: పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తరలించాలని కోరుతూ ఆదివారం మధ్యాహ్నం ఆ ప్రాంతానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున మద్యం షాపు ముందు ధర్నా చేసి గుడియాత్తం రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. వర్షం కురుస్తున్నా మహిళలు రాస్తారోకో చేస్తుండడంతో విషయం తెలుసుకున్న పలమనేరు ఎస్ఐ రాంభూపాల్ ఆందోళన కారుల వద్దకు వెళ్లి మద్యం దుకాణం తరలింపు విషయమై ఎక్సైజ్ అధికారులకు, తహసీల్దార్‌కు తెలియజేస్తామని నచ్చజెప్పడంతో మహిళలు తమ ఆందోళనను విరమించారు.



మద్యం షాపు వద్దంటూ వర్షంలోనే రాస్తారోకో చేస్తున్న మహిళలు

వైభవంగా శనీశ్వరస్వామి పల్లకీ ఉత్సవం

వి.కోట: శ్రావణ శనివారోత్సవాల్లో భాగంగా శనీశ్వరుడి పల్లకీ సేవను వి.కోటలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయానే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, విశేష అలంకరణ, మహామంగళ హారతి చేపట్టారు. అనంతరం పల్లకీలో శనీశ్వరస్వామి, జేష్టాదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుతీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్య సంఘం ఆలయానికి అవసరమైన స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అందజేసింది.

'ఉపాధి' నిధులు పంచాయతీ భవనాల పాలు

కుప్పం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉట్టి పుణ్యానికి గ్రామ పంచాయతీ భవనాల పాల వుతున్నాయి. నాసిరకంగా నిర్మించే ఈ భవనాలు కట్టిన మూణ్నాళ్ళకే పెచ్చులూడి, గేట్ల లింకులు తెగి, ఊడిన ఇనుప గేట్లు చోరీకి గురవుతున్నాయి. కనీసం ఉపయోగానికి నోచుకోక ఇటువైపు తిరిగిచూసేవారు లేక శిథిల స్థితికి చేరుకుంటున్నాయి.

కుప్పం మండలంలో 31 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో చాలా పంచాయతీలకు సొంత భవనాలున్నాయి. వాటిలో 90 శాతం వరకు ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించినవే. ఒక్కో పంచాయతీ భవనానికి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేస్తోంది. ఇందులో 13.50 లక్షలు ఉపాధి పథకం నుంచి ఇస్తుండగా, మిగిలిన రూ.1.50 లక్షలు ఆయా గ్రామ పంచాయతీలే భరించాల్సి ఉంటుంది. వీటి కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయో, వారు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పట్టించుకునే వారే ఉండడంలేదు. సిమెంటు తక్కువ, దుమ్ము ఇసుక ఎక్కువగా వేసి, ఇటుక బట్టీల్లో సరిగ్గా కాలని ఇటుకలతో గోడలు లేపేస్తున్నారు. పరమ నాసిరకం రేకులను, కొయ్యను తెచ్చి తలుపులు, కిటికీలకు వాడేస్తున్నారు. అతి తక్కువ గేజ్ ఉన్న ఇనుప పైపులతో ప్రహరీ గేట్లు నిలబెడుతున్నారు. నాసిరకంగా నిర్మాణమవుతున్న పంచాయతీ భవనాలు కట్టిన ఒకట్రెండు నెలలకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎందుకనో ఆయా పంచాయతీల భవనాల నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తీసుకు రావడం లేదు. లేదా నామమాత్రంగా తెరిచి నెలలో అన్ని రోజులూ మూతవేసి ఉంచుతున్నారు. ఉదాహరణకు చెక్కునత్తం గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు పక్కనే నిర్మించారు. అప్పట్లో రూ.13 లక్షలు ఇందుకు వెచ్చించారు. ఎప్పుడు నిర్మించారన్నది ఎక్కడా భవనంమీద నమోదు చేయలేదు. ఎండకు ఎండి వానకు తడిసి నాసిరకం కొయ్యతో చేసిన కిటికీలు, తలుపులు శిథిలమవుతున్నాయి. పెయింటు చెరిగిపోయి అక్కడక్కడా పెచ్చులూడే స్థితికి గోడలు వచ్చాయి. ఇక ప్రహరీకి ఉన్న ఇనుప గేట్లలో ఒక గేటును ఊడపెరికి ఎవరో, ఎక్కడో అమ్మేశారు. ఇంకో గేటు కూడా నేడో, రేపో ఊడే పరిస్థితికి వచ్చింది. ఇక వెండుగంపల్లి పంచాయతీ భవనం కూడా ఇదే దుస్థితిలో కొనసాగుతోంది. దీని ప్రహరీ గేట్లకున్న లింకులు ఊడిపోవడంతో తాత్కాలికంగా దారాలు వేసి కట్టిపెట్టారు. భవనం పెచ్చులూడిపోతోంది. కిటికీలు, ద్వారాలకున్న తలుపులు నాసిరకం రేకుతో చేసినవి కావడంవల్ల నేడో రేపో ఊడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. రెండు పంచాయతీ భవనాలకు ఎప్పుడు చూసినా తాళాలు వేసే ఉంచుతున్నారు. పంచాయతీ భవనం ఎదుట మురుగు కాలువ పూడిక తీత లేక ఘోరంగా దర్శనమిస్తోంది. ఇవి రెండే కాదు.. మండలంలోని దాదాపు ముప్పావు వంతు పంచాయతీ భవనాల దుస్థితికి కూడా ఇదే. ఇకపుడు తాజాగా ఉర్లవోబనపల్లె, వసనాడు, దళవాయికొత్తపల్లె పంచాయతీలకు భవనాలు మంజూరయ్యాయి. ఇవి కూడా ఒక్కో భవనానికి రూ.15 లక్షలు మంజూరు కాగా, ఇందులో రూ.13.50 లక్షలు ఉపాధి నిధులు, కేవలం రూ.1.50 లక్షలు పంచాయతీలు భరించాల్సి ఉంటుంది. కనీసం ఈ భవనాలైనా నాణ్యతా ప్రమాణాల ప్రకారం నిర్మించి, ఉపయోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని మిగిలిన పంచాయతీ భవనాలకు కనీస మరమ్మతులు చేసి రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగిస్తేనే ఉపాధి నిధులు సద్వినియోగం అవుతాయి.

నిరుపయోగంగా నాసిరకం నిర్మాణాలు





కనిపించకుండా పోయిన చెక్కునత్తం పంచాయతీ భవనం గేటు - దారంతో బిగించి కట్టిన వెండుగంపల్లి పంచాయతీ భవనం ప్రహరీ గేట్లు



పెచ్చులూడిన వెండుగంపల్లి పంచాయతీ భవనం గోడలు

వేరుశనగ పంటకు జీవం



బిజిగానిపల్లె కళకళలాడుతున్న వేరుశనగ

గుడుపల్లె: మండలంలో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ పంట కళకళలాడుతుంది. రెండు వేల ఎకరాలకు పైగా ఖరీఫ్ సీజన్ లో మెట్ట ప్రాంతాల్లో రైతులు వేరుశనగ పంట వేశారు. రెండు నెలల క్రితం వేసిన వేరుశనగ వర్షాభావం కారణంగా 50 శాతంపైగా పంట ఎండిపోయిందని రైతులు ఆవేదన చెందారు. కాగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి వేరుశనగకు మళ్ళీ ఊపిరొచ్చిందని రైతులు సంబరపడుతున్నారు.. మరో నెల రోజుల్లో వేరుశనగ పంట కోతకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. పంట బీమా 300 పైగా రైతులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెప్పగా, వేరుశనగ పంట బీమా వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

జోరుగా వరి సాగు

మండలంలో రైతులు జోరుగా వరి సాగుకు సిద్ధమవుతున్నారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాల తర్వాత మండలంలో భారీ వర్షపాతం నమోదైంది. మండలంలోని 85 చెరువులకు 50 చెరువులు పూర్తిగా నిండగా 35 చెరువులు పాక్షికంగా నిండాయి. చెరువు కింద ఆయకట్టు ఉన్న రైతులు ఇప్పటికే రాగి నాట్లు వేశారు. అయితే వర్షంపడి చెరువులు నిండడంతో రాగి మడులను దున్ని వరి నారుపోసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. బోర్ల నీటిపై ఆధారపడి వరినారు పోసుకున్న రైతులు చెరువు కింద మడుల్లో వరినాట్లు వేస్తున్నారు.

అంతరిస్తున్న కళలను కాపాడుకుందాం

వి.కోట: అంతరిస్తున్న భారతీయ కళలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళాతరంగిణి సంస్థ కార్యదర్శి రాజేష్‌బాబు అన్నారు. వి.కోట తేజ కల్యాణ మండపంలో కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో 117వ నృత్య పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది పాల్గొని సినీ, శాస్త్రీయ, జానపద నృత్యాలతో పాటు, దేశభక్తి గేయాలను ఆలపించారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో సోలో, గ్రూప్, అన్ని విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. అలాగే విద్య, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగాచార్య గోపీనాథ్, న్యాయనిర్ణేతలు సురేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

3న స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

రామకుప్పం: మండల పరిధిలో వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హేమలతా రెడ్డి, జడ్పీటీసీ మునస్వామి, ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతుందని, అర్హత ధ్రువ పత్రాలతో హాజరుకావాలని వారు కోరారు.

ఘన వ్యర్థ పదార్థాలపై
23న ప్రజాప్రతినిధులకు శిక్షణ

రామకుప్పం: మండల పరిధిలోని సర్పంచ్ లు, ఎంపీటీసీలకు ఈ నెల 23న వి.కోటలో ఘన వ్యర్థ పదార్థాల నివారణపై శిక్షణ శిబిరం జరుగుతుందని ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులందరూ విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నిజాయితీ చాటిన యువకుడికి సత్కారం

రామకుప్పం: తనకు దొరికిన విలువైన బంగారు ఆభరణాన్ని పోలీసులకు అప్పగించిన రామకుప్పంకు చెందిన కార్తీక్ నిజాయితీ యువతకు ఆదర్శనీయమని కుప్పం సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కేబుల్ నెట్ వర్క్‌లో పనిచేస్తున్న కార్తీక్‌కు నాలుగు రోజుల క్రితం రామకుప్పం ఆటోస్టాండ్ వద్ద రూ. 50 వేలు విలువ చేసే బంగారం దొరికింది. వెంటనే కార్తీక్ దానిని రామకుప్పం ఎస్ఐ సురేష్‌కు అప్పగించాడు. కార్తీక్ నిజాయితీని అభినందిస్తూ శనివారం కుప్పం సీఐ రాజశేఖర్ దుశ్శాలువతో సత్కరించి బహుమతి అందజేశారు.



కార్తీక్‌ను సన్మానిస్తున్న కుప్పం సీఐ రాజశేఖర్

వికటించిన వైద్యం

లబోదిబోమంటున్న గొర్రెల పెంపకందారుడు

రామకుప్పం: తాను పెంచే గొర్రెలు ఆహారం సక్రమంగా తీసుకోవడం లేదని పశువైద్య సిబ్బందికి తెలపగా, వారిచ్చిన మందులు వాడగా, అది వికటించి ఓ కుటుంబం తీవ్రం గా నష్టపోయింది. బాధితుడు శ్రీనివాసుల కథనం మేరకు...

మండల పరిధి జౌకుపల్లెకు చెందిన శ్రీనివాసులు 20 సంవత్సరాలుగా గొర్రెల పెంపకం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 15 రోజుల క్రితం గొర్రెలు తక్కువగా ఆహారం తీసుకుంటున్నాయని స్థానిక పశువైద్య సిబ్బందిని ఆశ్రయించాడు. వారు అతనికి మందు ఇచ్చి, దానిని గొర్రెల చేత తాగిస్తే అవి తగినంతగా ఆహారాన్ని తీసుకుంటాయన్నారు. శ్రీనివాసులు ఆ మందును అన్ని గొర్రెలకు తాగించాడు. మరుసటి రోజు నుంచి గొర్రెలు దవడ వాచిపోయి మేత తినకుండా పళ్ళు కొరుక్కుంటూ వణకడం ప్రారంభించాయి. దీంతో గొర్రెలు చనిపోతాయోనన్న ఆందోళనతో శ్రీనివాసులు 110 గొర్రెలను అతి చౌకగా విక్రయించాడు. ఈ విషయాన్ని పశువైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా వారు శ్రీనివాసుల ఇంటికి వచ్చి మందు డబ్బాను తీసుకెళ్ళిపోయారు. వైద్యం వికటించడంపై వైద్య సిబ్బందులను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి జారుకున్నారని బాధితుడు శ్రీనివాసులు కన్నీరుమున్నీరయ్యా డు. పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తాము జీవనోపాధికోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని శ్రీనివాసులు వేడుకుంటున్నారు.

చినుకు పడితే చిత్తడే

అధ్వానంగా ఉన్న కర్లగట్ట గ్రామీణ రహదారులు
అరకొరగా నిలిచిపోయిన బీటీ రోడ్లు
పట్టించుకోని అధికారులు

శాంతిపురం: నాలుగు చినుకులు పడగానే గ్రామీణ రోడ్డు చిత్తడైతున్నాయి. కర్లగట్ట పంచాయతీలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసిన అరకొరగా బీటీ రోడ్లు నిలిపి వేయడంతో ఆ రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. మట్టి రోడ్లన్నీ కురిసిన కొద్దిపాటి వర్షానికే కోతకు గురయ్యాయి. కర్లగట్ట నుంచి సోమాపురంకు వెళ్ళే మట్టి రోడ్డు బీటీ రోడ్డుగా మార్చారు. అది రెండున్నర కిలో మీటర్ బీటీ రోడ్డు వేసి ఒకటిన్నర కిలో మీటర్ మట్టి రోడ్డుగానే వదిలేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు అధ్వానంగా మారింది. రెండు రోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షానికే చిన్న కుంటగా మారింది. అలాగే ప్రీతిచామనూరు నుంచి పొదూరు వెళ్ళే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చారు. అక్కడ కూడా ఒకటిన్నర కిలో మీటర్ బీటీ రోడ్డు వేసి, రెండు కిలో మీటర్ వరకు మట్టి రోడ్డు వదిలేశారు. అలాగే వెంకటాపురం లింకు రోడ్డు కొన్ని సంవత్సరాలుగా మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూనే ఉన్నారు. కర్లగట్ట ఉన్నత పాఠశాలకు వెళ్ళే రోడ్డు మరి అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు నానాతంటలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డను బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



కుంటను తలపిస్తున్న సోమాపురం రోడ్డు



కోతకు గురై అధ్వానంగా మారిన ఉన్నత పాఠశాల రోడ్డు

సినిమా గైడ్

శ్రీమహాలక్ష్మి	:	దండుపాళ్యం-2
లక్ష్మీ మూవీలాండ్	:	ఫిదా
ఎస్ఆర్ఎం	:	నిన్నుకోరి
మురుగన్	:	మాయామాల్

దినఫలాలు


అదృష్టసంఖ్యలు : 2, 3



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమ బెడిసికొట్టే అవకాశం ఉంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదుపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు అటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురవుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహరచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, పింఛన్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. బాధాకరమైన సమాచారం అందుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల: తిరుమలేశుడికి హుండీ ద్వారా రూ.3.74 కోట్ల ఆదాయం లభించింది. శనివారం వచ్చిన కానుకలను ఆదివారం లెక్కించగా ఈ మేరకు ఆదాయం సమకూరిందని అధికారులు ప్రకటించారు. కాగా, టీటీడీ ఆధ్వర్యంలో ఎస్వీ నిత్యాన్నప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.4.16 లక్షలు విరాళంగా అందింది.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఫోన్‌ఇన్, తర్వాత 'మీకోసం' జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖల జిల్లా అధికారులు విధిగా కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

రేపు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

చిత్తూరు అర్బన్: జిల్లా సబ్‌జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు పి.షణ్ముగం, కార్యనిర్వాహక కార్యదర్శి కె.కృష్ణ తెలిపారు. పూతలపట్టు జడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం 10 గంటలకు బాలబాలికలు పోటీలు జరుగుతాయని చెప్పారు. 01-01-2001 తర్వాత జన్మించిన వారందరూ పుట్టినతేది ధ్రువపత్రంతో హాజరు కావాలని కోరారు. పీడీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామనీ, ఇతర వివరాలకు నెం.9440757900ను సంప్రదించాలని కోరారు.

మార్కెట్ ధరలు

తిరుపతి బులియన్

24 క్యారెట్ల అపరంజి	**బంగారు**
10గ్రాముల ధర	రూ.29,860
22 క్యారెట్ల ఆర్నమెంటు	**బంగారు**
గ్రాము ధర	రూ.2,759
రిటైల్ వెండి గ్రాము ధర	రూ.41.90

మదనపల్లెలో

పట్టుగూళ్ల ధరలు

కనిష్ఠం	324.90
గరిష్ఠం	390.00
సగటు	354.55

టమోటా ధరలు

మొదటి రకం	
కనిష్ఠం	32.00
గరిష్ఠం	44.00
రెండో రకం	
కనిష్ఠం	18.00
గరిష్ఠం	30.00



కోడిగుడ్లు (నెక్)

రైతు గేటు ధర-చిత్తూరు (వందగుడ్లు)	390.00
చెన్నై	: 397.00

ద్రావిడలో డిప్యూటీ స్పీకర్‌కు ఘనస్వాగతం

గుడుపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్‌కు ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సత్యనారాయణ ఘనస్వాగతం పలికారు. ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకున్న మండలికి వర్సిటీ అధికారులు ఘనస్వాగతం పలికారు. సోమవారం అనంత పద్మానాభరావు రచించగా ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణల కేంద్రం ప్రచురించిన శంకరంబాడి సుందారాచారి ఆంగ్లపుస్తకాన్ని డిప్యూటీ స్పీకర్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య బాలసుబ్రమణియన్ , రిజిస్ట్రార్ ఆచార్య తిరుపతిరావు, ప్రచురణల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శావణ్‌కుమార్, పీఆర్వో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ, తదితరులు

ముక్కంటి సేవలో అడిషనల్ డీజీపీ



ముక్కంటి దర్శనానికి విచ్చేసిన కౌముది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం అడిషనల్ డీజీపీ కౌముది దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, స్థానిక పోలీసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మోహన్ , పీఆర్వో హరిబాబు యాదవ్, ఎస్ఐ సంజీవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి 'సంకల్పసిద్ధి' ప్రతిజ్ఞ

చిత్తూరు కలెక్టరేట్: నవభారత నిర్మాణం లక్ష్యంగా ఈనెల 23న మండలస్థాయి, 24న జిల్లాస్థాయిలో 'సంకల్పసిద్ధి ప్రతిజ్ఞ' నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఏ పీడీ బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రానున్న ఐదేళ్లకాలంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అధికారులకు అందజేస్తామన్నారు. దేశాన్ని పేదరికం, అవినీతి నుంచి దూరం చేయడం, కుల, మతరహితంగా చేయడం, ఆదర్శగ్రామాలను తీర్చిదిద్దుతామంటూ ప్రతిజ్ఞ చేయాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దడం, రహదార్ల నిర్మాణం, స్వయం సహాయక బృందాల ఏర్పాటుపైనా సంకల్పం చేయాలన్నారు. పేదలకు సొంతిళ్లు, నైపుణ్యాల పెంపు, అంత్యోదయ మిషన్ విజయవంతం చేద్దామంటూ ప్రజలు ప్రతిజ్ఞ చేసి సంబంధిత కాగితంపై సంతకం చేసి పంపాలని కోరారు.

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్‌లో ఉచిత సిమ్ మేళా

తిరుపతి (ఆటోనగర్): బీఎస్ఎన్ఎల్‌లో సోమవారం నుంచి 24వ తేది వరకు 64కే - 128 కె, నార్మల్, మైక్రో, స్మార్ట్ సిమ్‌ల ఉచిత మేళా నిర్వహిస్తున్నట్లు ఏజీఎం వెంకోబరావు (మార్కెటింగ్) తెలిపారు. ఈ ఉచిత మేళా నూతన వినియోగదారులకు మాత్రమేనని పేర్కొన్నారు. జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాల్లో ఈమేళా ఉంటుందన్నారు.

కరాటే అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె రూరల్: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కేఏఐ) జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం మదనపల్లెలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా వి.శ్రీనివాసులు, జిల్లా కోచ్ గా ఖాదర్‌బాష, సంయుక్తకార్యదర్శిగా సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పరంజ్యోతి, కోశాధికారిగా సురేష్, సభ్యులుగా చంద్రశేఖర్, సోమశేఖర్, కేశవ, అహ్మదుల్లా, దినకర్, పట్టాభి, సుకుమార్‌లను ఎన్నుకున్నారు. 2020 ఒలంపిక్స్ లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని కార్యవర్గం చెప్పారు.

నేడు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం

చిత్తూరు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం జరగనుంది. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ రాధిక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను నెం.08572-234000కు ఫోన్ చేసి వివరించాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా అందజేయాలని కోరారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ ఆఫీసర్ ' జరుగుతుందనీ, పోలీసులు తమ సమస్యలను నెం.08572-240443కు ఫోన్ చేసి చెప్పాలని ఆమె పేర్కొన్నారు.

వరసిద్ధుడి స్వర్ణ రథ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి స్వర్ణ రథ నిర్మాణానికి బెంగళూరుకు చెందిన శశిధర్ రూ.లక్ష విరాళం అందించినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తెలిపారు. విరాళ దాతకు ఆలయ సంప్రదాయం మేరకు అధికారులు స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ మూషిక మండపంలో విరాళ దాతను వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



విరాళం అందిస్తున్న దాత

కంటికి రెప్పలా శ్రీగంధం రక్షణ

- వనాలను పర్యవేక్షిస్తున్న టీటీడీ
- నూతనంగా మరో 15వేల మొక్కలు నాటుతున్న ఫారెస్టు అధికారులు
- ప్రతి మొక్కకూ వారానికి 10 నుంచి 15 లీటర్ల నీరందేలా చర్యలు
- శ్రీవారి కైంకర్యాలకు ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యం



శ్రీగంధం మొక్కలకు ఏర్పాటు చేసిన నీటి పైపులైన్లు

తిరుమల: తిరుమలలో శ్రీగంధం వనాన్ని టీటీడీ కంటికి రెప్పలా సంరక్షించుకుంటోంది. ప్రస్తుతం నీటి పైపులైన్ల అమరిక పనులతోపాటు నూతనంగా మరో 15వేల శ్రీగంధం మొక్కలు నాటే పనులు వేగంగా సాగుతున్నాయి. నాటిన ప్రతి మొక్కకూ పుష్కలంగా నీరందేలా టీటీడీ ఫారెస్ట్ విభాగం కృషి చేస్తోంది. ఇప్పటికే చాలా మొక్కలు ఊపిరిపీల్చుకున్నాయి. మరో నెల రోజుల్లో పైపులైన్ల అమరికను పూర్తిచేసి ప్రతి మొక్కకూ వారానికి 10 నుంచి 15 లీటర్ల నీరందేలా చర్యలు తీసుకుంటున్నారు.

200 ఏళ్లకు సరిపోయేలా..

శ్రీవేంకటేశ్వర స్వామివారి అభిషేకం, వసంతోత్సవం, స్నపన తిరుమంజనం వంటి కైంకర్యాలకు ఏడాదికి దాదాపు 500 కిలోల శ్రీగంధాన్ని వినియోగిస్తున్నారు. అందువల్ల శ్రీగంధం కొరత లేకుండా చేయడానికి టీటీడీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. 2013 డిసెంబరులో పాపవినాశనం మార్గంలో పార్వేట మండపం ఎదుట శ్రీగంధం మొక్కల పెంపకాన్ని చేపట్టారు. 12 హెక్టార్లలో 14వేల మొక్కలను నాటారు. గత ఏడాది జూలై 29వ తేదీన మరో 20 హెక్టార్లలో 15వేల మొక్కలతో శ్రీగంధం వనాన్ని ప్రారంభించారు. ఇలా.. పార్వేట మండపం వద్ద రెండుచోట్ల, కసువు మండపం, ధర్మగిరి పాఠశాల వద్ద మొత్తం నాలుగు ప్రాంతాల్లోని 88 హెక్టార్లలో సుమారు 50వేల నుంచి 55వేల వరకు మొక్కలను నాటారు. సాధారణంగా నాటిన మొక్కల్లో అధిక సంఖ్యలో ఎండిపోతుంటాయి.

దీన్ని దృష్టిలో ఉంచుకుని నాటిన ప్రతి మొక్కనూ రక్షించే చర్యలను టీటీడీ ఫారెస్టు విభాగం చేపట్టింది. ఇందులో భాగంగా కాంట్రాక్టు తీసుకున్న ట్రాయ్ కంపెనీ ప్రతి మొక్కకూ నీరందేలా 1.60 లక్షల మీటర్ల సన్నటి పైపు లైనును ఏర్పాటు చేస్తోంది. జలగాంలో తయారు చేసిన ఈ పైపులను ఇప్పటికే 40వేల మీటర్లు అమర్చారు. మిగిలిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ పైపులైను ద్వారా శుభ్రపరిచిన మురుగునీటిని ఒక్కో మొక్కకు వారానికి 10 నుంచి 15 లీటర్లను సన్నటిదారలా (డ్రిప్ పద్ధతి) అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వందల మొక్కలకు నీరు అందుతోంది. ఈ వనం పూర్తిస్థాయిలో సిద్ధమైతే సుమారు 200 ఏళ్లకు సరిపడా చందనం ఉత్పత్తి అవుతుందని అధికారులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ మొక్కల నుంచి ఫలితం అందాలంటే సుమారు 10 నుంచి 15 ఏళ్లు వేచి చూడాలి.

మరో 15వేల మొక్కలు

రెండు దఫాలుగా నాటిన మొక్కల్లో దాదాపు 12వేల మొక్కలు వర్షం, తీవ్ర ఎండ, ఈదురుగాలులకు ఎండిపోయాయి. వీటి స్థానంలో దాదాపు 15వేల మొక్కలను నాటాలని ఫారెస్టు అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఐదు వేల మొక్కలను నాటారు. మిగిలిన వాటిని కూడా మరో రెండు వారాల్లో నాటనున్నారు.

సంరక్షణకు పటిష్ఠ చర్యలు

శ్రీగంధం మొక్క ఏపుగా పెరగాలంటే సపోర్టుగా మరో మొక్కను నాటాలి. ఈ నేపథ్యంలో ఎర్రచందనం, ఏగిస, టేకు మొక్కలను నాటారు. వీటి వేర్ల ద్వారా శ్రీగంధం చెట్టు వేగంగా పెరిగేలా చర్యలు తీసుకున్నారు. అడవి జంతువుల నుంచి మొక్కలను రక్షించడానికి ప్రస్తుతం పార్వేట మండపం ఎదుట 2.7 కిలోమీటర్ల మేర కంచెను నిర్మించారు. మొక్క వంగిపోకుండా పెరగడానికి అక్కడక్కడా కర్రలను ఏర్పాటు చేశారు. మరో ఐదారేళ్ల తర్వాత మొక్కల్లో బలం చేకూరుతుందని అధికారులు తెలిపారు. నిత్యం సిబ్బందితోపాటు అధికారులు ఈ వనాలను పర్యవేక్షిస్తున్నారు.



శ్రీవారి పుష్కరిణికి పూర్తయిన మరమ్మతులు

నీటితో నింపుతున్న టీటీడీ

ఆంధ్రజ్యోతి, తిరుమల: శ్రీవారి పుష్కరిణికి మరమ్మతులు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం పైపులతో నీటిని నింపే పనులను టీటీడీ మొదలుపెట్టింది. వచ్చే నెలలో జరగనున్న తిరుమలేశుడి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఒకటో తేదీ నుంచి పుష్కరిణికి మరమ్మతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్కరిణిలోకి భక్తులను అనుమతించకుండా మూతవేశారు. రెండ్రోజుల వ్యవధిలోనే పాతనీటిని తొలగించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా మరమ్మతులు చేపట్టారు. మెట్లకు కొత్తగా రంగులు కూడా వేశారు. ఆదివారం ఉదయం నుంచి పైపుల ద్వారా నీరు వదలడం ప్రారంభించారు. దాదాపు మూడ్రోజుల్లో నీటిని నింపే పనులు పూర్తవుతాయి. ఈలోపు భక్తుల భద్రత దృష్ట్యా బ్యారికేడ్లకు ఇనుపకంచె ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక ఈ వారంలోనే శుభముహూర్తంలో పుష్కరిణిలోకి భక్తులను అనుమతించే అవకాశం ఉందని టీటీడీ అధికారులు భావిస్తున్నారు.

వెటర్నరీ వర్సిటీలో పాలన గాడిలో పడేనా?

రెగ్యులర్ వీసీ వచ్చి నెలలు గడుస్తున్నా అదే తీరన్న విమర్శలు



వెటర్నరీ వర్సిటీ పరిపాలనా భవనం

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో పాలన గాడి తప్పిందని అక్కడి ఉద్యోగులే బాహాటంగా పేర్కొంటున్నారు. రెగ్యులర్ వీసీ వచ్చినా తీరు మారడం లేదన్న విమర్శలూ లేకపోలేదు. గతంలోనే టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు రెండుమూడు వర్గాలుగా మారి పాలనను అటకెక్కించారన్న ఆరోపణలున్నాయి. ఈ వర్గపోరులో దాదాపు ఆరేడుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. అలాగే రిటైరైన ఇన్‌చార్జి మాజీ వీసీ, ఓ నాన్‌టీచింగ్ అధికారి, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై నమోదైన మార్ఫింగ్ కేసు ఇప్పటికీ హైకోర్టులో నడుస్తుండడం గమనార్హం. ఈ తరుణంలో వర్సిటీకి వీసీగా డాక్టర్ వై.హరిబాబు ఈఏడాది ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టారు. దీంతో వర్గ పోరుకు చెక్ పడుతుందని తటస్థులు ఆశించారు. నెలలు గడుస్తున్నా.. ఆ దిశగా అడుగు పడలేదని వారు వాపోతున్నారు. వీసీ తరచూ సెలవులపై ఉంటూ పాలనా, పరిశోధనా, విస్తరణ రంగాలపై పెద్దగా పట్టు సాధించలేదని వర్సిటీ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ఈనెలలో ఇప్పటికే దాదాపు 10 రోజులకుపైగానే ఆయన వర్సిటీకి రాలేదని, స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించి వెళ్లిపోయారని సమాచారం. వీసీ అందుబాటులో లేక పలు కీలక ఫైల్స్ కదలడం లేదు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌ల జీతాలు కూడా ఈనెలలో ఇంకా విడుదల కాలేదని తెలిసింది. దీనికితోడు ఈనెల ఎనిమిదో తేదీన విడుదల చేసిన రిజిస్ట్రార్ పోస్టు నోటిఫికేషన్‌కు 30రోజులు గడువు విధించడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. వర్సిటీ చరిత్రలో ఏ నోటిఫికేషన్‌కు కూడా 20 రోజులకుపైగా గడువు విధించిన దాఖలాలు లేవన్న చర్చ నడుస్తోంది. అదీగాక ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌కు ఆచార్యుడిగా పనిచేసిన అనుభవం తక్కువగా ఉన్నా పలమనేరు లైవ్‌స్టాక్ రీసెర్చ్ స్టేషన్ (ఎల్ఆర్ఎస్) బాధ్యతలు కూడా అప్పగించడంపై సీనియర్లు గుర్రుగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఆచార్యుల బదిలీల్లోనూ పక్షపాతం చూపారని, రెండు సామాజిక వర్గాలనే టార్గెట్ చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ జీవోలు కూడా సరిగా అమలు కావడంలేదని, కనీస వేతనం రూ.12వేలకు బదులు వెటర్నరీ హాస్టల్ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేలను ఇవ్వడమే ఇందుకు ఉదహరిస్తున్నారు. టైంస్కేల్ ఉద్యోగులకు విషయంలోనూ ఇలాగే ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే.. వీసీ మంచితనం, మెతక వైఖరిని ఆసరాగా తీసుకుని ఓ కీలక అధికారి అన్నీతానై వ్యవహరిస్తున్నారని వర్సిటీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మొత్తానికి వర్సిటీ పాలన ఎప్పటికి గాడిలో పడుతుందో వేచి చూడాల్సిందే.



అందరూ మొక్కలు నాటండి

విద్యాపీఠం వీసీ మురళీధర శర్మ పిలుపు

తిరుపతి రూరల్: పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం వీసీ ఆచార్య మురళీధరశర్మ పిలుపునిచ్చారు. విద్యాపీఠంలోని జాతీయసేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రెండో విడత మొక్కలునాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కలను నాటిన వీసీ మాట్లాడుతూ.. సంస్కృత భాష, వారసత్వాలను కాపాడుకుంటూనే సామాజిక బాధ్యతగా పర్యావరణ సమతుల్యతకు నడుం బిగించాలని విద్యార్థులకు సూచించారు. విద్యాపీఠంలో పచ్చని చెట్ల నడుమ ఆహ్లాదకర వాతావరణం ఉందన్నారు. భవిష్యత్X తరాలకు ఇంకా మెరుగైన వాతావరణాన్ని అందించాలన్నారు. సాహిత్య సంస్కృతి డీన్ ఆచార్య సత్యనారాయణ, ఆచార్య వెంకటరావు, డాక్టర్ చందూలాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దక్షిణామూర్తిశర్మ, డాక్టర్ బలిచక్రవర్తి, డాక్టర్ సచ్చిదానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శేషపాన్పుపై వినాయకుడి రాజసం

మరో వారం రోజుల్లో వినాయక చవితి పండుగ మొదలు కానుంది. దీంతో నగర పరిధిలో వినాయక విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా కళాకారులు విభిన్న రూపాల్లో విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. నగర వేలూరు మార్గంలోని గంగాసాగరం, మండలంలోని తుమ్మింద, కొంగారెడ్డిపల్లెలో రంగురంగుల వినాయక విగ్రహాలు విక్రయాలకు కొలువుదీరాయి. గంగాసాగరంలో అడుగు నుంచి 16 అడుగుల వరకు విగ్రహాలను కళాకారులు సిద్ధం చేసి ఉంచుతున్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఏటా కొత్త రూపాల్లో గణేశుడిని ఇక్కడ తయారు చేయడం ప్రత్యేకత. 'దండాలయా.. ఉండ్రాలయ్యా.. దయుంచయ్యా దేవా...' అంటూ ఉత్సవ నిర్వాహకులు వీటిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వివిధ ఆకృతులతో ఆకట్టుకునేలా ఉన్న ఇక్కడి విగ్రహాలకు పొరుగురాష్ట్రాల్లోనూ డిమాండ్ ఉంది.

- చిత్తూరు కల్చరల్

జై జై గణేశా!

● చిత్తూరు వినాయక విగ్రహాలకు డిమాండ్

● కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల వ్యాపారులూ రాక



దేవతామూర్తులతో గణనాథుడు

చిత్తూరు విగ్రహాల ప్రత్యేకతే వేరు..

చిత్తూరు సమీపంలోని గంగాసాగరం, తుమ్మిందలో తయారయ్యే వినాయక విగ్రహాలకు ఎంతో డిమాండ్ ఉంది. వీటిని ప్రకృతిలో లభ్యమయ్యే ముడిపదార్థాలతో కాలుష్య రహితంగా కళాకారులు తయారు చేస్తున్నారు. ఇందులో ముగ్గురాయి పిండి, బంకమట్టి, జిగురు, వాటర్ పెయింట్స్ మాత్రమే వినియోగిస్తున్నారు. నీటిలో త్వరగా కలిసిపోయి, పర్యావరణహిత విగ్రహాల కొనుగోలుకు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో వ్యాపారులు తరలి వస్తున్నారు. ఆకారం, ఎత్తుకు అనుగుణంగా వీటిని రూ.50 నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు.



విక్రయాలకు సిద్ధంగా

పదేళ్ల నుంచి తయారు చేస్తున్నాం



గత పదేళ్లుగా నగరంలో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాం. వీటి తయారీలో రసాయనాలను వాడకుండా, ప్రకృతి సిద్ధంగా లభించే ముడిపదార్థాలనే వినియోగిస్తున్నాం. చవితికి ఆరునెలల ముందు నుంచే తయారీని ప్రారంభిస్తాం. ముందస్తు ఆర్డర్లకు అనుగుణంగా డిజైన్ల వారీగా విగ్రహాలను రూపొందిస్తున్నాం. మొత్తం 15 మంది కళాకారులు విగ్రహాల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాం.

- లోకనాథం, కళాకారుడు

శ్రీవారి సేవలో ప్రముఖులు



అడిషనల్ డీజీ వీఎస్‌కే కౌముది



శ్రీవారి ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు

తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు, అడిషనల్ డీజీ వీఎస్‌కే కౌముది, తెలంగాణ ప్రభుత్వ విప్ ఈశ్వర్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రాజనాలబండలో వైభవంగా ఉట్లోత్సవం

● భక్తులతో కిటకిటలాడిన ఆలయం

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ తిరునాళ్లలో భాగంగా ఆదివారం ఉట్లోత్సవం వైభవంగా జరిగింది. ఏటా శ్రావణమాసం ఆఖరు శని, ఆదివారాల్లో ప్రత్యేకంగా తిరుణాల నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో కొలింపల్లె నుంచి బోయకొండ గంగమ్మను రాజనాలబండకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మూడు ఉట్లమండపా ల్లో ఏర్పాటు చేసిన ఉట్లను కొండామర్రి, కాగతి, చౌడేపల్లె గ్రామస్తులు కొట్టారు. ఈ ఏడాది కొలింపల్లె గ్రామస్తులు పాకమాను ఎక్కి స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో రాజనాలబండ కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త కొలింపల్లె ప్రభాకర, ఛైర్మన్ శ్రీనివాసులు, మెట్ల నిర్మాణ దాత చిప్పిలి జగన్నాథరెడ్డి, శ్రీరాములు, శ్రీధర్‌బాబు, చలపతినాయుడు నేతృత్వం వహించారు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఉట్లు కొడుతున్న యువకులు - హాజరైన భక్తులు





పల్లకీసేవకు బయలుదేరిన స్వామి అమ్మవార్లుతో గురవయ్య నాయుడు, భ్రమరాంబ, తదితరులు

నేత్రపర్వంగా కుమారస్వామి పల్లకీసేవ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక వార్షికోత్సవాలలో భాగంగా చివరిరోజైన ఆదివారం పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. అమావాస్య కావడంతో స్కంధుడు తన తల్లిదండ్రులైన జ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కంధ మూర్తితో కలిసి భక్తులకు దర్శనమివ్వడం ఈ ఉత్సవ విశేషం. అయితే వర్షం కారణంగా స్వామి అమ్మవార్లను మూడు పల్లకీలలో ఈసారి పురవీధుల్లో ఊరేగించకుండా ముక్కంటి ఆలయం లోపలే ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీవల్లీ, దేవసేన సమేతుడైన కుమారస్వామి ముందు వెళుతుండగా, వెనుక అమ్మవారైన జ్ఞానాంబిక పల్లకీలో కొలువు దీరారు. జ్ఞానాంబికను భక్తులు వీక్షించేందుకు వీలుగా ముందు దర్పణాన్ని అమర్చారు. చివరగా సోమస్కంధమూర్తి, గంగాదేవితో కలిసి ఊరేగుతూ భక్తకోటికి నేత్రోత్సవాన్ని కలిగించారు. విశేషోత్సవం సందర్భంగా ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి, ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గురవయ్య నాయుడు, ఈవో భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.



రేపటినుంచి గంగజాతర

పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో ఉన్న నడివీధి గంగమ్మ జాతర ఈనెల 22నుంచి జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం గెరిగెతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి చెర్లోపల్లికి చెందిన వెంకట్రాయుల మందడి కుటుంబం ఆధ్వర్యంలో చాటుబండి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ భాస్కర్, కౌన్సిలర్ గోపి ఆచారి, గంగమ్మ జాతర కమిటీ ఛైర్మన్ గజపతి, సభ్యులు కుమార్, దొరస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల నిర్మాణంలో జాప్యం!

23 పంచాయతీల్లో ఊసే లేని వైనం ● ఐదింటిలో కేటాయించని స్థలం





పెరుమాళ్లపల్లె డంపింగ్ యార్డ్ - వస్తువులు వేయడానికి నిర్మించిన తొట్టెలు

వెదురుకుప్పం: డంపింగ్ యార్డు నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. లక్ష్య సాధనకు మండల స్థాయి అధికారుల కృషి కొరవడిందని చెప్పవచ్చు. వాస్తవానికి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఒక్కో డంపింగ్ యార్డును అక్టోబర్ 2తేదీ లోగా పూర్తి చేయాలి. ఆ నాటికల్లా చెత్త సేకరణ పనులు మొదలు పెట్టాలి. కానీ, మండలంలోని పెరుమాళ్లపల్లె, వెదురుకుప్పంలలో మాత్రమే డంపింగ్ యార్డు పనులు పూర్తి చేశారు. ఇందులో పెరుమాళ్లపల్లె డంపింగ్ యార్డు మాత్రమే వినియోగంలోకి వచ్చింది. వెదురుకుప్పం పనులు పూర్తయినా చెత్తసేకరణకు జరగడం లేదు. మిగతా 23 పంచాయతీల్లోకి డంపింగ్ యార్డు నిర్మాణాలు జరగాల్సి ఉంది. వీటిలో ఐదు పంచాయతీల్లో స్థల కేటాయింపు జరగలేదు.

● మండలంలోని అగ్గిచేనుపల్లె, ఆళ్లమడుగు, బొమ్మయ్యపల్లె, బ్రాహ్మణపల్లె,దిగువపల్లాలు, గంటావారిపల్లె, గొడుగుచింత, జక్కిదొన, కొమరగుంట, కురివికుప్పం, మాంబేడు, మారేపల్లె, మొండివెంగనపల్లె, నల్లవెంగనపల్లె, సంతబైలు, టీకేఎంపురం, తిప్పినాయుడుపల్లె, తిరుమలయ్యపల్లె పంచాయతీల్లో డంపింగ్ యార్డులకు స్థలాలు కేటాయించారు. నిర్మాణాలకు ఉపాధి పథకం నిధులు మంజూరయ్యాయి. అయితే స్థానిక పంచాయతీ అధికారులు చొరవ చూపకపోవడం వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. రెండు వేల జనాభాలోపు ఉన్న పంచాయతీలకు రూ.2.88లక్షలు, రెండు వేల నుంచి నాలుగు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.4.2లక్షలు, అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.7.2లక్షలు కేటాయించారు.

● మండలంలోని పచ్చికాపల్లం, దేవరగుడిపల్లె, ఇనాంకొత్తూరు, పాతగుంట, యనమలమంద పంచాయతీల డంపింగ్ యార్డులకు రెవెన్యూ స్థలం కేటాయించ లేదు.

పనులు పూర్తి చేయిస్తాం

వెదురుకుప్పం మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులకు స్థలం కేటాయించాం. వెదురుకుప్పం, పెరుమాళ్లపల్లె పంచాయతీల్లో డంపింగ్ యార్డు పనులు పూర్తి చేశాం. మిగతా పంచాయతీల్లో కూడా అక్టోబర్ 2వ తేదీలోగా డంపింగ్ యార్డులను అందుబాటులోకి తీసుకువస్తాం. అలాగే ఐదు పంచాయతీల్లో స్థలం కేటాయింపు జరగలేదు. ఆ ప్రాంతాల్లో పనులు పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- ఇందు, ఏపీవో, ఉపాధి హామీ పథకం

22న డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా

పుత్తూరు: ఈ నెల 22న పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సిటీలోని స్మార్ట్ మొబైల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తామని పీడీ రవిప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18-27 సంవత్సరాల వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులు/ ఫెయిలైన యువతులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రేషన్ , ఆధార్‌కార్డులతో హాజరు కావాలన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ.9 వేల జీతంతోపాటూ శ్రీసిటీ నుంచి పుత్తూరు వరకు బస్సు సౌకర్యం కల్పించబడుతుందన్నారు. వివరాల కోసం నెం.9000017644 ఫోన్ చేయవచ్చని తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతాం

నారాయణవనం: వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మారుస్తామని జేఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హరిబాబు చెప్పారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఎన్ ఐఓఎస్ పరీక్షలను నిర్వహించారు. సాక్షరభారత్ లో వయోజన విద్యను అభ్యసిస్తున్న వయోజనులు ఈ పరీక్షలను రాశారు. మండలంలో మొత్తం 1201 మందికి గాను 1150 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొండల చెరువులో జరిగిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సంతానలేమి వైద్య శిబిరానికి స్పందన



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్

పుత్తూరు: పుత్తూరు లయన్స్ క్లబ్, అంకుర ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పుత్తూరు పద్మావతి ఆస్పత్రిలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సంతానం కలగని పలువురు మహిళలను పరీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ పెళ్లయిన సంవత్సరంలోగా పిల్లలు పుట్టకపోతే వెంటనే ప్రత్యేక వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లత, క్లబ్ డిస్టిక్ గవర్నర్ నరసింహులు, కార్యదర్శి వెంకటముని, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మునిరత్నం, గోపి పాల్గొన్నారు.

సినిమా గైడ్

పుత్తూరు

శాంతి	జయ జానకి నాయక
విష్ణుమహల్	ఫిదా
శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వెదురుకుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ అందేలా చూస్తామని జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి హరికృష్ణ చెప్పారు. ఆదివారం వెదురుకుప్పంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.నాగరాజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో హరికృష్ణ మాట్లాడుతూ... పదవులు దక్కించుకున్న వారు పార్టీ బలోపేతానికి మరింత బాధ్యతగా పని చేయడమేకాకుండా ఆదేశాలను పాటించాలన్నారు. ఒకటో తేదీనుంచి జరగనున్న ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మారేపల్లె పంచాయతీ టీడీపీ నాయకులు ఎం.సుధాకర్‌యాదవ్, కె.మురళీమోహన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పి.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు బి.కృష్ణారెడ్డి, కె.మురగయ్య తదితరులు టీడీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశులు, పచ్చికాపల్లం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బి.ఈశ్వరరెడ్డి, ఎం.రామయ్య, నాగేశ్వరరాజు, శ్రీనివాసులు, తులసీరాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరికృష్ణ తదితరులు



బోరులో రంగునీటిని చూపుతున్న నాయకులు

మౌలిక వసతులు కల్పించండి

నారాయణవనం: మండలంలోని పాలమంగళం దక్షిణపు కండ్రిగ గ్రామంలో మౌలిక వసతులు కల్పించండంటూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా గ్రామంలో రాళ్లు తేలిన రోడ్డులో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని సిమెంటు రోడ్డు నిర్మించాలని డిమాండు చేశారు. అదే విధంగా తాగునీటి బోరులో రంగునీరు వస్తోందని చెప్పారు. గ్రామ సమస్యలపై అధికారులు, రాజకీయ నాయకులు కాని పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మునిశంకర్, సుశీల, దుర్గ, కామాక్షి, ధనలక్ష్మి, చాముండేశ్వరి, మునికాంత పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులు దూరం

కార్వేటినగరం: ఆరోగ్య సూత్రాలను సక్రమంగా పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని కార్వేటినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి చెప్పారు. ఆదివారం గుండుగాని దళితవాడలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరంలో జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో మరియకుమారి, పర్యవేక్షకులు సుబ్రహ్మణ్యం, హేమంత్, హెచ్‌ఏలు గురు, ఇనయ్‌తుల్లా పాల్గొన్నారు.



గ్రామంలో జరిగిన వైద్య శిబిరం

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కార్వేటినగరం: ఈ నెల 21 వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజారావు చెప్పారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని రావాలని చెప్పారు.

24న వడమాలపేటలో...

కార్పొరేషన్ రుణాల పంపిణీ కోసం ఈ నెల 24న గురువారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీలక్ష్మి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలు పొందడానికి లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె కోరారు.

రేపు రైతుల సమావేశం

కార్వేటినగరం: ఈ నెల 22 వ తేదీన వెదురుకుప్పం వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతుల సమావేశం జరుగుతుందని కార్వేటినగరం బ్లాక్ ఆత్మ చెర్మన్ నాగేశ్వరరాజు చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాస్థాయి అధికారులు హాజరవుతున్నారని చెప్పారు. దీన్ని రైతులు విజయవంతం చేయాలన్నారు.

స్పెషల్ బ్రాంచి డీఎస్పీకి సన్మానం



పుత్తూరు: జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రామ్‌కుమార్‌ను పోలీసులు ఘనంగా సన్మానించారు. లాస్ ఏంజెల్స్‌లో జరిగిన పోలీసు టెన్నిస్ డబుల్స్ విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా పుత్తూరులో ఆయనకు పోలీసులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఎస్‌ఐ రవి, హెడ్‌కానిస్టేబుల్ వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యువో కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్: ఇంటర్ పూర్తి చేసి, 17-30 ఏళ్లలోపున్న మహిళా అభ్యర్థులు ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని నగర ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని శిక్షణకేంద్ర ప్రిన్సిపాల్ కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల మినహాయింపు ఉంటుందన్నారు. రెండే ళ్ల డిప్లమా కోర్సుకు సెప్టెంబరు 4వతేదీలోగా దరఖాస్తులు పంపాల న్నారు. వీటిని ఎంపీహెచ్‌డబ్ల్యు ట్రైనింగ్ సెంటర్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అందజేయాలన్నారు. ఓసీలు సీఎఫ్‌డబ్ల్యూ, అమరావతి, హైదరాబాద్ పేరిట తీసిన రూ.50 డీడీని జతపరచాలన్నారు. ఇతర వివరాలకు నెం.9966466543ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
మదనపల్లె జోన్
సోమవారం 21, ఆగస్టు 2017

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ

గుర్రంకొండ: సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ ఆలయానికి సంతానం లేని వారు వచ్చివరపడితే సంతానం కలుగుతుందని భక్తుల అపారనమ్మకం. దీంతో మన జిల్లా నుంచే కాక పక్క జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. అమ్మవారి వద్ద సంతానం కోసం వరపడడానికి అధికంగా భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

నేడు శివాలాయల్లో ప్రత్యేక పూజలు

మదనపల్లెటౌన్: సోమవారం పట్టణంలోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీయోగిభోగేశ్వరస్వామి ఆలయ అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, సోమేశ్వరస్వామి ఆలయ అర్చకులు పణికుమార్ శర్మలు పేర్కొన్నారు. సోమవారం సూర్యగ్రహణం, అమావస్యను పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం మహా లింగార్చన, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

మెట్రాలజీ అధికారుల తనిఖీలు

- రూ.20వేల జరిమానా



మాంసం దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

మదనపల్లె రూరల్: మదనపల్లె పట్టణంలోని కొన్ని దుకాణాల్లో తూనికలు, కొలతలశాఖ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాల్లో కొలతలు, తూనికలు తక్కువగా వేస్తున్నారని, అదే విధంగా ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువ ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారని మదనపల్లె తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్‌కు శనివారం కొందరు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కొన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఓ గిఫ్ట్ దుకాణంలో ఎమ్మార్పీ ధరల కన్నా వస్తువులు ఎక్కువగా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. దీంతో ఆ దుకాణం యజమానికి రూ.10వేల జరిమాన విధించారు. దీంతో పాటు నాలుగు మటన్, చికెన్ దుకాణాల్లో మాసం తూకాల్లో తక్కువగా వుండటం, ఎలక్ట్రానిక్ తూకాల్లో వ్యత్యాసం రావడంతో వారికి రూ.2వేలు చొప్పున జరిమాన విధించారు. మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ దుకాణాల్లో కొలతలు, తూనికలు తక్కువగా వేయడం, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటే తన మొబైల్ నెంబర్ 8919509882కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

పక్కదారి పట్టిన హైస్కూల్ నిధులు

నాలుగేళ్లయినా జడ్పీకి జమకాని వైనం

గుర్రంకొండ: జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టాయి.నాలుగేళ్ల గడుస్తున్నా నేటికీ జిల్లా పరిషత్ కు జమ కాలేదు. దీంతో ఆ సొమ్ము ఉందా లేక స్వాహా చేశారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గుర్రంకొండ జడ్పీహైస్కూల్‌లో 50ఏళ్ల పైబడిన పాత భవనం ఉండేది. ఈ భవనంలో 8తరగతి గదులు ఉండేవి. అప్పట్లో ఈ భవనాన్ని రాతిగోడతో నిర్మించి పైన సిమెంటు రేకులను ఏర్పాటు చేశారు. అయితే పాఠశాలకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడంతో 20తరగతి గదులను అధునాతనంగా నిర్మించారు. పాత భవనాన్ని తొలగించాలని స్కూల్ కమిటీ, హెచ్ ఎం తీర్మానించారు. దీంతో 2013లో పాత భవనాన్ని పడగొట్టారు. ఇందులోని ఇనుము, రాళ్ళ, కొయ్యలు, రేకులకు వేలం పాటలు నిర్వహించారు. ఇనుము ద్వారా రూ.67వేలు, రాళ్లు రూ.30వేలు, కొయ్యలు రూ.20వేలు, రేకులు రూ.21వేలు మొత్తం రూ.1.38లక్షలు వచ్చింది. ఈ సొమ్మును మరుసటి రోజే జడ్పీకి జమ చేస్తామని హెచ్ ఎం సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు.



గుర్రంకొండలోని జడ్పీహైస్కూల్

అయితే నాలుగేళ్ల గడుస్తున్నా నేటికీ ఒక్కరూపాయి కూడా జిల్లా పరిషత్ కు జమచేయలేదు. దీంతో వేలం ద్వారా వచ్చిన సొమ్ము ఉందా లేక స్వాహా చేశారా అన్నది తెలియడం లేదు. ఈ విషయమై హెచ్ ఎం సుబ్రహ్మణ్యం రెడ్డిని వివరణ కోరగా ఇనుమును కొనుగోలు చేసిన వ్యక్తి రూ.17వేలు ఇంకా చెల్లించాలని ఆ సొమ్ము రాగానే మొత్తం జడ్పీకి జమ చేస్తామన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని నిరుద్యోగులకు నేడు కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇండియన్ బ్యాంకు పరిధిలోని గ్రామాలకు ఉదయం 10గంటలకు, కందుకూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలోని దరఖాస్తుదారులకు మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దరఖాస్తు దారులందరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి.

హాస్టల్ వార్డెన్‌ను మార్చాలని విద్యార్థుల ధర్నా

మదనపల్లె రూరల్: ప్రభుత్వ కళాశాలల బీసీ విద్యార్థినుల హాస్టల్ వార్డెన్ ను మార్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విద్యార్థినులు సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ తమ హాస్టల్‌లో భోజనాలు సక్రమంగా వడ్డించడం లేదని, మెస్‌బిల్లులు కూడా చెల్లించడం లేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్కడి వర్కర్లు తమను దుర్భాషలాడుతున్నారన్నారు. హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలని వార్డెన్ రమాదేవిని కోరితే ఆమె నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తోందన్నారు. అంతేకాక వార్డెన్ సమయానికి అందుబాటులో వుండటం లేదని, బయటి వ్యక్తులు హాస్టల్ వద్దకు వచ్చి,వెళుతున్నారన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ విచారించి తమకు న్యాయం చేయాలని విద్యార్థినులు కోరారు. వీరికి మద్దతుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జె.విశ్వనాథ్, డివిజన్ నాయకులు సుబ్బరాయుడు, పవన్ కుమార్, సాంబశివ తదితరులు మద్దతు తెలిపారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

23 నుంచి ములకలచెరువులో...

ములకలచెరువు: వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు చేసుకున్న యువతీ, యువకులకు ఈనెల 23, 24వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజగోపాల్ తెలిపారు. 23న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న, 24న బీసీ, కాపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

ఆటోడ్రైవర్లకు లైసెన్స్‌లు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్: పట్టణంలో ఆటోలు నడిపే డ్రైవర్లకు లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలంటూ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో నిబంధనలు, రోడ్డుప్రమాదాలపై ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ వాహనానికి ఆర్సీ, డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు కూడా నిబంధనలు పాటించే వాహనాలు నడపాలన్నారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయకూడదని, అలా చేస్తే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కేటాయించిన ఆయా స్టాండ్లలోనే పార్కింగ్ చేయాలన్నారు. లైసెన్స్‌లు లేని డ్రైవర్లు ఆర్టీవో అధికారులను సంప్రదించి లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. దీంతోపాటు ఆటోలకు పోలీస్ నంబర్లు తప్పక ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

శంకరయ్య ఆరాధనోత్సవాలు ప్రారంభం



రామకోటి భజనలో పాల్గొన్న బృందం

బి.కొత్తకోట: మండలంలోని బీరంగి పంచాయతీ శంకరాపురంలో వెలసిన శంకరయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం కలశస్థాపన, అభిషేకం, గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 15 భజన బృందాలతో కూడిన శంకరయ్యస్వామి అఖండరామకోటి కార్యక్రమాన్ని 72గంటల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

హౌసింగ్ డీఈ బదిలీ

బి.కొత్తకోట: స్థానిక హౌసింగ్ డీఈ బాలాజి చిత్తూరుకు బదిలీ అయ్యారు. శాఖా పరమైన బదిలీలలో భాగంగా ఆయన్ను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కేంద్రంలో ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయానికి ఆయన బదిలీ కావడంతో ఇక్కడ రిలీవ్ అయ్యారు.

మట్టి వినాయకులనే పూజించండి

వాల్మీకిపురం: మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలని జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ప్రభుచరణ్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన వినాయక ప్రతిమల వల్ల జలకాలుష్యమై పర్యావరణం దెబ్బతింటుందన్నారు.ఇంటింటా కరపత్రాలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో శ్రీకాంత్, ఫిరోస్, శ్యామ్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు అధికారులు హాజరు కావాలి

పెద్దమండ్యం: గ్రీవెన్స్‌డేకు అధికారులందరూ హాజరు కావాలని ఎంపీడీవో యుగంధర్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలు సర్పంచ్ లు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సాక్షరభారతి కేంద్రాల్లో ప్రశాంతంగా దూరవిద్య పరీక్ష

ములకలచెరువు: మండలంలోని సాక్షరభారతి కేంద్రాల్లో ఆదివారం జరిగిన దూర విద్య పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలం మొత్తం 12కేంద్రాల్లో 305మంది సాక్షరభారతి అక్షరాస్యులు పరీక్ష రాశారు. కదిరినాథునికోట, ములకలచెరువు, వేపూరికోట, చౌడసముద్రం, బురకాయలకోట, మద్దినాయనిపల్లె, దేవళచెరువు, గూడుపల్లె, సోంపల్లె, నాయనిచెరువుపల్లె, పెద్దపాళ్యాలలో జరిగిన పరీక్షలను సాక్షరభారతి సూపర్‌వైజర్ వీరాచారి తనిఖీ చేశారు. ఆయన వెంట సాక్షరభారతి మండల కోఆర్డినేటర్ రవీంద్ర, గ్రామకోఆర్డినేటర్లు ఉన్నారు.

పీటీఎంలో...

పెద్దతిప్పసముద్రం మండలంలో పరీక్షలకు 324మంది వయోజనులు హాజరయ్యారు. ఎంపీడీవో వేణయ్య, సూపర్‌వైజర్ మీరావారి, ఎంసీవో ఆంజనేయులు పరీక్షలను పర్యవేక్షించారు.

పోలీసులను సస్పెండ్ చేయాలి

మదనపల్లె అర్బన్: ఏ నేరమూ చేయకుండానే పోలీస్‌స్టేషన్ కు రప్పించి శిరీషా, గీతాంజలిని కొట్టి హింసించిన వన్ టౌన్ ఎస్ఐ, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్)నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలను స్టేషన్ కు రప్పించి కొట్టి హింసించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఏ తప్పు చేయని అక్కాచెల్లెళ్లపై ఎస్ఐ సుకుమార్, మహిళా కానిస్టేబుళ్లు దాడికి పాల్పడటం సబబు కాదన్నారు. ఉన్నతాధికారులు వీరిపై చర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు, సీఐటీయూ, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

వాల్మీకిపురం: వాల్మీకిపురానికి చెందిన కళాకారుడు ప్రభుకిరణ్‌ను శనివారం చిత్తూరు జడ్పీ మీటింగ్ హాల్‌లో జడ్పీచైర్‌పర్సన్ గీర్వాణి, మేయర్ హేమలతలు శాలువతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. వరసిద్ధి కళాక్షేత్రం 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రంగస్థల కళ కళాకారుల పోటీల్లో ప్రభుకిరణ్ మంచి ప్రతిభ కనబరిచి ప్రతిభా పురస్కారమందుకున్నారు. ఈకార్యక్రమంలో వరసిద్ధి కళాక్షేత్రం అధ్యక్షుడు మొగిలయశెట్టి, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుకిరణ్‌ను సన్మానిస్తున్న జడ్పీచైర్‌పర్సన్ గీర్వాణి, మేయర్ హేమలత

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కలను నాటి, వాటిని సంరక్షించడానికి అందరూ కృషి చేయాలని అమ్మాభగవాన్ సేవా ట్రస్ట్ సభ్యుడు వెంకటశ్రీనివాస్ దాసాజీ పిలుపునిచ్చారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరు గ్రామంలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో వీధుల పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్తీక్, వెంకటరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న దాసాజీ





నీర్వాకోట వరవ కాలువలో ప్రవహిస్తున్న వర్షపు నీరు - కాంపాళెం పోలాల్లో పారుతున్న నీరు - తడిసిన వేరుశనగను ఆరబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగలో భారీ వర్షం

పారుతున్న వరవ కాలువలు • పొలాల్లో ప్రవహిస్తున్న నీరు • తడిసిన వేరుశనగ పంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం రాత్రి 70 మి.మీ. భారీ వర్షం కురిసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో ఇంతటి వర్షపాతం నమోదు కాలేదని రైతులు చెబుతున్నారు. ఈ వర్షంతో చాలా చెరువుల్లోకి నీరు చేరాయి. అనేక గ్రామాల్లోని వరవ కాలువల్లో నీరు ప్రవహిస్తున్నాయి. మండలంలోని కనమనంబేడు, నీర్వాకోట, కంచనపుత్తూరు, కుక్కంబాకం, బుచ్చినాయుడుకండ్రిగ, వెస్ట్‌వరత్తూరు తదితర గ్రామాలలో వేసిన వేరుశనగ పంట వానకు తడిచి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. ఆరబెట్టిన కాయలు తడిసిపోగా పెరికిన వేరుశనగ కూడా దెబ్బ తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వరదయ్యపాళెంలో మోస్తరు వర్షం

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా మండలంలో అక్కడక్కడ చిన్నపాటి వర్షాలు పడుతుండడంతో సాగుకు అనుకూల వాతావరణం నెలకుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి నేలవాలిన సజ్జ పంట




వర్షానికి నేలవాలిన సజ్జ పంట - వానకు చిత్తడిగా మారిన రోడ్డు

కేవీబీపురం: మండలంలో శనివారం కురిసిన వర్షానికి చేతికొచ్చిన సజ్జ పంట నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో ఖరీఫ్‌లో నాటిన సజ్జ కోత దశకు వచ్చింది. ఈ సమయంలో కురిసిన వర్షానికి ఆ పంట కాస్తా నేలవాలిందని రైతులు వాపోతున్నారు. సుమారు 4వేల హెక్టార్ల వరకు సజ్జ పంటను రైతులు వేశారు. ఇందులో సగానికి సగం పంట నాశనమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అసలే అంతంత మాత్రంగా ఉన్న మండలంలోని గ్రామీణ వీధులు వర్షానికి చిత్తడిగా మారాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తొట్టంబేడు: మండలంలోని పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యంను ఆదివారం చిత్తూరులోని జడ్పీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గీర్వాణి ఘనంగా సన్మానించారు. బాల సుబ్రహ్మణ్యం రాసిన 'బాలకిరణాలు' అనే కవితా సంపుటికి సంబంధించి శ్రీవరసిద్ధి కళాక్షేత్రం వారు 'సాహితీ శిరోమణి' అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ మిమిక్రీ,సాహిత్యం వంటి కళల్లో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మేయర్ హేమలత, సంస్థ అధ్యక్షుడు మొగిలయ్యశెట్టి, మునస్వామి,తదితరులు పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

కేవీబీపురం: మండలంలోని కళత్తూరు గ్రామంలో ఉన్న షిర్డీసాయి మందిరం 5వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సాయి గణేష్ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మందిరంలో ఉదయం 5 గంటలకు పాలాభిషేకం, కాకడ హారతి, రాత్రి 7 గంటలకు బాబా చిత్రపటం ఊరేగింపు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

బండారుపల్లెలో లోపించిన పారిశుధ్యం



బురదమయంగా ఉన్న బండారుపల్లెలోని వీధి

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో సరైన డ్రైనేజీ వసతి లేకపోవడంతో మురుగునీరు వీధుల్లో నిల్వచేరి దుర్వాసన వెదజల్లుతోంది.మురుగు నీరు ఎక్కువ రోజులు నిల్వ చేరడంతో దోమలు వృద్ధి చెంది, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. వీధి పొడవునా మురుగునీరు నిల్వచేరడంతో ఆ బురద వీధిలో నడవలేక పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రానికి వెళ్ళే చిన్నారులు, వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో మురుగునీటి కాలువలు ఏర్పాటుచేసి, పారిశుధ్య మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సినిమాగైడ్

శ్రీకాళహస్తి

సాయిరాం : లై
బలరాం : గౌతమ్‌నందా
శ్రీనివాస : ఫిదా
విజయలక్ష్మి : నేనే రాజు నేనే మంత్రి
ఆర్.ఆర్ : ధర్టీగేమ్
రామచంద్ర : జయ జానకీ నాయక

కర్మాగారాల వ్యర్థపు నీటిని అరికట్టి

భావితరాలను కాపాడండి



వ్యర్థపు నీటిని పరిశీలిస్తున్న బాలాజీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏర్పేడు: కర్మాగారాల నుంచి వచ్చే వ్యర్థపునీటిని అరికట్టి భావి తరాలను కాపాడాలని బీసీ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు వడ్లతాంగల్ బాలాజీప్రసాద రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఏర్పేడు మండల బీసీ సంఘం నాయకులతో కలిసి మండంలోని కర్మాగారాల వ్యర్థపు నీరు ప్రవహిస్తున్న చెన్నంపల్లె, పెనుమల్లం, గుడిమల్లం, రావిళ్లవారికండ్రిగ, కొత్తకాలువ తదితర గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేణిగుంట మండలం గాజులమండ్యం సమీపంలోని పలు పరిశ్రమలు వ్యర్థపదార్థాలు, వ్యర్థపు నీరును గ్రామాలకు ఆనుకుని ఉన్న స్వర్ణముఖి నదిలోకి వదులుతున్నారన్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు, పశువులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి బోర్లలోకి సైతం కర్మాకాగారాల వ్యర్థపు నీరు చేరుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి కర్మాగారాల్లోని వ్యర్థపు నీరు స్వర్ణముఖి నదిలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పరిశ్రమల ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు కందప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి మునికృష్ణా రెడ్డి, ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

వరదయ్యపాళెం: మండలంలోని తొండూరు సొసైటీకి చెందిన జయరామరెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు శనివారం రాత్రి పిడుగుపాటుతో మృతి చెందింది. ఎద్దు మృతి చెందడంతో తన జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.



భరించలేని దుర్వాసన... పట్టించుకోని అధికారులు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి నుంచి మండల కేంద్రమైన తొట్టంబేడుకు వెళ్లే రోడ్డు మార్గంలో వ్యర్థాలు పేరుకుపోవడంతో భరించరాని దుర్వాసన వెలువడుతోందని స్థానికులు వాపోతున్నారు. శ్రీకాళహస్తి పట్టణం నుంచి తొట్టంబేడు వెళ్లే మార్గంలో గతంలో శ్రీకాళహస్తి పురపాలక సంఘం వారు చెత్తను డంప్ చేసేవారు. ప్రస్తుతం ఈ డంప్‌ను నెల్లిమానుకండ్రిగ సమీపానికి మార్చారు. అయితే ప్రస్తుతం శ్రీకాళహస్తి పట్టణంలోని కోళ్ల వ్యాపారులు వాటి వ్యర్థాలను తొట్టంబేడుకు వెళ్లే మార్గంలోనే పడేస్తున్నారు. దీంతో కోళ్ళ వ్యర్థాలు కుళ్ళి, వానకు తడిచి భరించరాని దుర్వాసన వెలువడుతోంది. ముక్కులు మూసుకోకుండా ఈ మార్గంలో ప్రయాణించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు తక్షణం స్పందించి వ్యర్థాలను తొలగించి, కోళ్ల వ్యాపారులు ఈ మార్గంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తొట్టంబేడు మార్గంలో ముక్కు మూసుకుని వెళుతున్న విద్యార్థినులు

ప్రతిభా పురస్కార ఎంపిక పరీక్షకు ఉచిత శిక్షణ

మదనపల్లెటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రతిభా పురస్కార (ఎన్ఎంఎంఎస్) ఎంపికపరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బాపూజీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పురం వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థికంగా సహకారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ప్రతి ఏటా రూ.6వేలు విద్యార్థుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం బాపూజీ మున్సిపల్ స్కూల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

అవినీతిని ప్రశ్నిస్తే బీసీలపై కేసులా

మదనపల్లెటౌన్: బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే అలా ప్రశ్నించిన బీసీ నాయకులపై అ క్రమకేసులు బనాయిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, బీజేపీ మైనార్టీ మోర్చా విభాగం జిల్లా నాయకులు అయూబ్‌ఖాన్ విమర్శించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోయకొండ ఆలయ అభివృద్ధికి గత కొన్నేళ్లుగా ఎంతో కృషి చేసిన వ్యక్తి చైర్మన్ పదవిని ఆశించడం ఇష్టంలేని అధికార పార్టీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని బీసీలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయంలో జరుగుతున్న అవీనితీ, అక్రమాలను ప్రశ్నించడం, ఆలయ భూములు పరిరక్షించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన గంపల గంగరాజుపై రాజకీయ వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. చౌడేపల్లి మండలం కాగితి గ్రామంలో గంపల గంగరాజు బంధువు నడుపుతున్న చౌకదుకాణంపై దాడి చేయించి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. గంపల గంగరాజు, అతని భార్య ఇద్దరు టీడీపీ కుటుంబ సభ్యులే అయినా కేవలం బోయకొండ ఆలయ చైర్మన్ పదవి ఆశిస్తున్నారన్న కారణంగా ఆ పార్టీ నేతలే వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ నాయకుడు దొరస్వామినాయుడు, వెంకటరమణగౌడ్, బొగ్గిటి క్రిష్ణమూర్తి, టి. క్రిష్ణమూర్తి, గంపల గంగరాజు, మునిరాజ, నరసింహులు, లక్ష్మన్న, వేణు, శరత్; మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

మదనపల్లె

ఏఎస్ఆర్	ఆనందో బ్రహ్మ
ఎంఎస్ఆర్	జయ జానకి నాయక
సిద్ధార్థ	ప్రతిక్షణం
మినీసిద్ధార్థ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	నిన్ను కోరి
సాయిచిత్ర	నేనే రాజు నేనే మంత్రి
రవి	జయ జానకి నాయక
సునిల్	ఫిదా

టూవీలర్ బోల్తా..
ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్: టూవీలర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన రత్నయ్య(40), కురబలకోట మండలం సర్కార్‌తోపుకు చెందిన బాషా(39) ఆదివారం పనులు చేసేందుకు ద్విచక్రవాహనంలో సర్కార్‌తోపు నుంచి కురబలకోటకు బయలు దేరారు. రైల్వేస్టేషన్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కార్మిక సంక్షేమం ఎన్ఎంయూతోనే సాధ్యం

సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పారెడ్డి, ఎన్ ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య



ఎన్ఎంయూ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి



కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పారెడ్డి, ఎన్ ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తదితరులు

మదనపల్లెటౌన్: ఆర్టీసీలో కార్మిక సంక్షేమానికి నేషనల్ మజ్దూర్ యూనియన్ పాటుపడుతోందని ఎన్ ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య, ఎమ్మెల్యే తిప్పారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లెలో ఎన్ ఎంయూ సిల్వర్‌జూబ్లీ వేడుకలను వన్ డిపోలో ఘనంగా నిర్వహించారు. మొదట యూనియన్ స్థాపకులు రామ్మోహన్ రావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే తిప్పారెడ్డి మాట్లాడుతూ తాను వైద్య వృత్తిలో మొదటగా ఎన్ఎంయూ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, ఎన్ఎంయూతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్మికుల సంక్షేమం పట్ల అలుపెరగని పోరాటం చేస్తూ కార్మికులకు అండగా నిలుస్తున్నా యూనియన్ ఎన్ఎంయూ అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎన్ఎంయూ వెంటే కార్మికులు నడుస్తారన్నారు. ప్రభుత్వం ప్రైవేటు రవాణ రంగాన్ని ప్రోత్సహిస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఇందుకు నిదర్శనమే ప్రభుత్వ రంగ సంస్థ అయినా ఆర్టీసీకి 12శాతం పన్ను, ప్రైవేటు రవాణ సంస్థలకు 7 శాతం పన్ను విధించడం నిదర్శనమన్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక సంస్థ ఎన్ఎంయూ అన్నారు.అక్రమ రవాణను అరికట్టి, సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించి బలోపేతం చేసేందుకు ఎన్ఎంయూ కృషి చేస్తోందన్నారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ నుంచి ఎన్ఎంయూలో చేరిన సీతారామయ్య, సూరిబాబు, జగన్నా థం, శివరాంలు పూలమాల వేసి ఆహ్వానించారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



రాజీవ్‌గాంధీకి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాళహస్తి: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు అన్నారు. రాజీవ్‌గాంధీ 73వ జయంతి వేడుకలు ఆదివారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తెయ్య నాయుడు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో పేదరిక నిర్మూలన కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం ఆయన కృషి చేశారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానీబాషా, షాబుద్దీన్X , బీవీ శేఖర్, శివకుమార్, వెంకటముని, నాగరాజునాయుడు, చెంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టణంలోని కాసాగార్డెన్X కూడలిలో జాన్X బెన్నీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో సుబ్రహ్మణ్యం, మణి, రామయ్య, మధు, ప్రేమ్‌కుమార్, మస్తాన్X , తదితరులు పాల్గొన్నారు.

'చారిటీషోతో ఎలాంటి సంబంధం లేదు'



విలేకరులతో మాట్లాడుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి అర్బన్: అమ్మా ఆశ్రమం, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థల పేరు మీద ఆదివారం వే ఫౌండేషన్X నిర్వహించిన చారిటీ షోతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆయా నిర్వాహకులు పేర్కొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ కార్యాలయంలో నిర్వాహకుడు మునీర్‌బాషా, అమ్మా ఆశ్రమ నిర్వాహకురాలు భూలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ... తమ సంస్థలు ఎవరి సహాయం కోరలేదన్నారు. తమ ప్రమేయం లేకుండానే జబర్దస్త్ కళాకారులతో షో నిర్వహించబోతున్నట్లు కొందరు మైకుల ద్వారా తమ సంస్థ పేరుతో ప్రచారం చేయడం బాధాకరమన్నారు. నిస్వార్థంగా సేవ చేస్తున్న తమ పేరుతో రూ.100 నుంచి రూ.500 వరకు టికెట్ల ధరలు నిర్ణయించి వసూలు చేయడాన్ని ఖడిస్తున్నట్టు వారు తెలిపారు.

నంద్యాల ఎన్నికల ప్రచారంలో బీఎన్‌కండ్రిగ టీడీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి చెందిన రాష్ట్ర మేదర కార్పొరేషన్X చైర్మన్X సుందరయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ ఆదివారం నంద్యాల పట్టంలోని ఆటోనగర్, వీసీనగర్‌లలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేదర కార్పొరేషన్ కమిటీ డైరెక్టర్లు సుబ్బారావు, పెరుమాళ్లు, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాల ఎన్నికల ప్రచారంలో సుందరయ్య తదితరులు

నీరు పోయే దారేదీ...?



పాతబస్టాండు కూడలి వద్ద నిల్వ చేరిన నీరు

శ్రీకాళహస్తి అర్బన్: శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున ఉన్న పాత బస్టాండు కూడలి వద్ద నీరు పోయే దారి లేక వర్షం పడితే నీరు నిల్వ చేరి అధ్వానంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండు కూడలిలో గతంలో నీరు నిలిచే సమస్య ఉండేది కాదు. అయితే ఈ కూడలి వద్ద ఓ వైపు పురపాలక సంఘం దుకాణ సముదాయం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో అధికారులు నేలమట్టం చేశారు. దాంతో ఆ వైపు డ్రైనేజీ కాలువ మట్టితో పూడిపోయింది. కాగా,మరో వైపు పురపాలకసంఘానికే చెందిన ఖాళీ స్థలం ఉండేది. ఇటీవల ఆ స్థలంలో దుకాణ సముదాయం నిర్మించారు. అయితే డ్రైనేజీ వసతి ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా నీరు పోయే మార్గాలు మూసుకుపోయాయి. ఐదు రోడ్ల కూడలి అయిన ఈ ప్రాంతంలో నిత్యం వాహనదారులు, బాటసారులు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు కూడా ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డులో వర్షం పడితే నీరు బయటకు వెళ్ళే మార్గంలేక రోజుల తరబడి అక్కడే నిలిచిపోతున్నాయి. దీంతో వాహన చోదకులతో పాటు మురుగునీరు మీద పడుతుండడంతో బాటసారులు సైతం అవస్థలు పడుతున్నారు. సైకిలిస్టులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతలను గుర్తించలేక తరచూ అదుపుతప్పి మురికినీటిలో పడిలేస్తున్నారు.

అధికారులు తక్షణం స్పందించి రోడ్డుపై నీరు నిల్వచేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ చెత్త సహవాసం



దేవరమిట్టలో పేరుకుపోయిన చెత్త

శ్రీకాళహస్తి అర్బన్: శ్రీకాళహస్తి పట్టణంలోని దేవరమిట్ట ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. సంబంధిత సిబ్బంది చెత్త తొలగింపు సక్రమంగా చేపట్టకపోవడంతో కూడళ్లు వ్యర్థాలతో నిండిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎన్టీఆర్ నగర్ దేవరమిట్ట కూడలిలో రోజుల తరబడి చెత్తకుప్పలు నిల్వ చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఎన్టీఆర్ నగర్, దేవరమిట్ట, వీరముష్టిపాళెం, మంచినీళ్లగుంట, తెలుగుగంగకాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రెండు ప్రైవేటు పాఠశాలలు, పురుషుల డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల సైతం ఈ మార్గంలోనే ఉన్నాయి. ఇంతటి రద్దీ ప్రాంతాల్లో సైతం చెత్తకుప్పలను తొలగించక పోవడం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించి పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్టాండు... కంపు కంపు



అపరిశుభ్రంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం

శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో తీవ్ర దుర్గంధం వెలువడుతోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు లోపలకు, వెలుపలకు వెళ్ళే రెండు మార్గాల్లోనూ ఎక్కడపడితే అక్కడ ప్రయాణీకులు మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెలువడుతోంది. కాగా, బస్టాండులోని చెన్నై, బెంగళూరు, సూళ్లూరుపేట బస్సులు ఆగే చోటకు పక్కనే మూత్రశాల, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఇవీ మరీ అధ్వానంగా మారాయి. మూత్రశాలకు కనీసం గదులు కూడా ఏర్పాటు చేయలేదు. బస్సుల ఆగే ప్రాంతానికి పక్కనే మూత్రశాల ఏర్పాటు చేయడంతో బహిరంగంగానే మూత్రవిసర్జన చేస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ పారిశుధ్య లోపించడంతో ప్రయాణీకులు బస్టాండులో బసులో ఉన్నంతసేపూ ఆ కంపు భరించలేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ప్రయాణికులు అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ప్రాంగణంలో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రశాంతంగా సాక్షర భారత్X పరీక్ష

కేవీబీపురం: మండలంలో ఆదివారం నిర్వహించిన సాక్షర భారత్X పరీక్షకు 177 మంది వయోజనులు హాజరైనట్లు ఎంసీవో అంకయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 గ్రామ పంచాయతీలకు గాను 177 మంది ఈ పరీక్షలు రాశారన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆపై చదువుకు అనుమతి లభిస్తుందని తెలిపారు.



రాయపేడులో సాక్షరభారత్X పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంసీవో

ముక్కంటి ఆర్జిత సేవల సమాచారం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఆర్జిత సేవలు, వాటి ధరలు ఇలా ఉన్నాయి... సుప్రభాత సేవ: రూ.50, గోమాత పూజ: రూ.50, అర్చన: రూ.25, సహస్రనామార్చన: రూ.200, త్రిశతి అర్చన: రూ.125, సోమవారం ప్రదోషకాల సయంలో స్వామి అమ్మవార్లకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం: రూ.1,500 (ప్రతి సోమవారం, మాసశివరాత్రి, అమావాస్య, ఆరుద్ర నక్షత్రం రోజుల్లో), రోజువారి ఆర్జిత అభిషేక సేవల్లో రుద్రాభిషేకం (ఇద్దరు భక్తులకు అనుమతి): రూ.వెయ్యి, నిత్యదిట్ట అభిషేకం: రూ.100, శనీశ్వరాభిషేకం: రూ.150, అఖండ దీపారాధన: రూ.200, ప్రత్యేక ప్రవేశం: రూ.50, వీఐపీ బ్రేక్ దర్శనం: రూ.200, నిత్యోత్సవం: రూ.58, నిత్య కల్యాణోత్సవం: రూ.501, రుద్రహోమం: రూ.1,116, చండీహోమం: రూ.1,116, అష్టోత్తర స్వర్ణకమల పుష్పార్చన (శుక్రవారం మాత్రమే): రూ. 1,000, ప్రత్యేక ఆశీర్వచనం: రూ.500, సాధారణ సర్పదోష పూజలు: రూ.300, ప్రత్యేక సర్పదోష నివారణ పూజలు: రూ.750, ఆశీర్వచన, సర్పదోష నివారణ పూజలు: రూ.1,500, (అద్దాల మండపం పక్కన), ప్రత్యేక ఆశీర్వచన, సర్పదోష నివారణ పూజలు: రూ.2,500 (చెంగల్వరాయస్వామి ఆలయం వద్ద), వీవీఐపీ టికెట్టు రూ.5 వేలు (సహస్రలింగేశ్వరుడి సమీపంలో) ఏకాంత సేవ: రూ.200, వాహన పూజలు (పెద్దవి): రూ.25, (చిన్నవి): రూ.20, ఏకాంతసేవ: రూ.100. **- ఆంధ్రజ్యోతి, శ్రీకాళహస్తి.**

ఘనంగా సైనిక స్కూలు వ్యవస్థాపక దినోత్సవం

కలికిరి: స్థానిక సైనిక స్కూలు మూడో వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అధ్యాపకుడు కెప్టెన్ సైమన్‌జేవియర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అధ్యాపకురాలు ఇషానిమైత్రా, ఏవో స్క్వాడన్ లీడర్, టీకే సుమేష్, ప్రియాంక సుమేష్, పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న హెచ్ఎం సైమన్‌జేవియర్,విద్యార్థులు

వర్షం కోసం కప్పదేవర్లు

కలికిరి : మండలంలోని మహల్ కొత్తపల్లెకు చెందిన చిన్నారులు ఆదివారం వర్షం కోసం కప్పదేవర నిర్వహించారు. ఇందులో భాగంగా వర్షం బాగా కురవాలని, వీధుల్లో పర్యటించగా పలువురు చిన్నారు లపైనే కాక కప్పపై కూడా నీళ్లు పోశారు. అనంతరం బాహుదా నదికి వెళ్లి, ప్రత్యేక ప్రార్థనలు చేసి కప్పను విడిచిపెట్టారు.


మహల్ కొత్తపల్లెలో కప్పదేవర్లు నిర్వహిస్తున్న చిన్నారులు

ఉషారాణికి వాగ్గేయ రత్న అవార్డు ప్రదానం


రచయిత్రి ఉషారాణికి, మయూరినాథ్‌కు అవార్డును అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణీ తదితరులు

ఎర్రావారిపాళెం: మండలంలోని కోటకాడపల్లె ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రచయిత్రి ధనాశి ఉషారాణికి వాగ్గేయ రత్న అవార్డును వరసిద్ది కళాక్షేత్రం వారు ప్రదానం చేసింది. ఆదివారం చిత్తూరులో జరిగిన కళాక్షేత్రం వార్షికోత్సవ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి, చిత్తూరు మేయర్ కఠారి హేమలత ఆమెకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో వరసిద్ది కళా క్షేత్రం సంస్థ అధ్యక్షుడు మొగిలయ్యశెట్టి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు మునస్వామి పాల్గొన్నారు.

మయూర్‌నాథ్‌కు సర్వకళా ప్రవీణ అవార్డు ప్రదానం

పీలేరు : పట్టణంలోని వీఎస్ నర్తనశాల కళాక్షేత్రం వ్యవస్థాపకుడు, ప్రముఖ రంగస్థల నటుడు వి.మయూర్‌నాథశర్మకు సర్వకళా ప్రవీణ అవార్డును వరసిద్ధి కళాక్షేత్రం వారు ప్రదానం చేశారు. చిత్తూరులో ఆదివారం జరిగిన కళాక్షేత్రం వార్షికోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణీ, చిత్తూరు మేయర్ కఠారి హేమలతలు మయూర్‌నాథ్‌శర్మకు అందజేశారు.సంస్థ అధ్యక్షుడు మొగిలయ్యశెట్టి, రచయితలు, కవులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ విజయం ఖాయం

రొంపిచెర్ల : నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. చల్లా రామచంద్రా రెడ్డి గత వారం రోజులు గా రాష్ట్ర మంత్రి అమరనాథరెడ్డితో కలిసి నంద్యాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన వెంట రొంపిచెర్ల మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మాజీ అధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి, సర్పంచు రవికుమార్ నాయుడు, నాయకులు శేషాద్రినాయుడు, భాస్కరరెడ్డి, బషీర్ ఉన్నారు.

ఎన్ఐవోఎస్ పరీక్షకు 386మంది హాజరు

కలికిరి: మండలంలోని 14 కేంద్రాల్లో సాక్షరభారత్ ద్వారా నిర్వహించిన ఎన్ఐఓఎస్ పరీక్షకు 399 మందికి గాను 386 మంది హాజరయ్యారు. ఏపీవో చంద్రశేఖర్, ఎంసీవో శంకర్, మహల్‌లో సర్పంచు ఖాజాహుస్సేన్ పర్యవేక్షించారు. ● **భాకరాపేట/కల్లూరు :** చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో నిర్వహించిన పరీక్షను వయోజన విద్య కేంద్ర కార్యదర్శి మాణిక్‌మండల్ తనిఖీ చేశారు. మండలంలో 13 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 257మంది హాజరైనట్లు ఎంసీవో గిరిబాబు తెలిపారు. వీరి వెంట అమరావతి డిప్యూటీ డైరెక్టర్ సిద్దయ్య, చిత్తూరు డీసీ ఈశ్వరరెడ్డి, ఎంసీవో గిరిబాబు ఉన్నారు.● పులిచెర్ల మండలంలో 25 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 229మంది హాజరైనట్లు మండల సాక్షరభారత్ కో-ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి తెలిపారు.

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కలికిరి: గ్రామాల్లో గణపతి విగ్రహాలు నెలకొలిపి ఉత్సవాలు చేసేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి అనుమతి పొందాలని హెడ్‌కానిస్టేబుల్ రాజారాంరెడ్డి సూచించారు. విగ్రహాలను ఎన్ని రోజులు ఉంచుతారో ఎప్పుడు నిమజ్జనం చేస్తారో తెలపాలని సూచించారు.

24 పాఠశాలలకు అందని కోడిగుడ్లు

● **విద్యార్థులకు పోషక లోపం**

కల్లూరు : పులిచెర్ల మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథ కానికి కోడిగుడ్ల పంపిణీలో అస్తవ్యస్తంగా తయారైంది. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 2890 మంది విద్యార్థులున్నారు. వీరికి వారానికి మూడు కోడిగుడ్లు అందజేయాలి. ఇదివరలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోడిగుడ్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ ఏడాది నుంచి కోడిగుడ్ల పంపిణీని కాంట్రాక్టర్‌కు కట్టబెట్టింది. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. కాంట్రాక్టర్ ప్రతి సోమవారం కోడిగుడ్లు అందజేయాలి. అయితే ఆగస్టు నెలలో 24 పాఠశాలలకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో కోడిగుడ్ల పంపిణీ జరగలేదు. మిగిలిన పాఠశాలలోనూ అరకొరగా పంపిణీ జరిగినట్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులు తెలుపుతున్నారు. ఇలా కోడిగుడ్లు పంపిణీ కాకపోవడంతో విద్యార్థులకు పోషకాహారం లోపిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 24 పాఠశాలలకు కోడిగ్రుడ్లు పంపిణీ కాని విషయాన్ని ఎంఈవో సిద్దారామయ్య వద్ద ప్రస్తావించగా 24 పాఠశాలలకు కోడిగుడ్లను పంపిణీ చేయని విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పీలేరులో భారీ వర్షం



పీలేరు : పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు, వీధిరోడ్లు జలమయమయ్యాయి.దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా కొద్దిసేపు ఆగిపోవడంతో అంధకారం అలుముకుంది. మదనపల్లె-తిరుపతి ప్రధాన మార్గంలో అడుగు ఎత్తులో నీరు ప్రవహించాయి. లోతట్టు వీధుల్లోని కాలువలు పొంగి పొర్లడంతో మురుగునీరు రోడ్లపై చేరి దుర్గంధభరితమయ్యాయి. ఈ వర్షం మండలంలో వేరుశనగ పంటకు జీవం పోసింది.

ఉపాధ్యాయులకు త్వరలో కొత్త సర్వీసు రూల్స్

● **ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి**

పీలేరు : రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు కొత్త సర్వీసు రూల్స్‌ను త్వరలో అమలు కానున్నాయని, ఇందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చెప్పారు. పీలేరు మెయిన్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సర్వీసు రూల్స్ ద్వారా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల సమస్య కొలిక్కి వస్తుందన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌ను శాసనమండలిలో చర్చించి రాజకీయ పార్టీల మద్దతు పొంది ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. మోడల్ స్కూలు ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తెచ్చి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో తెలుగు మీడియంను రద్దు చేయడం దారుణమని, రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలను కలుపుకుని విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.ఈ సమావేశంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి రమేష్, నాయకులు రామచంద్ర, పోకల తాతయ్య, మహేశ్వరరెడ్డి, రాజేంద్ర, లక్ష్మీరెడ్డి, లోకనాధరెడ్డి, రాహత్‌బాషా, రమణారెడ్డి, శెట్టి సుబ్రమణ్యం, జాఫర్‌బాషా, అమరనాయక్, కృష్ణమూర్తి, మోహన్, జనార్దనరెడ్డి, మోహన్‌రెడ్డి , భాస్కరరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

కల్లూరు : పులిచెర్ల మండలంలో ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, కార్యకర్తలు ముందుండాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఇ.కృష్ణమూర్తి నాయుడు సూచించారు. కొత్తపేటలో మండలంలోని పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1నుంచి చేపట్టే ఇంటింటా టీడీపీ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

భాకరాపేట: వాహనచోదకులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని భాకరా పేట ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. చిన్నగొట్టిగల్లులో రోడ్డు భద్రతపై ఆటో, ట్రాక్టర్, డ్రైవర్లకు ఆయన ఆదివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, లైసెన్సు లేకపోయినా, నిబంధనలు అతిక్రమించిన డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పీలేరులో రాజీవ్‌గాంధీకి ఎన్ఎస్‌యూఐ నాయకుల నివాళి

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

పీలేరు/రొంపిచెర్ల : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పీలేరు పట్టణంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అమృతతేజ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కేక్‌కట్ చేశారు.రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ జాతీయ ప్రతినిధి శ్రీకాంత్, నాయకులు సయ్యద్, ఇమ్రాన్, ఆఫ్రిద్, కిరణ్, విశ్వకాంతబాబు, సంపత్, భాను, లోకేశ్, రాంబాబు పాల్గొన్నారు.● **రొంపిచెర్లలో** రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఎన్ఎస్‌యూఐ ఘనంగా నిర్వహించింది. బాలుర వసతిగృహంలో జిల్లా ఉపాధ్యక్షుడు వసీమ్‌అక్రమ్‌లు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో సాహుల్, కిరణ్ , చంద్ర, శీను తదితరులు పాల్గొన్నారు.


రొంపిచెర్లలో కేక్ కట్‌చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నేతలు

నేడు ఉలవల పంపిణీ

పీలేరు : మండలంలోని రైతులకు సోమవారం ఉచితంగా ఉలవలు పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. వేరుశనగ వేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు పంపిణీ చేస్తున్నామన్నారు. కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకురావాలని ఆమె కోరారు.

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు 23కి వాయిదా

పీలేరు : మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లకు పట్టణంలోని క్రాస్ రోడ్డు ఉన్న స్టేట్‌బ్యాంకు ఆఫ్‌ఇండియా, అజంతా మిట్టపై ఉన్న స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21న జరిగే ఇంటర్వ్యూలు ఈనెల 23కి వాయిదా వేశామని ఎంపీడీవో వసుంధర తెలిపారు.

పనికిరాని బోర్లు వారంలోగా మూసివేయాలి

కలకడ : మండలంలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బోర్లను మూసివేయాలని రైతులను ఎంపీడీవో ధనలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న సూచించారు. బోర్లు మూసివేసే ప్రక్రియను వారం రోజుల లోగా మూసివేయాలన్నారు. లేకుంటే ప్రమాదం బాధ్యతలవుతారని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కలికిరి: మండలంలోని పారపట్ల రీచ్ వద్ద ఆదివారం గ్రామస్తులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. బాహుదా నదిలో రీచ్ ఉన్నప్పటికీ పారపట్ల వద్ద నుంచే తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని గ్రామ స్తులు వాపోయారు. ట్రాక్టర్లను అడ్డ కోవడంతో తహసీల్దార్ నటరాజ్ రీచ్ వద్దకు వెళ్లి గ్రామస్తులతో చర్చించారు. అనుమతి ఉన్న ట్రిప్పులు మేరకు ఇసుకను తరలించాలని తహసీల్దార్ సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నూర్‌బాషా



కల్లూరు : పులిచెర్ల మండల తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నూర్ బాషాను నియమించినట్లు పులిచెర్ల మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తినాయుడు, లోకేశ్ తెలిపారు. తన నియామకానికి సహక రించిన టీడీపీ ఇన్ చార్జి వెంకటరమణ రాజు, రామనాథంనాయుడు, కృష్ణమూర్తినాయుడు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నియామకం పట్ల కల్లూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్య క్షుడు అన్వర్‌బాషా, కార్యదర్శి అన్వర్‌బాషా, నాయకులు పురుషోత్తం చౌదరి, అబ్బాస్, షఫీ, ఖాదర్‌వల్లీ, అల్తాఫ్, మస్తాన్, అబ్బు తదితరులు హర్షం తెలిపారు.

సినిమా గైడ్

షుకూర్	లై
ఎస్వీ మహల్	నక్షత్రం
ఎస్వీ డీలక్స్	నేనే రాజు నేనే మంత్రి
అజంతా	జయ జానకి నాయక

ఆంధ్రజ్యోతి
12 | చిత్తూరు
నగరి జోన్
సోమవారం 21 ఆగస్టు 2017
నగరి • నింద్ర • విజయపురం • సత్యవేడు • నాగలాపురం • పిచ్చాటూరు

గంగజాతరపై గ్రామసభ

నగరి: నగరిలో గంగజాతర నిర్వహణపై ఆదివారం పట్టణంలోని శివాలయంలో గ్రామపెద్దలు సభ నిర్వహించారు. సెప్టెంబర్ 5న జాతర చాటింపు, 12, 13, 14, 15 తేదీల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈసారి ప్రత్యేక కార్యక్రమాలతోపాటు యువతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ గ్రామ సభలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, జ్యోతిరెడ్డి, చిరంజీవులురెడ్డి, సి.కె.దయానిది, ఆనం శ్రీహరి, బాబు, కృష్ణారెడ్డి, బాబురెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.



చినుకు పడితే చిత్తడవుతున్న గ్రామీణ రోడ్లు

పిచ్చాటూరు: చిరు జల్లులకు సైతం మండలంలోని కొన్ని గ్రామీణ రహదారులు చిత్తడవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రాళ్ళ, రప్పలు, గుంతల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్ల మరమ్మతుల కోసం ప్రజలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. నాలుగు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నారు. దీంతో మండలంలో సుమారు 35 గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న చిన్న పాటి వర్షాలకు రహదారుల్లోని గుంతల్లోకి నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనాదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆ గుంతలకు కనీసం మట్టి తోలక పోడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. మండలంలోని పిచ్చాటూరు-శ్రీకాళహస్తి మార్గం నుంచి పాతగొల్లకండ్రిగ వరకు రోడ్డు, రెప్పాలపట్టు నుంచి అడవి కండ్రిగ రహదారి, కొత్త గొల్లకండ్రిగ నుంచి టికే పురం జడ్పీ హైస్కూలుకి వెళ్లే దారి, నీరువాయి-వేలూరు దారి, రజానగరం-రామగిరి, అరుణానది బాట, నారాయణరాజు కండ్రిగ-నాగలాపురం దారి, సిద్ధిరాజు కండ్రిగ యానాది కాలనీ దారి, హనుమంతాపురం-సురుటుపల్లి, అరుణానది రహదారి, శ్రీ రామాపురం దారులు దుస్థితికి చేరాయి. కొన్నేళ్లుగా రోడ్లు బాగు చేయాలని గ్రామీణులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వర్షం వస్తే రోడ్లు బురదమయంగా మారుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పాత గొల్లకండ్రిగ రహదారికి కంకర లేచి అధ్వానంగా మారింది. రూ.23 లక్షల ఉపాధి నిధులతో ఆ రోడ్డులో కంకర తోలారు. అయినే తారు వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతుల కు ప్రతిపాదనలు తయారు చేసి నిధులు మంజూరుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని గ్రామీణులు కోరుతున్నారు.



బురదమయమైన వెంకటరెడ్డి కండ్రిగ - గొల్లకండ్రిగ దారి

చవితికి సిద్ధమవుతున్న బొజ్జగణపయ్యలు

నగరి: ఈ నెల 25న వినాయకచవితిని పురస్కరించుకుని గణపయ్య విగ్రహాలు సిద్ధమయ్యాయి. నగరి కొండచుట్టు మండపం సమీపంలో మూడు నెలల నుంచి విగ్రహాల తయారీ చేపట్టారు. విజయపురం మండలం కేఆర్ పాళెంకు చెందిన కన్నయ్య, భాస్కర్ కుటుంబీకులు ఏడేళ్ళ నుంచి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.3 వేల నుంచి 25 వేల వరకు ధర పలుకుతోంది. ఇప్పటికే విగ్రహాల ఆర్డర్లు పూర్తయ్యాయి. కొంతమంది విగ్రహాలను కూడా తీసుకెళ్లారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విగ్రహాలను భద్రపరచడం కష్టంగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది విగ్రహాలను వాటర్ పెయింట్‌తోనే తీర్చిదిద్దినట్టు చెబుతున్నారు. నీటిలో సులభంగా నిమజ్జనమవుతుందని చెప్పారు.




తరలించడానికి సిద్ధంగా ఉన్న గణపయ్య విగ్రహాలు

పంటలను నాశనం చేస్తున్న అడవిపందులు

నగరి: నగరి మండలంలో పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో చెరకు, వేరుశనగ ఇతర పంటలను అడవి పందులు నాశనం చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మండలంలోని అయనంబాకం, దామరపాకం, చెర్లోకండ్రిగ, ఎంకొత్తూరు, తెరణి, ముడిపల్లి, అడవికొత్తూరు, మాంగాడు, కాకవేడు, నాగరాజకుప్పం, కృష్ణారామాపురం గ్రామాల పరిధిలో పందు లు నిత్యం పంటల్లోకి చొరబడి అందిన కాడికి నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

రైతుల తంటాలు

అడవి పందులు చొరబడకుండా తమ పంటలను కాపాడుకునే ప్రయత్నంలో కొన్ని చోట్ల కమ్మీలు చుట్టడం, అప్పుడప్పుడు రాత్రి వేళలో విద్యుత్‌ను వాడడం, వేరుశనగ పంటల్లో తెల్లటి గోనె సంచులు, కవర్లను నిలబెట్టడం, పెద్ద శబ్దం వచ్చేలా టపాకాయలను కాల్చడం లాంటివి చేస్తున్నారు. అయినా పందులు మాత్రం అదును చూసి తమ పని కానించేస్తున్నా యం టున్నారు. అడవి పందుల కోసం కరెంటు పెడితే రైతులకే అవి ఒక్కో సారి ప్రమాదాలు కొనితెచ్చే పరిస్థితులున్నాయి. నెల రోజుల క్రితం మండలంలోని చెర్లోకండ్రిగ వద్ద పొలం చుట్టూ అడవి పందుల కోసం కరెంటు పెడితే సమీప గ్రామానికి చెందిన ఓ రైతు అటువైపు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. దీనిపై సంబంధిత పొలం రైతు, అతని వద్ద పనిచేసే కాపలాదారు ఇరువురిపైనా నగరి పోలీస్‌స్టేషన్ లో కేసులు కూడా నమోదు చేశారు. ఇలా రైతులు తమ పంటలను కాపాడే ప్రయత్నంలో ఎన్ని చేసినా ఒక్కో సారి తీరని నష్టం కలిగిస్తుందంటున్నారు. అడవి పందుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



పంటను కాపాడుకోవడానికి కట్టిన గోనె సంచులు

నత్తనడకన చెక్‌డ్యాం నిర్మాణ పనులు

నగరి: నగరి మండలంలో నీరు-చెట్టు, నీరు-ప్రగతి పథకంలో మంజూరైన చెక్‌డ్యాం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నగరి మండలంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్లు చెక్‌డ్యాంలు, చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో ప్రధానంగా రూ.పది లక్షలలోపు 20 చెక్‌డ్యాం పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించారు. చెరువులకు టెండర్ల ప్రాతిపదికన పనుల కేటాయింపు జరిగింది. అయితే తొలి విడతగా వాగులు, వంకల్లో నీటి నిల్వ కోసం చెక్‌డ్యాంలను నిర్మిస్తున్నారు. కొన్ని చోట్ల పాత చెక్‌డ్యాంలను సరిచేస్తున్నారు. పనులు ఉత్సాహంగా ప్రారంభమైనా ఇటీవల వారం రోజులుగా నగరి ప్రాంతంలో మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షాలకు సైతం కాల్వల్లో నీరు ప్రవహించే పరిస్థితి ఉంది. దీంతో పనులకు అంతరాయం కలుగుతోంది. వీటికి తోడు సిమెంటు కొరత కూడా తీవ్రంగా ఉందని తెలిసింది.



తెరణి వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌డ్యాం

పాదిరి దళితవాడలో తాగునీటి సమస్య



ధ్వంసమైన పైపులైను

నింద్ర: మండలంలోని పాదిరి దళితవాడలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాదిరి దళితవాడకు పాదిరి గ్రామం ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి పైపులైన్ ద్వారా నీరు సరఫరా అవుతుండేది. ప్రస్తుతం పైపులైన్ ధ్వంసమవడంతో తాగునీరు సరఫరా కాలేదు. దీంతో దళితవాడ యువకులు మరమ్మతులు చేయడానికి వెళ్లితే ఓవర్‌హెడ్ ట్యాంకు తమ పొలంలో ఉందంటూ అడ్డుకుంటున్నాడని చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పైపులైన్ ను మరమ్మతులు చేపట్టి దళితవాడకు తాగునీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాజీవ్‌కు ఘన నివాళులు

నగరి: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నగరిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ భానుమూర్తి, బాబు, సి.కె.దయానిది తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

నగరి: నగరి పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం తిరుపతికి చెందిన సురేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరిగింది. నగరి, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వందమందికిపైగా పాల్గొన్నారు. వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, కొందరికి ఆపరేషన్లకు ప్రతిపాదించారు. డాక్టర్ సురేంద్ర, సిబ్బంది, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఓ.బాలసుబ్రహ్మణ్యం, కందస్వామిరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వికటించిన వైద్యం

లబోదిబోమంటున్న గొర్రెల పెంపకందారుడు

రామకుప్పం: తాను పెంచే గొర్రెలు ఆహారం సక్రమంగా తీసుకోవడం లేదని పశువైద్య సిబ్బందికి తెలపగా, వారిచ్చిన మందులు వికటించి ఓ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. మండల పరిధి జౌకుపల్లెకు చెందిన శ్రీనివాసులు 15 రోజుల క్రితం తమ గొర్రెలు తక్కువగా ఆహారం తీసుకుంటున్నాయని పశువైద్య సిబ్బందిని ఆశ్రయించాడు. వారు ఇచ్చిన మందును గొర్రెలకు తాపాడు. మరుసటి రోజు నుంచి గొర్రెలు దవడ వాచిపోయి మేత తినకుండా పళ్ళు కొరుక్కుంటూ వణకడం ప్రారంభించాయి. దీంతో గొర్రెలు చనిపోతాయోనన్న ఆందోళనతో శ్రీనివాసులు 110 గొర్రెలను అతి చౌకగా విక్రయించాడు.

ఎక్స్‌కవేటర్ యజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ

నాగలాపురం: మండల పరిధిలోని ఎక్స్‌కవేటర్ల డ్రైవర్లు, యజమాన్యులకు ఎస్ఐ మునిస్వామి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు జరిగితే యజమానులను కూడా శిక్ష పడుతుందన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. అనంతరం వాహనదారుల వద్ద రోడ్డు భద్రతపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు పొంగళ్ళు



విజయపురం: మండలంలోని మాధవరంలో ఎల్లమ్మ ఆలయంలో ఆడి ఆదివారం సందర్భంగా పొంగళ్ళు పెట్టారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

తహసీల్దార్ కార్యాలయానికి కొత్త శోభ



విజయపురం: విజయపురం తహసీల్దార్ కార్యాలయానికి కొత్త శోభ నెలకొంది. కార్యాలయం ఆవరణలోని చెట్ల చుట్టూ చప్టా నిర్మిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులు సేద తీరడానికి నిర్మిస్తున్నట్టు తహసీల్దార్ ధర్మయ్య చెప్పారు.

రెడ్డి నరసింహులుకు మహోపాధ్యాయ అవార్డు

సదుం: మండలంలోని రెడ్డివారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రెడ్డి నరసింహులుకు మహోపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆదివారం చిత్తూరు వరసిద్ధి వినాయక కళాక్షేత్రం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన పలువురికి అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యా రంగంలో ఉత్తమ సేవలందించినటువంటి రెడ్డినరసింహులు జడ్పీ ఛైర్మన్ గీర్వాణీ చేతుల మీదుగా మహోపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సహ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



పుంగనూరులో సిద్ధమైన వినాయక ప్రతిమలు

చవితి పూజకు గణపతి సిద్ధం

పుంగనూరు రూరల్: వినాయక చవితి పండుగ దగ్గర పడుతుండడంతో మార్కెట్‌లో గణపతి ప్రతిమలు సిద్ధమయ్యాయి. వివిధ రకాల రూపాలు, రంగులతో వినాయక ప్రతిమలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఆరు నెలలుగా కళాకారులు గణపతి ప్రతిమలను రూపుదిద్దారు. పుంగనూరు కుమ్మరవీధి, కోనేటిపాళ్యం, బైపాస్‌రోడ్డు, భగత్‌సింగ్ కాలనీ, ఎంబీటీరోడ్డు తదితర ప్రాంతాల్లో వినాయక ప్రతిమలను అధిక సంఖ్యలో తయారు చేస్తున్నారు. గ్రామాల్లో, వీధుల్లో గణపతి ప్రతిమలను నెలకొల్పేందుకు యువకులు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. దీంతో అంతటా చవితి పండుగ వాతావరణం నెలకొంది. రూ.50 నుంచి రూ.20వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఏటా వేలాది ప్రతిమలు విక్రయాలు జరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. కొంత మంది యువకులు ముందుగా ప్రతిమలను కొనుగోలు చేసి గ్రామాలకు తరలిస్తున్నారు.

అమ్మవారి నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె: బోయకొండగంగమ్మ ఆలయం ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

తాగునీరు కలుషితమవుతున్నా..పట్టించుకోరేం..?

పుంగనూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్న మండలస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి అంటురోగాలు ప్రబలుతున్నాయి. పుంగనూరు మండలం మాగాండ్లపల్లె పంచాయతీ మద్దనపల్లె ఉన్నత పాఠశాలకు తాగునీరు పైపులైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్ మరమ్మతులకు గురై రెండు నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో నీరు తాగిన వెంటనే పిల్లలకు జ్వరాలు ప్రబలుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలో నిల్వవున్న మురుగునీటి కుంటలో దోమలు పెరిగి అంటురోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. తాగునీటి కొళాయిలు మురుగు నీటి కాల్వల్లోనే ఏర్పాటు చేయడంతో తాగునీరు కలుషితమవుతూ విద్యార్థులు లంటువ్యాధుల బారిన పడుతున్నారు. తాగునీటి కుళాయిలను మురుగు నీటి కాల్వల నుంచి తొలగించాలని పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురినీటి కాల్వలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి, పాఠశాల పక్కనే నిలచిన మురుగునీటిని తొలగించి అంటురోగాల నుంచి తమ పిల్లలను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



పైపులైన్ మరమ్మతు గురికావడంతో నిల్వవున్న మురుగునీరు



మురుగునీటి కాల్వలో తాగునీరు పట్టుకుంటున్న విద్యార్థులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

రామసముద్రం: మండలంలోని 15 వేల మంది కార్మికుల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నామని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి సురేశ్‌బాబు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం ప్రతి నెలా 20వ తేదీన సమావేశం నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. బండ కార్మికురాలు కళావతమ్మ కాన్పునకు కార్మిక శాఖ రూ.20 వేలు అందించిందన్నారు. సమావేశంలో కృష్ణమూర్తి, రమేశ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, శ్రీరాములు, శ్యామదాసు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండలి పూజలు



సోమల: స్థానిక సాయి నగర్‌లోని శ్రీసాయిబాబా మందిరంలో మండలి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నూతనంగా ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి 40 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్వామివారికి కుంభాభిషేకం, హోమాది కార్యక్రమాలను సుదర్శనశాస్త్రి నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త నాగరాజ నేతృత్వం వహించారు. మల్లికార్జున, మునివెంకటప్ప, సిద్ధయ్య, శ్రీరాములు, మోహన్, బి.ఎం.వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	ఆనందో బ్రహ్మ
తాజ్‌మహల్	జయ జానకి నాయక
గోకుల్	నేనే రాజు నేనే మంత్రి
ఎంఎస్ఆర్	లై

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

చౌడేపల్లె: గ్రామాల్లో వినాయక ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే వినాయక విగ్రహాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమతులు పొందాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



పుంగనూరు: స్థానిక జమీందారీ ప్యాలెస్ సమీపంలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో హరిహరసుతన్ సేవా సంఘం సభ్యులు అయ్యప్పమాల ధరించిన భక్తులకు ఆదివారం అన్నదానం చేశారు. ఎనిమిదేళ్లుగా దాతల సాయంతో 41 రోజులు అన్నదానం చేస్తున్నారు.

వృత్తికి అంకితమైతే గుర్తింపు

సోమల: ఉపాధ్యాయ వృత్తికి అంకితమైతే సమాజంలో గుర్తింపు లభిస్తోందని ఎంఈవో బాలాజీనాయక్ సూచించారు. కందూరులో జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపికైన గంగిరెడ్డిపురం పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీపతి, శోభారాణిలను పలువురు ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు. సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో ప్రధాని మోదీ నుంచి పాఠశాల ఉపాధ్యాయులు జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 21 పాఠశాలల్లో గంగిరెడ్డిపురం పాఠశాల వుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రామచంద్ర, జీసీకే.ప్రసాద్, జిల్లా కౌన్సిలర్ రమణయ్య, నాయకులు సూర్యప్రకాశ్, పార్థసారథి, రాజశేఖర్, చెన్నకేశవులు, ఇందిరాంబ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సోమల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నంజంపేట సప్తగిరి బ్యాంకు, సోమల ఎస్బీఐ, మధ్యాహ్నం 2గంటలకు సోమల కార్పొరేషన్ బ్యాంక్, కందూరు సప్తగిరి బ్యాంకులు చేసే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

రోడ్డు ఇలా.. గ్రామానికి వెళ్లేదెలా..?

పుంగనూరు రూరల్: వర్షం కురిస్తే గ్రామాల నుంచి బయటకు రావాలన్నా.. ఇంటికి వెళ్లాలన్నా నరకయాతనే. రోడ్లు గుంతలమై.. వర్షపునీరు చేరి.. చెరువులవుతున్నాయి. ఇందుకు మండలంలోని మాగాండ్లపల్లె పంచాయతీ బర్నేపల్లె రోడ్డు నిదర్శనం. కల్వర్టు లేకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురైయింది. దీంతో విద్యార్థులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పుంగనూరు-బర్నేపల్లెకు దారిలో నిలిచిన వర్షపు నీరు

ఉపాధ్యాయులు సమాజ సేవకులు



సన్మానం అందుకున్న బదిలీ అయిన ఉపాధ్యాయులు

పుంగనూరు: సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణప్ప అన్నారు. స్థానిక బసవరాజ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో మండలంలో బదిలీలైన ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో లీలారాణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా గౌరవాధ్యక్షుడు సురేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెన్నశెట్టి, లను సన్మానించారు.

ఎన్ఐవోఎస్ పరీక్షలకు 378 మంది హాజరు

రామసముద్రం: మండలంలోని 18 పంచాయతీల్లో నిరంతర విద్యా కేంద్రాల్లో 13వ విడత పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీవో మంజునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన సంకల్ప సిద్ధి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో 440 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 378 మంది హాజరయ్యారని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన 13 విడతల్లో 5500 మందిని అక్షరాస్యులుగా తయారయ్యారని తెలిపారు.



పరీక్షలు తనిఖీలు చేస్తున్న ఎంసీవో మంజునాథ్